PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD www.ntnews.com /ntdailyonline

మన రాష్ట్రం మన పత్రిక


నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

గురువారం THURSDAY 10.10.2024

సంపుటి (Volume): 14 || సంచిక (Issue): 126 || వెల (Price) రూ.6.50

హైదరాబాద్ HYDERABAD పేజీలు: 14+4 Pages: 14 + 4



రతన్ టాటా అస్తమయం


- అనారోగ్యంతో కన్నుమూసిన పారిశ్రామిక దిగ్గజం
- 86 ఏండ్ల వయసులో తుదిశ్వాస వదిలిన దాతృశీలి
- సాల్ట్ టు సాఫ్ట్‌వేర్.. అనేక రంగాల్లో చెరగని ముద్ర
- సామాన్యుల ప్రయోజనాలకే టాటా పెద్ద పీట
- ఆవిష్కరణలకు చేయూతనిచ్చిన స్టార్టప్ గురు
- సంతాపం తెలిపిన రాజకీయ, వ్యాపార ప్రముఖులు

‘మెయిన్’ మలుపు ఆ భేటీయే?!

బాబు- రేవంత్ భేటీ తర్వాత కీలక పరిణామాలు



ఫిబ్రవరిలో ఇచ్చిన తొలి నోటిఫికేషన్‌లో మూసీ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.58,775 కోట్లు (7 బిలియన్ అమెరికన్ డాలర్లు)గా పేర్కొన్న డాక్యుమెంట్



ఫిబ్రవరిలో ఇచ్చిన తొలి నోటిఫికేషన్ ప్రకారం మూసీ ప్రాజెక్టు అర్హత సాధించి ఆర్‌పీఎఫ్ వ్యక్తం చేసిన ఐదు కంపెనీలు ఇవే..

- లోక్‌సభ ఎన్నికలకు ముందే మూసీ ఆలోచన
- 58 వేల కోట్ల అంచనాతో టెండర్ కూడా జారీ
- బిడ్ల గడువు పూర్తి.. ఎల్ -1 సాయి కన్సల్టెన్సీ
- మేలో ఏపీ ఎన్నికల్లో చంద్రబాబు విజయం
- జూలైలో తెలంగాణ సీఎం రేవంత్‌తో మీటింగ్
- తర్వాత 16 రోజులకే టెండర్ల రద్దుకు నిర్ణయం
- రెండోసారి టెండర్లలో ఎల్ -1పై సాంకేతిక అనర్హత!
- కన్సల్టెన్సీ బాధ్యత మెయిన్‌హార్ట్‌కు అప్పగింత!

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ అంచనా వ్యయంలోనే కాదు, మాస్టర్‌ప్లాన్ తయారీ కన్సల్టెన్సీ ఎంపిక టెండర్లలోనూ భారీ గోల్‌మాల్ జరిగినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మొదటిసారి టెండర్ నోటిఫికేషన్ జారీచేసిన ఎంఆర్‌డీసీఎల్ అధికారులు ప్రైస్ బిడ్లను తెరిచి ఆర్నెల్ల తర్వాత వాటిని రద్దు చేయడం ఒకవంతైతే, కేవలం వారం వ్యవధిలోనే రెండోసారి టెండర్లు పిలిచి రెండు నెలల్లోపే మెయిన్‌హార్ట్‌కు పనుల అప్పగింత ప్రక్రియను అధికారికంగా పూర్తి చేయడం మరో వంతు. అంతేకాదు, › 2వ పేజీలో

కథా క్రమం

మూసీ ప్రాజెక్టు సింగపూర్ కంపెనీ మెయిన్‌హార్ట్‌కే ఎలా దక్కింది? ఎందుకు దక్కింది? దీని మూలాలు తవ్వినకొద్దీ ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నిజానికి తెలంగాణకు చెందిన కన్సల్టెన్సీకి రావాల్సిన టెండరు, చంద్రబాబు- రేవంత్ మీటింగ్ తర్వాత అకస్మాత్తుగా రద్దైనట్టు, తర్వాత మెయిన్‌హార్ట్ కంపెనీకి దక్కినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ కథాక్రమం ఇదిగో

01 — 05.02.2024
మూసీ ప్రాజెక్టు మాస్టర్‌ప్లాన్ కోసం తొలి టెండరు నోటిఫికేషన్ జారీ అయింది. దీన్ని ఏడోతేదీ అప్‌లోడ్ చేసారు. బిడ్ల దాఖలుకు మార్చి 22ను గడువుగా పెట్టారు. గడువు లోగా 10 కంపెనీలు ఆసక్తి వ్యక్తీకరణ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్- ఈవోఐ) బిడ్లు దాఖలు చేశాయి. ఇందులో ఏడు కంపెనీలు సాంకేతిక అర్హత సాధించాయి. తర్వాత ఏప్రిల్ 10న రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్‌కు నోటిఫికేషన్ జారీ అయింది. 5 కంపెనీలే బిడ్లు దాఖలు చేశాయి.

02 — 24.06.2024
ఆర్‌ఎఫ్‌పీ బిడ్ల దాఖలు గడువు ముగిసింది. 5 కంపెనీల్లో తెలంగాణకు చెందిన సాయి కన్సల్టెన్సీ రూ.60 కోట్లతో ఎల్ -1గా నిలవగా, ట్రాక్టెబెల్ అనే కంపెనీ 75 కోట్లు కోట్ చేసి ఎల్ -2గా నిలిచినట్టు తెలిసింది.

03 — 06.07.2024
ఏపీ సీఎం బాబు హైదరాబాద్‌కు వచ్చి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. ఇరు రాష్ర్టాల మధ్య సమస్యల పరిష్కారం కోసమే ఈ సమావేశమనే ప్రకటన వెలువడింది.

04 — 20.07.2024
మూసీ ప్రాజెక్టు మీద టెండర్ ఎవాల్యుయేషన్ కమిటీ ఏర్పాటు చేస్తూ జీవో ఆర్టీ నం.325 జారీ అయింది. ఏర్పాటైన రెండు రోజులకే, జూలై 22న కమిటీ తొలి భేటీ జరిగింది. మూసీ టెండర్లను రద్దు చేయాలని అందులో నిర్ణయించారు. ఇది జరిగి రెండు రోజులు తిరక్కముందే జూలై 24న మూసీ టెండర్ల రద్దు కోసం ఎమ్మార్డీసీఎల్ ఎండీ ప్రభుత్వానికి లేఖ రాశారు.

05 — 03.08.2024
మూసీ టెండర్లను రద్దు చేసి, తిరిగి నోటిఫికేషన్ ఇచ్చేందుకు రేవంత్ సర్కారు అనుమతినిచ్చింది. తర్వాత మూడు రోజులకే అంటే 6వ తేదీన పాత టెండర్లు రద్దు చేసినట్టు తెలిసింది.

06 — 09-08-2024
టెండర్ ఎవాల్యుయేషన్ కమిటీ మళ్లీ సమావేశమై కొత్త నోటిఫికేషన్‌కు నిర్ణయించింది. తర్వాత 5 రోజులకు అంటే ఆగస్టు 13న కొత్త నోటిఫికేషన్ జారీ అయింది.

07 — 12.09.2024
బిడ్లకు గడువు ముగిసింది. ఈసారి కేవలం రెండు కంపెనీలే బిడ్లు దాఖలు చేశాయి. ఇందులో ఒకటి మెయిన్‌హార్ట్ కాగా, మరొకటి లీ అసోసియేట్స్ అని సమాచారం. లీ అసోసియేట్స్ 141 కోట్లకు బిడ్ వేసి ఎల్ -1గా నిలవగా, మెయిన్‌హార్ట్ 143 కోట్లతో ఎల్ -2గా ఉన్నట్టు తెలిసింది.

08 — 20.09.2024
మూడోసారి టెండర్ ఎవాల్యుయేషన్ కమిటీ సమావేశం. ఎల్ -1గా లీ అసోసియేట్స్‌ని సాంకేతిక కారణాలతో తిరస్కరించి, మెయిన్‌హార్ట్ కన్సార్షియంకు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయం. తర్వాత పది రోజులకు (4న) ప్రభుత్వం దీన్ని ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సందేహాలివీ...

1. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోగానీ, ఎన్నికల ప్రచారంలో గానీ కాంగ్రెస్ అగ్రనేతల మాటల్లోగానీ ఎక్కడా ప్రస్తావనకు నోచుకోని మూసీ సుందరీకరణ ప్రాజెక్టు సరిగ్గా లోక్‌సభ ఎన్నికలకు ముందు ఎందుకు పురుడుపోసుకున్నది? ఎన్నికల ఫలితాల తర్వాత ఎందుకు అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి.?
2. ఫిబ్రవరిలో ఇచ్చిన తొలి నోటిఫికేషన్‌లో రూ.58,775 కోట్లు (7 బిలియన్ అమెరికన్ డాలర్లు)గా పేర్కొన్న మూసీ ప్రాజెక్టు అంచనా వ్యయం తర్వాత మూడింతలు ఎందుకు పెరిగింది?
4. బాబు హైదరాబాద్ వచ్చి సమావేశమైన తర్వాత 15 రోజులు గడవక ముందే పాత టెండర్ నోటిఫికేషన్ ఎందుకు రద్దైంది? అందులో ఎల్ -1గా నిలిచిన తెలంగాణ కంపెనీ సాయి కన్సల్టింగ్ ఇంజనీరింగ్‌కు అవకాశం ఎందుకు దక్కలేదు?
5. రెండో టెండర్‌లోనూ ఎల్ -1గా నిలిచిన లీ అసోసియేట్స్‌కు ప్రాజెక్టు ఇవ్వకుండా అడ్డుపడ్డ ‘సాంకేతిక కారణాలు’ ఏమిటి? మొదటి, రెండో టెండర్లు రెంటిలోనూ ఎల్ -1గా నిలవకున్నా, కొందరు పెద్దలకు సన్నిహితమని పేరున్న మెయిన్‌హార్ట్‌కు ప్రాజెక్టు ఎలా దక్కింది?
6. తొలి టెండర్లలో సాంకేతికంగా ఫిట్ అయిన లీ అసోసియేట్స్, రెండో టెండర్‌లో ఎందుకు అన్-ఫిట్ అయ్యింది? మొదటి టెండర్లలో ఎల్ -1గా లేని మెయిన్ హార్ట్ రెండో టెండర్లో ఎల్ -1గా ఎలా వచ్చింది?

ఐదున్నరేండ్లు మెయిన్‌హార్ట్ చేతిలో మూసీ

ఐదు రోజుల క్రితమే అంగీకార పత్రం పంపిన సర్కారు! › 2

లక్ష కోట్ల అవినీతికి మూసీ స్కెచ్

- కమీషన్లు రావనే సంక్షేమ పథకాలను పక్కన పెట్టి.. మూసీకి గ్రీన్‌సిగ్నల్
- బీఆర్‌ఎస్ ఉన్నంత వరకూ భయం వద్దు

కేటీఆర్ › 6

ఫార్మాపై ఫార్మర్ల పోరు



వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో ఫార్మా కంపెనీల ఏర్పాటును వ్యతిరేకిస్తున్న రైతులకు మద్దతుగా పాదయాత్రకు సిద్ధమైన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిలను తుంకిమెట్ల వద్ద పోలీసులు అరెస్టు చేశారు. దాంతో మహాధర్నాకు తరలి వచ్చిన రైతులు, బీఆర్‌ఎస్ నాయకుల అరెస్టును ఖండిస్తూ హకీంపేట కూడలిలో పెద్ద ఎత్తున రైతులు ధర్నా చేపట్టారు. ఆ సందర్భంగా పోలీసులకు.. బాధిత రైతులు, బీఆర్‌ఎస్ నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. › 5

ముహూర్తం: గురువారం, సూర్యోదయం: 6-08, సూర్యాస్తమయం: 5-58. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం శరత్ రుతువు ఆశ్వయుజ మాసం శుక్ల పక్షం తిథి: సప్తమి పగలు 12-32 వరకు, తదుపరి అష్టమి. నక్షత్రం: పూర్వాషాఢ తెల్లవారుజామున 5-41 వరకు. వర్జ్యం: పగలు 3-01 నుంచి సాయత్రం 4-40 వరకు. రాహుకాలం: పగలు 1-31 నుంచి పగలు 2-59 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 10-04 నుంచి ఉదయం 10-52 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 2-48 నుంచి పగలు 3-35 వరకు. అమృతకాలం: రాత్రి 12-27 నుంచి రాత్రి 2-25 వరకు. చిత్త కార్తె పగలు 2-06 గంటలకు. దుర్గాష్టమి.





కొరివి దయ్యం రేవంత్

- తెలంగాణ సూరీడు కేసీఆర్
- 2014లోనే రేవంత్‌కి అధికారమిస్తే అప్పుడే రాష్ట్రాన్నే అమ్మేసేటోడు
- విద్యార్థులకు బిల్లా, రంగాల గురించి బోధించాలని టీచర్లకు చెప్తున్నవా?
- రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు ఫైర్ › 11

ఇందిరమ్మ పేరుతో ఇండ్లు కూలుస్తరా?



- రేవంత్ సర్కారు తీరుపై కాంగ్రెస్ నేత ఆగ్రహం
- ప్రజలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఏకపక్షంగా ఇండ్లు కూల్చడం సరికాదు › 2
- ఇందిరా కాంగ్రెస్ పేదలకు ఇండ్లు నిర్మిస్తే మనం కూలగొడుతున్నం
- హైడ్రా తీరుతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి.. పేదలు రోడ్డున పడుతున్నరు
- సీఎంకు హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ లేఖ

వామ్మో..సర్కారోళ్లు!

- ఎఫ్‌టీఎల్‌కు ఎవరు వచ్చినా ఉలికిపాటు
- బతుకమ్మ ఏర్పాట్లకు వెళ్లిన ఎమ్మార్వో
- ఇండ్ల సర్వే కోసమే వచ్చారని అనుమానం
- వరంగల్‌లో దాడి చేసిన స్థానికులు › 3
- పోలీస్ స్టేషన్‌లో అధికారి ఫిర్యాదు

భట్టి పెట్టిన రియల్టీ చిచ్చు › 2

- కార్పొరేట్ రియల్ వ్యాపారులు లబోదిబో
- ఆక్రమణలని భట్టి తేల్చడంతో తంటాలు
- నిర్మాణాలకు బ్యాంకుల నుంచి నోటీసులు
- పెట్టుబడి వెనక్కి ఇవ్వాలని వ్యాపారుల ఒత్తిళ్లు

నమస్తే తెలంగాణ

‘మెయిన్’ మలుపు ఆ భేటీయే?!

▸ మూడోపేజీ తరువాయి...

రెండోసారి టెండర్లలో మెయిన్‌హార్ట్ కంపెనీ కంటే లీ అసోసియేట్స్ తక్కువ మొత్తానికి కోట్ చేసినప్పటికీ అధికారులు సాంకేతిక కారణాన్ని చూపి లీ అసోసియేట్స్‌ను ఎలిమినేట్ చేసినట్టు విశ్వసనీయం సమాచారం. ప్రధానంగా సీఎం రేవంత్‌రెడ్డితో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అధికారికంగా భేటీ అయిన తర్వాతనే ఈ టెండర్ల ప్రక్రియలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెయిన్‌హార్ట్‌కు మూసీ సుందరీకరణ బాధ్యతలు అప్పగించేందుకే టెండర్ల ప్రక్రియను అద్యంతం తామనుకున్నట్టు నడిపించారని తెలిపింది.



రోజుకో మలుపు

మూసీ సుందరీకరణ ప్రాజెక్టు వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతున్నది. ఈ ప్రాజెక్టును నిర్వహించే మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) అధికారులు ఆదిలో నిబంధనల ప్రకారమే టెండర్ల ప్రక్రియను నిర్వహించినప్పటికీ అనంతరం ‘సాంకేతిక కారణాలు’ అనే ముసుగు తొడిగి, నిబంధనలకు తిలోదకాలివ్వడం వెనక ‘పెద్దల’ జోక్యం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూసీ సుందరీకరణ ప్రాజెక్టును రూ.50 వేల కోట్లతో చేపడుతున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ క్రమంలో ఎంఆర్‌డీసీఎల్ అధికారులు ప్రాజెక్టు మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు కన్సల్టెన్సీ ఎంపికను చేపట్టారు. ఈ మేరకు ఎంఆర్‌డీసీఎల్ అధికారులు ఆసక్తి వ్యక్తీకరణ బిడ్ల కోసం ఈ ఏడాది ఫిబ్రవరి ఐదో తేదీన టెండర్ నోటీస్ (నెం.05/ఎస్‌ఈ(ఎంఆర్‌డీసీఎల్)/2023-24, తేదీ: 5.2.2024) జారీ చేశారు. ఇందుకుగాను పది కంపెనీలు ముందుకొచ్చి బిడ్లు దాఖలు చేశాయి. నిబంధనల ప్రకారం అధికారులు ప్రీ బిడ్ సమావేశాన్ని కూడా ఏర్పాటు చేశారు. బిడ్లు దాఖలు చేసిన వాటిలో నిబంధనల మేరకు ఏడు కన్సల్టెన్సీ కంపెనీలు సాంకేతిక అర్హత సాధించాయి. అనంతరం అధికారులు ఏప్రిల్ 10వ తేదీన ఆర్‌ఎఫ్‌పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) నోటిఫికేషన్ జారీచేశారు. ఇందులో బిడ్ల దాఖలును అదే రోజు ప్రారంభించి, చివరి తేదీని జూన్ 24గా నిర్ణయించారు. అయితే సాంకేతిక అర్హత సాధించిన ఏడు కంపెనీల్లో ఐదు కంపెనీలు మాత్రమే ఈ నోటిఫికేషన్‌కు స్పందించి, ఆర్‌ఎఫ్‌పీని సమర్పించాయి. అందులో లీ అసోసియేట్స్ సౌత్ ఏషియా ప్రైవేటు లిమిటెడ్, జురాంగ్ కన్సల్టెంట్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, ట్రాక్టబుల్ ఇంజినీరింగ్ ప్రైవేటు లిమిటెడ్, సాయి కన్సల్టెన్సీ ఇంజినీరింగ్ లిమిటెడ్, మెయిన్‌హార్ట్ సింగపూర్ ప్రైవేటు లిమిటెడ్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ప్రైస్ బిడ్లను తెరవగా అందులో అతి తక్కువగా సాయి కన్సల్టెన్సీ కంపెనీ రూ.60 కోట్లకు కోట్ చేసి ఎల్-1గా నిలిచి, ఎల్-2గా ట్రాక్టబుల్ ఇంజినీరింగ్ ప్రైవేటు లిమిటెడ్ రూ.75 కోట్లను కోట్ చేసినట్టు తెలిసింది. దీంతో సాయి కన్సల్టెన్సీకి అధికారులు బాధ్యతను అప్పగించాలి. కానీ ఆతర్వాత సీన్ మారింది. సాంకేతిక కారణాలతో ఆర్‌ఎఫ్‌పీ టెండర్లను రద్దు చేస్తున్నట్టుగా ఎంఆర్‌డీసీఎల్ అధికారులు ఆగస్టు ఆరో తేదీన నిర్ణయం తీసుకున్నారు. అసలు ఆ సాంకేతిక కారణాలేమిటో? ఎందుకు రద్దు చేశారనేది అధికారులు వెల్లడించడం లేదు.

రెండోసారి నోటిఫికేషన్ జారీ

ఎంఆర్‌డీసీఎల్ అధికారులు మొదటిసారి ఆర్‌ఎఫ్‌పీ నోటిఫికేషన్‌ను రద్దుచేసిన వారం రోజుల్లోనే రెండో దఫా నోటిఫికేషన్ జారీచేశారు. ఆగస్టు 13న బిడ్ల దాఖలును మొదలుపెట్టిన అధికారులు చివరి తేదీని సెప్టెంబరు 12గా నిర్ణయించారు. అయితే ఈసారి మాత్రం కేవలం రెండు కన్సల్టెన్సీ కంపెనీలు మాత్రమే బిడ్లు దాఖలు చేసినట్టు తెలిసింది. ఇందులో లీ అసోసియేట్స్ ఒకటికాగా, రెండోది మెయిన్‌హార్ట్ సింగపూర్ ప్రైవేటు లిమిటెడ్. గతంలో ఏకంగా పది కంపెనీలు ఉత్సాహంగా ముందుకొచ్చిన పరిస్థితి నుంచి రెండోసారి కేవలం రెండు కంపెనీలు మాత్రమే బిడ్లు దాఖలు చేయడంపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రెండు కంపెనీలకు సంబంధించిన ప్రైస్ బిడ్లను తెరవగా అందులో లీ అసోసియేట్స్ రూ.141 కోట్లు కోట్ చేస్తే, మెయినహార్ట్ కన్సల్టెన్సీ రూ.143 కోట్లు కోట్ చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఎంఆర్‌డీసీఎల్ అధికారులు లీ అసోసియేట్స్‌ను ఎల్-1గా నిర్ధారించి బాధ్యతలు అప్పగించాలి. కానీ, ఇక్కడే అసలు మతలబు చోటుచేసుకుందనే ఆరోపణలున్నాయి. తర్జనభర్జనల తర్వాత అధికారులు లీ అసోసియేట్స్ బిడ్‌ను సాంకేతిక కారణాలతో తిరస్కరించినట్టుగా సమాచారం. ఇక మిగిలింది మెయిన్‌హార్ట్ కావడంతో దాని బిడ్‌ను సుమారు రూ.141 కోట్లుగా నిర్ధారించి, ఎల్-1గా ఎంపిక చేసినట్టు తెలిసింది.

రేవంత్-బాబు భేటీ తర్వాతే..

ఎంఆర్‌డీసీఎల్ అధికారులు ఆదిలో నిబంధనల ప్రకారమే టెండర్ల ప్రక్రియను ముందుకు తీసుకుపోగా, తదుపరి ఎందుకు ఇంత గందరగోళానికి తావిచ్చారనే దానిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమరావతి గ్రాఫిక్స్ సృష్టికర్త సింగపూర్ మాజీ మంత్రి ఈశ్వరన్‌తో సంబంధాలున్న మెయిన్‌హార్ట్‌కు మూసీ మాస్టర్‌ప్లాన్ బాధ్యతలు అప్పగించేందుకు తెర వెనక పెద్ద వ్యక్తులే పావులు కదిపారనే ప్రచారం జరుగుతున్నది. రేవంత్, చంద్రబాబు భేటీ తర్వాతే ఇందులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయనే ప్రచారమూ పెద్దఎత్తున జరుగుతున్నది.

అంచనా వ్యయం రూ.58 వేల కోట్లే!

వాస్తవానికి మూసీ సుందరీకరణ అంచనా వ్యయం రూ.58వేల కోట్లే. ఇదే విషయాన్ని ఎంఆర్‌డీసీఎల్ అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరిలో జారీచేసిన టెండరు నోటీసు డాక్యుమెంట్లలో స్పష్టంగా పొందుపరిచారు. 31 పేజీల డాక్యుమెంట్లలో 13వ పేజీలో మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు వ్యయం ఏడు బిలియన్ అమెరికా డాలర్లు (సుమారు రూ.58,775.22 కోట్లు) ఉంటుందని అంచనా వేస్తున్నట్టుగా పేర్కొన్నారు. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి కూడా పలుసార్లు రూ.50వేల కోట్లతో మూసీ సుందరీకరణ చేపడతామని ప్రకటించారు. కానీ, మెయిన్‌హార్ట్ రంగ ప్రవేశం తర్వాత అమాంతంగా అది లక్షన్నర కోట్లకు ఎగబాకింది. సీఎం నోటి నుంచి ప్రకటన రూపంలో రావడం మొదలైంది. అయితే, తొలిసారి లక్షన్నర కోట్ల వ్యయాన్ని ప్రకటించిన ముఖ్యమంత్రి... పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో కేవలం మూసీ సుందరీకరణ కోసమే కాదు, ఐదేండ్లలో హైదరాబాద్ అభివృద్ధి కోసమని అన్నారు.

ఎప్పుడు.. ఏం జరిగింది?

- 06.02.2024న మెయిన్‌హార్ట్ ప్రతినిధుల బృందం సీఎం రేవంత్‌ను కలిసింది.
- **మే నెల చివరలో మెయిన్‌హార్ట్ కన్సల్టెన్సీ కంపెనీ లక్షన్నర కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్టు తెలిసింది.**
- ఈ క్రమంలో మొదటిసారి టెండర్ల ప్రకారం ఆర్‌ఎఫ్‌పీ బిడ్ల దాఖలు 24.6.2024న ముగిసింది. దీని ప్రకారం ఎంఆర్‌డీసీఎల్ అధికారులు ప్రైస్ బిడ్లను తెరవగా, ఎల్-1గా సాయి కన్సల్టెన్సీ నిలిచింది. అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకొని ఎంపిక ప్రక్రియకు ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపాలి. మరి అధికారులు పంపారో, లేదో తెలియదుగానీ సాయి కన్సల్టెన్సీని ఎంపిక చేసినట్టుగా మాత్రం ప్రకటించలేదు.
- **నగరంలోని ప్రజాభవన్‌లో 6.7.2024న రెండు రాష్ర్టాల ముఖ్యమంత్రులు భేటీ అయ్యారు.**
- అనంతరం కొన్నిరోజుల పాటు టెండర్ల ప్రక్రియపై స్తబ్దత నెలకొంది. తిరిగి ప్రభుత్వం హుటాహుటిన 20.7.2024న జీవో ఆర్టీ నంబరు 325 జారీచేసింది. మూసీ మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించి కన్సల్టెన్సీ ఎంపిక కోసం చేపట్టే ఆర్‌పీఎఫ్ టెండర్ల పరిశీలనకు సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సీ చైర్మన్‌గా, పురపాలక శాఖలోని ఏడు విభాగాలకు చెందిన ఇంజినీర్లు సభ్యులుగా నియమించింది.
- **ఈ కమిటీ 22.7.2024న భేటీ అయింది. సాయి కన్సల్టెన్సీ ఎంపికైన ఆర్‌పీఎఫ్ టెండర్ల ప్రక్రియను రద్దు చేస్తున్నట్టుగా నిర్ణయించింది.**
- కమిటీ నిర్ణయానికి అనుగుణంగా ఎంఆర్‌డీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ 24.7.2024న టెండర్ల రద్దు కోసం ప్రభుత్వానికి లేఖ రాశారు.
- **ఎండీ లేఖను పరిశీలించిన ప్రభుత్వం తిరిగి మరోసారి ఆర్‌పీఎఫ్ టెండర్ నోటీసు జారీచేసేందుకు ఎంఆర్‌డీసీఎల్‌కు అనుమతినిస్తూ 3.8.2024న జీవో ఆర్టీ నంబరు 343 జారీచేసింది. టెండరు ఎవాల్యుయేషన్ కమిటీ హైదరాబాద్ మెట్రో రైలు అధికారుల అభిప్రాయాలు తీసుకొని టెండరు నోటీస్ (ఆర్‌ఎఫ్‌పీ)లో మార్పులు చేసి, కొత్తగా టెండరు నోటీసు జారీచేసేందుకు అనుమతినిస్తున్నట్టు పేర్కొన్నారు.**
- అనంతరం 6.8.2024న తొలుత జారీచేసిన ఆర్‌ఎఫ్‌పీ టెండరు నోటీసును రద్దు చేస్తూ ఎంఆర్‌డీసీఎల్ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.
- **టెండరు ఎవాల్యుయేషన్ కమిటీ 9.8.2024న మరోసారి భేటీ అయి కొత్త టెండరు నోటీసు జారీకి నిర్ణయించింది.**
- 13.8.2024న రెండోసారి జారీచేసిన ఆర్‌ఎఫ్‌పీ టెండరు నోటీసులకు అనుగుణంగా బిడ్లను తీసుకోవడం ప్రారంభించారు.
- **బిడ్ల దాఖలుకు 12.9.2024న చివరి తేదీగా నిర్ణయించారు.**
- 20.9.2024న మూడోసారి టెండరు ఎవాల్యుయేషన్ కమిటీ భేటీ అయింది. మెయిన్‌హార్ట్ సింగపూర్ ప్రైవేటు లిమిటెడ్ కన్సార్షియంకు మూసీ మాస్టర్‌ప్లాన్ బాధ్యతల అప్పగింతకు నిర్ణయించింది.
- **మెయిన్‌హార్ట్ కన్సార్షియం సింగపూర్ ప్రైవేటు లిమిటెడ్‌కు మూసీ మాస్టర్‌ప్లాన్ బాధ్యతల అప్పగింత ప్రతిపాదనలను ఆమోదించాల్సిందిగా ఎంఆర్‌డీసీఎల్ ఎండీ 25.9.2024న ప్రభుత్వానికి లేఖ రాశారు.**
- మెయిన్‌హార్ట్ కన్సార్షియంకు బాధ్యతలు అప్పగించేందుకు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం 4.10.2024న ఉత్తర్వులు జారీచేసింది.
- **మరుసటి రోజే అంటే 5.10.2024న ఎంఆర్‌డీసీఎల్ చీఫ్ ఇంజినీర్ మెయిన్‌హార్ట్ కన్సార్షియంకు ఎల్‌వోఏను జారీచేశారు. ఏడో తేదీన అవుట్‌వార్డులో నమోదు కాగా, 8న ఎల్‌వోఏ ప్రతులు మెయిన్‌హార్ట్‌కు చేరాయి.**

MEINHARDT

ఐదున్నరేండ్లు మెయిన్‌హార్ట్ చేతిలోనే మూసీ?

- అంగీకార పత్రం పంపిన ఎంఆర్‌డీసీఎల్?
- మాస్టర్‌ప్లాన్ రూపకల్పనతో పాటు పర్యవేక్షణ!

సిటీబ్యూరో, అక్టోబర్ 9(నమస్తే తెలంగాణ): సింగపూర్ కంపెనీ మెయిన్‌హార్ట్ సింగపూర్ ప్రైవేటు లిమిటెడ్ కన్సార్టియం ఒకటీ అరా కాదు... ఏకంగా ఐదున్నరేండ్ల పాటు మూసీ సుందరీకరణ ఆలనాపాలనా చూడనున్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు మెయిన్‌హార్ట్ కన్సార్టియంకు ఐదు రోజుల కిందట మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఆర్‌డీసీఎల్) చీఫ్ ఇంజినీర్ అంగీకార పత్రం ఇచ్చినట్టు సమాచారం. పత్రంలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నట్టు తెలుస్తున్నది. ఏకంగా 66 నెలలపాటు ఇచ్చిన బాధ్యతల్ని నిర్వర్తించాలని అందులో పేర్కొన్నట్టు సమాచారం. రూ.141.08 కోట్లతో(జీఎస్టీ కాకుండా) మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు మాస్టర్ ప్లాన్ బాధ్యతల్ని అప్పగించేందుకు అంగీకరించినట్టు తెలుస్తున్నది. నెల రోజుల్లోనే ఎంఆర్‌డీసీఎల్-కన్సార్టియం మధ్య పరస్పర అంగీకారం(ఎంవోయూ) పూర్తి కావాలని గడువు విధించినట్టు సమాచారం. ఒప్పంద పత్రాన్ని ఈ నెల 5న ఎంఆర్‌డీసీఎల్ చీఫ్ ఇంజినీర్ జారీ చేయగా... 7వ తేదీన కార్యాలయం నుంచి వెలువడినట్టు తెలుస్తున్నది. మంగళవారం అధికారికంగా మెయిన్‌హార్ట్ కన్సార్టియంకు మూసీ రివర్‌ఫ్రంట్ మాస్టర్‌ప్లాన్ బాధ్యతల అప్పగింత పూర్తయినట్టు సమాచారం. కన్సార్టియం కేవలం మాస్టర్‌ప్లాన్ రూపకల్పన బాధ్యతలు మాత్రమే నిర్వహిస్తుందా? అందుకు ఐదున్నరేళ్ల సమయం ఎందుకు? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మాస్టర్ ప్లాన్ రూపకల్పనతోపాటు పర్యవేక్షణ కూడా మెయిన్‌హార్ట్ కన్సార్టియమే నిర్వహించనున్నదా? అనే దానిపై అంగీకార పత్రంలో స్పష్టత లేదు.

అవినీతి సంస్థకు మూసీ కాంట్రాక్టు

- బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ ఆరోపణ



హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): మూసీ మాస్టర్ ప్లాన్ తయారీ కాంట్రాక్టును మెయిన్ హార్ట్‌కు అప్పగించడంపై బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్ మరోసారి విమర్శలు గుప్పించారు. ‘రూ.3వేల కోట్ల కుంభకోణంలో రెడ్‌కార్నర్ నోటీసులు జారీ అయిన ఆ కంపెనీకి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మూసీ కాంట్రాక్టు ఇచ్చింది’ అని ఎక్స్‌లో బుధవారం పోస్ట్ చేశారు. పాకిస్తాన్‌లోని కరాచీ న్యాయస్థానం జారీ చేసిన నోటీసులను జతచేశారు. ఈ పోస్టును బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రీ ట్వీట్ చేశారు. కంపెనీకి ఆర్డర్ ఇచ్చే ముందు నిబంధనలు పాటించారో లేదో తెలుపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మాపై తప్పుడు ఆరోపణలు..

తమపై వస్తున్న ఆరోపణలపై మెయిన్‌హార్ట్ సంస్థ బుధవారం స్పందించింది. బీఆర్‌ఎస్ నేత చేసిన ఆరోపణలను ఖండించింది. పాకిస్థాన్‌లోని క్రిక్ మెరీనా ప్రాజెక్టుకు తాము కన్సల్టెంట్‌గా మాత్రమే వ్యవహరించామని స్పష్టం చేసింది. ఇతర లావాదేవీలతో తమ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నది. తమపై ప్రచురించిన తప్పుడు వార్తలను వెనక్కి తీసుకోకపోతే న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

పేదల ఇండ్లు కూల్చడం దారుణం

- ప్రజలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు
- హైడ్రా తీరుతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- సీఎం రేవంత్‌కు తెలంగాణ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణ లేఖ

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లు కూల్చడం అప్రజాస్వామికం, అత్యంత దారుణమని తెలంగాణ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ తీవ్రంగా ఆక్షేపించారు. పేదలకు సరైన ప్రత్యామ్నాయం చూపకుండా, ఏకపక్షంగా హైడ్రాతో నివాసాలను నేలమట్టం చేయడం సరికాదని సూచించారు. నోటీసులు కూడా ఇవ్వకుండా హడావుడిగా కూల్చడం వల్ల హైడ్రా తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నదని తెలిపారు. గతంలో ఇందిర కాంగ్రెస్ సర్కారు దేశవ్యాప్తంగా పేదలకు ఇండ్లు నిర్మించి ఇస్తే, ఇప్పుడు తెలంగాణలో అందుకు విరుద్ధంగా మన ప్రభుత్వం పేదల ఇండ్లను కూలగొడుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని, పేదల హక్కులు, ఆస్తులను రక్షించాలని సూచించారు. హైదరాబాద్ అభివృద్ధికి, ప్రగతికి ప్రభుత్వ భూములు, నాలాలు, చెరువులను రక్షించడం అత్యవసరమే అయినా.. అనేక దశాబ్దాల కష్టార్జితంతో కట్టుకున్న గూడును, జీవితాంతం శ్రమించి సంపాదించిన ఆస్తిని ధ్వంసం చేయడం వారికి మానసిక వేదనను కలిగిస్తుందని పేర్కొన్నారు. మూసీ పరీవాహకంలో ఇండ్ల కూల్చివేతల నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తాజాగా లేఖ రాశారు.



Telangana Handicrafts Development Corporation Ltd.

NAIDU SATYANARAYANA
CHAIRMAN

Date: 30-09-2024

To
Shri A. Revanth Reddy,
Hon'ble Chief Minister of Telangana,
Dr. B.R. Ambedkar Secretariat,
HYDERABAD.

Respected Sir,

As an ardent follower of the Congress philosophy and a sincere Congress worker, I'm grateful for the opportunity to serve the people of Telangana. Through my interactions with diverse sections of society, particularly the poor and artisans, I've gained valuable insights into their perceptions on governance and recent government initiatives to safeguard public lands and properties. I am committed to sharing my experiences to promote good governance and uphold the party's values.

Sir, HYDRA is undeniably essential for the growth and development of Hyderabad, particularly in safeguarding government lands, nalas, and lakes from encroachment. However, the measures taken under the guise of protecting the Musi catchment area have unfortunately led to immense destruction and great loss to the homes of the most vulnerable. These homes, built over many decades through relentless hard work, have been wiped away, leaving the poor to witness the tragic

సీఎం రేవంత్‌కు రాష్ట్ర హ్యాండీక్రాఫ్ట్స్ అభివృద్ధి సంస్థ చైర్మన్ సత్యనారాయణ రాసిన లేఖ

ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలి




‘పేదలకు ఆశ్రయం, భద్రత కల్పించడంలో ఇందిర కాంగ్రెస్ ప్రభుత్వం ముందున్నది. ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలు, నిరు పేదలు ఇండ్లు కోల్పోతున్నారు. ఈ పరిస్థితి ఎంతో బాధాకరం. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలపై సానుభూతి, న్యాయ విలువలు ఇంకా పాటిస్తున్నారా? అనే సందేహాలు కలుగుతున్నాయి. ఈ పరిస్థితిని పునఃసమీక్షించాలి. అనేక సంవత్సరాల క్రితమే ఇండ్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితుల హక్కులు, ఆస్తులను రక్షించి ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలి. హైడ్రా కూల్చివేతల ద్వారా ప్రభావితమైన పేదల ఆందోళనలను మానవతా దృక్పథంలో పరిష్కరించాలి. నష్టపరిహారం చెల్లించడంతోపాటు సరైన పునరావాసం కల్పించాలి’ అని సీఎంకు రాసిన లేఖలో సత్యనారాయణ పేర్కొన్నారు.

సామాజిక ఉద్రిక్తతలకు దారితీస్తది

‘హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) అనేది హైదరాబాద్ అభివృద్ధి, ప్రగతికి, ముఖ్యంగా ప్రభుత్వ భూములు, నాలాలు, చెరువులను ఆక్రమణదారుల నుంచి రక్షించేందుకు అత్యంత అవసరమైందే.. కానీ, మూసీ క్యాచ్‌మెంట్ ఏరియాను రక్షించేందుకు పేదల గృహాలు కూలగొట్టడం ఎంతో నష్టాన్ని కలిగిస్తున్నది. జీవితాంతం కష్టపడి కట్టుకున్న గూడును కూల్చివేయడాన్ని చూసి ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. బాధితుల అసంతృప్తిని ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. వీరి సమస్యను పరిష్కరించకపోతే సామాజిక ఉద్రిక్తతలకు దారితీస్తుంది. పేదల ఇండ్లు వారి పోరాటాలకు, కష్టానికి ప్రతిరూపాలు. ఇప్పుడు హైడ్రా పేరిట వాటిని కూల్చివేస్తున్నారు. ఇది ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతున్నది. సరైన నోటీసు ఇవ్వకుండా, బాధితుల ఆవేదనను పరిగణనలోకి తీసుకోకుండా ఇండ్లను కూల్చడం తీవ్రంగా కలిచివేస్తున్నది. ఇది అత్యంత దారుణమైన, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా ప్రజలు భావిస్తున్నారు. సమాజంలోని వివిధ వర్గాల నుంచి వచ్చిన ఆందోళనలు, విమర్శలను పరిగణనలోకి తీసుకొని, కూల్చివేతల నిర్ణయాన్ని తిరిగి పరిశీలించాలని వినమ్రంగా కోరుతున్నా. అత్యంత బలహీన వర్గాలను మన చర్యల ద్వారా దూరం చేసుకోకూడదు’ అని లేఖలో పేర్కొన్నారు.

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.3°c	21.6°c
మెదక్	35.8°c	21.7°c
రంగారెడ్డి	35.7°c	20.1°c
కరీంనగర్	33.0°c	24.0°c
నిజామాబాద్	32.1°c	23.4°c
మహబూబ్‌నగర్	32.1°c	22.3°c
ఖమ్మం	32.0°c	24.0°c
వరంగల్	32.0°c	24.0°c
హైదరాబాద్	31.2°c	23.8°c
నల్లగొండ	30.5°c	23.8°c

మూసీ కోసం సియోల్ టూర్

- ప్రజా వ్యతిరేకతను పట్టించుకోకుండా పర్యటనలా? : బీఆర్‌ఎస్ ఆగ్రహం

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ కోసం విదేశాల్లో అధ్యయనానికి ప్రభుత్వం సిద్ధమైంది. 19న దక్షిణ కొరియాలోని సియోల్ నగరాన్ని సందర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. మూసీ పరీవాహక ప్రాంత ప్రజాప్రతినిధులను వెంటబెట్టుకొని ‘హెన్’ నదిని పరిశీలించేందుకు వెళ్లనున్నది. ప్రజావ్యతిరేకతను పట్టించుకోకుండా ప్రభుత్వం ఈ టూర్ ప్రోగ్రాం పెట్టడం ఏమిటని బీఆర్‌ఎస్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. మూసీ సుందరీకరణ కోసం ప్రతిపక్షాలు కలిసిరావాలని సీఎం రేవంత్‌రెడ్డి ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రారంభోత్సవ సభలో కోరారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ తాము ప్రజల పక్షాన పోరాడుతామని ఇప్పటికే బీఆర్‌ఎస్ స్పష్టం చేసింది. ప్రతిపక్షాలు సహకరించటం లేదనే అపనింద మోపేందుకే సియోల్ టూర్‌కు తమను ఆహ్వానించిందని ఆ ప్రాంత బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వీరు టూర్‌కు వెళ్లకూడదని నిర్ణయించినట్టు సమాచారం. ఇదే విషయాన్ని తమను ఆహ్వానించిన అధికారుల వద్ద స్పష్టం చేసినట్టు తెలిసింది.

గాంధీ ట్రస్ట్ భూమి అన్యాక్రాంతం

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తేతెలంగాణ):మహాత్మాగాంధీ స్మారక నిధికి చెందిన భూమిని ప్రైవేట్ వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిల్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. ఆరు వారాల్లోగా కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన ప్రభుత్వ సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, భూపరిపాలన ప్రధాన కమిషనర్, సిద్దిపేట కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌ను ఆదేశించింది. సిద్దిపేట జిల్లా పొన్నాలలోని గాంధీ స్మారక నిధికి చెందిన భూమిని ప్రైవేట్ వ్యక్తుల పేరిట రెవెన్యూ రికార్డులు మార్పు చేయడం చట్ట వ్యతిరేకమని గ్రామస్తుడు తుపాకుల బాలరంగం, ఇతరులు దాఖలు చేసిన వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం విచారించింది. 5.34 ఎకరాలను చట్ట వ్యతిరేకంగా 2022 ఆగస్టు 6న జరిగిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని పిటిషనర్ కోరారు.

భట్టిపెట్టిన రియల్టీ చిచ్చు

- కార్పొరేట్ రియల్ వ్యాపారులు లబోదిబో
- ఆక్రమణలని భట్టి తేల్చడంతో తంటాలు
- నిర్మాణాలకు బ్యాంకుల నుంచి నోటీసులు
- పెట్టుబడి వెనక్కివ్వాలని వ్యాపారుల ఒత్తిళ్లు
- అడ్వాన్స్ చెల్లించాలని కస్టమర్ల డిమాండ్
- ప్రభుత్వ పెద్దల వద్దకు వ్యాపారుల పరుగులు

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): హైడ్రా పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో కలకలం సృష్టిస్తే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఒక్క ప్రెస్‌మీట్‌తో ఏకంగా చిచ్చు పెట్టారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుతాయని భావిస్తున్న హైరైజ్ భవనాలకు ‘ఆక్రమణ’ల ముద్ర వేయడంతో ఆయా నిర్మాణ సంస్థలు లబోదిబోమంటున్నాయి. రూ.15 వేల కోట్ల విలువైన 11 బడా ప్రాజెక్టులను చెరువులను ఆక్రమించి నిర్మించారని భట్టి విక్రమార్క పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడంతో రాష్ట్రంలోని కార్పొరేట్ రియల్ ఎస్టేట్ రంగం ఒక్కసారిగా షాక్‌కు గురైంది. హైడ్రా కూల్చివేతల భయాలు ఆకాశహర్మ్యాలను చుట్టుముట్టాయి. వాటి భవిష్యత్ ఏమిటో తెలియక పెట్టుబడిదారులు, కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు.

నోటీసులు సిద్ధం చేస్తున్న బ్యాంకులు

సాధారణంగా భారీ వెంచర్లు, హైరైజ్ బిల్డింగ్‌లు నిర్మించే రియల్‌ఎస్టేట్ సంస్థలు బ్యాంకుల నుంచి రూ.వందలాది కోట్లు రుణంగా తెచ్చి పెట్టుబడులు పెడుతుంటాయి. రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ రంగం జోరు మీద ఉండటం, ప్రాజెక్టులకు ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు ఉండటం, రెరా అనుమతులు ఉండటంతో బ్యాంకులు సైతం సులభంగా రుణాలు ఇచ్చేశాయి. భట్టి విక్రమార్క పేర్కొన్న 11 బడా నిర్మాణాలు రూ.15 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్టు అంచనా. కనీసం 50-70% వరకు బ్యాంకు రుణాలు ఉంటాయి. అంటే రూ.8 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్ల వరకు బ్యాంకులు వాటికి అప్పులు ఇచ్చాయన్న మాట. భట్టి ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఆ ప్రాజెక్టులు ఆక్రమణ నిర్మాణాలని తేల్చేయడంతో బ్యాంకింగ్ వర్గాలు సైతం ఉలిక్కిపడ్డాయి. ప్రభుత్వమే ఆక్రమణ నిర్మాణాలుగా తేల్చింది కాబట్టి తమ నుంచి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించాలంటూ ఆయా నిర్మాణ సంస్థలకు నోటీసులు ఇచ్చేందుకు బ్యాంకులు సిద్ధమవుతున్నాయనే ప్రచారం జరుగుతున్నది. అసలే కష్టకాలంలో దాదాపు రూ.10 వేల కోట్లు ఎక్కడినుంచి తెచ్చి కడతామని నిర్మాణ సంస్థలు ఆవేదన చెందుతున్నాయి.

పెట్టుబడులు వెనక్కి ఇచ్చేయండి

సాధారణంగా రూ.వందల కోట్ల విలువైన నిర్మాణాలు ఒక బడా నిర్మాణ సంస్థ పేరుతో జరుగుతున్నా, అందులో చిన్నచిన్న సంస్థలు, వ్యక్తులు భాగస్వాములుగా ఉంటాయి. రెండు మూడు శాతం మొదలు కొని



వారికి వాటాలు ఉంటాయి. కొందరికి లాభాల్లో వాటా ఇచ్చేలా, మరికొందరికి ప్లాట్లు కేటాయించేలా ఒప్పందాలు చేసుకుంటారు. డిప్యూటీ సీఎం ప్రెస్‌మీట్ తర్వాత వారు లబోదిబోమంటున్నట్టు తెలిసింది. పెట్టుబడులు వెనక్కి ఇచ్చేయాలని ప్రధాన భాగస్వామిపై ఒత్తిడి తెస్తున్నట్టు మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. తమకు వాటాగా ప్లాట్లు వద్దని, లాభాలు కూడా వద్దని, ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడి వెనక్కి ఇస్తే చాలని వేడుకుంటున్నారట. మరికొందరు ఇకపై ప్రాజెక్టు కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టబోమని భీష్మిస్తున్నారట. దీంతో ఏం చేయాలో తెలియక ప్రధాన భాగస్వామ్య కంపెనీ తలలు పట్టుకుంటున్నట్టు చెప్పుకుంటున్నారు.

ప్రభుత్వ పెద్దల దగ్గరికి పరుగు

హైడ్రాతో అలజడి మొదలైతే.. భట్టి విక్రమార్క ప్రెస్‌మీట్ తమ పాలిట తుఫానుగా తయారైందని బడా రియల్‌ఎస్టేట్ సంస్థల ప్రతినిధులు, భారీ భవనాల నిర్మాణదారులు లబోదిబోమని మొత్తుకుంటున్నారట. ఇప్పటికే రియల్‌ఎస్టేట్ రంగం నేలచూపులు చూస్తున్నదని, హైదరాబాద్‌పై నమ్మకంతోనో, తమ పరపతి మీదనో కొంత వరకు సేల్స్ జరిపామని ఇప్పుడు భట్టి ప్రకటనతో మొత్తం బూడిదలో పోసిన పన్నీరయ్యిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారట. ‘కొత్తవి కొనడం దేవుడెరుగు. పాతవాటికి కూడా డబ్బులు అడుగుతున్నారు’ అని వాపోతున్నారట. ‘రెండు రోజుల కిందటిదాకా మా ఆఫీస్ ల్యాండ్ లైన్‌కు ఒక్కో నంబర్‌కు కనీసం రోజుకు సగటున 70-80 కాల్స్ వచ్చేవి. ప్రాజెక్టు గురించి అడిగి వివరాలు తెలుసుకునేవారు. కానీ, ఇప్పుడు ఫ్లాట్ల గురించి అడిగే కాల్స్ బంద్ అయ్యాయి. పైగా మీ భవనం చెరువులో కట్టారంట కదా? హైడ్రా కూలగొడుతుందట కదా? అంటూ ఫోన్ చేసి మరీ అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు’ అని ఒక నిర్మాణ సంస్థ మేనేజర్ చెప్పారు. పైగా తామే ఎవరినైనా సంప్రదించినా కాల్స్ ఎత్తడం లేదని, ఒకవేళ ఎత్తినా మీ ఫ్లాట్లు వద్దంటూ మొఖం మీదే చెప్పేస్తున్నారని వాపోయారు. దీంతో నిర్మాణ సంస్థలు అర్జంట్‌గా ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డట్టు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, డిప్యూటీ సీఎం భట్టిని, కాంగ్రెస్ పెద్దలను కలిసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. మళ్లీ ప్రభుత్వం నోటి నుంచే.. తమ ప్రాజెక్టులు అక్రమం కాదని చెప్పించాలని ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం.

మీ ప్లాట్లకో దండం!

హైరైజ్ భవనాల నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచే నిర్మాణ సంస్థలు ప్లాట్ల అమ్మకాలు చేపడుతుంటాయి. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మియాపూర్, నార్సింగి, పుప్పాలగూడ, సైబర్‌సిటీ, నెక్నాంపూర్ వంటి ప్రైమ్ ఏరియాల్లో భవనాలు కావడంతో ఆ వెంచర్లలో భారీ సంఖ్యలో ప్లాట్లు బుక్ అయ్యాయి. ఒక్కో ప్లాట్‌కు రూ.కోట్లు చెల్లించి బుక్ చేసుకున్నట్టు ఆయా సంస్థల ప్రతినిధులు చెప్తున్నారు. ఇప్పుడు ఆ ప్రాజెక్టులు అక్రమమని డిప్యూటీ సీఎం తేల్చేయడంతో.. తమ అడ్వాన్స్‌ను వెనక్కి ఇవ్వాలని నిర్మాణ సంస్థలను కొనుగోలుదారులు డిమాండ్ చేస్తున్నారు. ఎంత సర్దిచెప్పినా వినడం లేదని, ‘మీ ప్లాట్లకో దండం.. మీకో దండం’ అంటూ మొఖం మీదే కుండబద్దలు కొడుతున్నారని వాపోతున్నారు.

ఎందుకు ప్రెస్‌మీట్ పెట్టారు?

భట్టి విక్రమార్క ప్రెస్‌మీట్‌పై అటు ప్రభుత్వంలో, ఇటు రాజకీయ వర్గాల్లో తీవ్రంగా చర్చ జరుగుతున్నది. అసలు భట్టి విక్రమార్క ఏ అర్హతతో ప్రెస్‌మీట్ పెట్టారని ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి భట్టి ప్రెస్‌మీట్ అని చెప్పగానే అందరూ ఆయన అమెరికా, జపాన్ పర్యటన విశేషాలు పంచుకుంటారని అనుకున్నారు. ఏయే పెట్టుబడులు సాధించారో ఘనంగా చెప్పుకుంటారని భావించారు. కానీ, అసలు ఆ అంశంతో సంబంధం లేకుండా, తన పరిధిలోకి రాని రియల్‌ఎస్టేట్ రంగం గురించి ప్రెస్‌మీట్ పెట్టడంతో అంతా అవాక్కయ్యారు. ఇప్పటికే హైదరాబాద్ రియాల్టీ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, ఇప్పుడు మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు భట్టి వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ వర్గాల్లోనే చర్చ జరుగుతున్నది. రాష్ట్రానికి ఆయువుపట్టుగా ఉన్న హైదరాబాద్ రియల్‌ఎస్టేట్ రంగాన్ని సీఎం, డిప్యూటీ సీఎం కలిసి ఎందుకు పడగొడుతున్నారో అర్థం కావడం లేదని చెప్తున్నారు.

వామ్మో.. సర్కారోళ్లు

- బతుకమ్మ ఏర్పాట్లకు తహసీల్దార్
- వాహనాన్ని అడ్డుకున్న స్థానికులు
- ఇండ్ల సర్వేకు వచ్చారేమోనని నిలదీత
- పెద్దల జోక్యంతో శాంతించిన పేదలు
- బస్తీవాసులపై పోలీసు కేసులు
- వరంగల్ ఎస్సార్‌నగర్‌లో అలజడి



సద్దుల బతుకమ్మ ఏర్పాట్ల కోసం వచ్చిన వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్‌ను ఇండ్లు కూల్చివేయవద్దని అడ్డుకుంటున్న గ్రేటర్ వరంగల్‌లోని 14వ డివిజన్ పరిధి రామసముద్రం చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతంలోని ఎస్సార్‌నగర్ బస్తీవాసులు

వరంగల్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వరంగల్ మహానగరంలోని 14వ డివిజన్.. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని రామసముద్రం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఎస్సార్‌నగర్ బస్తీ.. 700 కుటుంబాల సముదాయం.. తాటిపత్రి గుడిసెలు, పక్కా ఇండ్లు, రూఫ్‌టాప్ ఇండ్లు.. ఎవరి తాహతు మేరకు వారు దశాబ్దాల క్రితమే కట్టుకున్నారు. వరంగల్ తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్ మంగళవారం తన సిబ్బందితో అక్కడికి ప్రభుత్వ వాహనంలో వచ్చారు. సద్దుల బతుకమ్మ ఏర్పాట్ల కోసం ఆయన అక్కడికి వెళ్లారు. తహసీల్దార్ వాహనం ఎస్సార్ నగర్ ఏరియాలోకి ప్రవేశించగానే అక్కడి పేద ప్రజల్లో ఉలికిపాటు మొదలైంది. హైదరాబాద్‌లో హైడ్రా తరహాలోనే ఇక్కడా తమ ఇండ్లను కూల్చివేస్తారేమోననే భయంతో వారిలో అలజడి మొదలైంది. సర్కారు కూల్చివేత చర్యలకు సహకరించేది లేదంటూ తిరుగుబాటు మొదలైంది. నిమిషాల్లోనే ఆ బస్తీ వాసులందరూ అక్కడికి చేరుకున్నారు. తహసీల్దార్ వాహనం కదలకుండా అడ్డుకున్నారు. తమ ఇండ్లను కూల్చొద్దని మొరపెట్టుకున్నారు. అక్కడ జరిగేది తహసీల్దార్‌కు, ఆయనతో వచ్చిన సిబ్బందికి అర్థం కాలేదు. సద్దుల బతుకమ్మ ఏర్పాట్ల కోసం వచ్చానని, మిగిలిన విషయాలు తనకు తెలియదని తహసీల్దార్ వివరించారు. ఆయన చెప్పే విషయాన్ని చాలా సేపటి వరకు అర్థం చేసుకోలేకపోయారు. బస్తీ పెద్దలతో మాట్లాడిన తర్వాత అందరూ నెమ్మదించారు.

తహసీల్దార్ వచ్చింది ఇండ్ల సర్వేకు కాదని, బతుకమ్మ ఏర్పాట్ల కోసం అని సర్దిచెప్పారు. పండుగ పూట తమ ఇండ్లలో ప్రశాంతంగా ఉండొచ్చని నిమ్మలపడ్డారు. కాంగ్రెస్ సర్కారు మళ్లీ ఎప్పుడు తమ ఇండ్లను కూలుస్తుందోనని మరికొందరు ఆవేదనతోనే అక్కడి నుంచి వెళ్లిపోయారు. హైడ్రా ఏర్పాటైన తర్వాత హైదరాబాద్‌తోపాటు రాష్ట్రమంతటా ఇప్పుడు ఒకటే భయం పట్టుకున్నది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్.. ఏదైనా సరే ప్రభుత్వ అధికారి వచ్చినా, అక్కడి నుంచి సర్కారు వాహనం వెళ్లినా పేదలు ఉలిక్కిపడుతున్నారు. జనావాసప్రాంతాల్లోనూ కాంగ్రెస్ సర్కారు ఇండ్లపై ఎర్ర రంగులు పూస్తున్నది. 'మీ ఇండ్లు కూల్చివేస్తాం' అని బెదిరిస్తున్నది. చెరువులను ఆక్రమించి భవంతులు కట్టిన పెద్దల జోలికి పోకుండా పేదల గుడిసెలను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చుతున్నదన్న భయం ఇప్పుడు రాష్ట్రమంతటా పాకింది. అందుకే వరంగల్ నగరంలో తహసీల్దార్ బతుకమ్మ ఏర్పాట్ల కోసం వచ్చినా ఇండ్ల కూల్చివేతకే అనుకుని పేదలు భయపడ్డారు.

కేసు నమోదుతో వేధింపులు

హైడ్రా భయంతో వరంగల్‌లోని పేదలు ఇండ్లను కాపాడుకునేందుకు తహసీల్దార్ వాహనాన్ని అడ్డుకున్న విషయాన్ని కాంగ్రెస్ పాలకులు తీవ్రంగా పరిగణించారు. సద్దుల బతుకమ్మ ఏర్పాట్ల కోసం వచ్చిన అధికారిని అడ్డుకున్నారనే ఆరోపణలతో వరంగల్ ఎస్సార్ నగర్ వాసులపై కేసులు నమోదు చేసినట్టు ఎనుమాముల ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు. కాగా తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్‌పై జరిగిన దాడిని ట్రెసా, హనుమకొండ జిల్లా టీఎన్జీవో నాయకులు ఖండించారు. ఘటన బాధ్యులైపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిరక్షణ కాదు.. పైసా వసూల్!

- రాత్రికి రాత్రే చేతులు మారుతున్న సూట్‌కేసులు
- అంతా డ్యామేజెస్, ప్యాకేజెస్, పర్సంటేజెస్
- హైడ్రాపై బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి విమర్శ



హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో జరుగుతున్న తతంగమంతా చెరువుల పరిరక్షణ కోసం కాదని పైసా వసూలే ప్రధాన లక్ష్యమని బీజేపీ కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆరోపించారు. పేదోళ్లను కొట్టి పెద్దోళ్ల దగ్గర వసూలు చేయడానికే పక్కా ప్లాన్‌తోనే సర్వేల మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గ్రేటర్‌లో చెరువుల ఆక్రమణలపై ఇప్పుడు నడుస్తున్నది రాక్స్, లేక్స్, పార్క్స్ కాదని.. డ్యామేజెస్, ప్యాకేజెస్, పర్సంటేజెస్ అని వ్యాఖ్యానించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం హైడ్రా తీరుపై ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల చెరువుల ఆక్రమణలపై డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తప్పుబట్టారు. గత 14 ఏండ్లలో కేవలం 229 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ ఇస్తే.. కేవలం ఒక్క సెప్టెంబర్ నెలలోనే 95 చెరువులకు ఎలా ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వగలిగారని ప్రశ్నించారు. కేవలం గత ప్రభుత్వాన్ని తప్పుపట్టే ప్రయత్నం తప్ప ప్రజలకు ఉపయోగపడేది ఏమీ లేదని అన్నారు. మూడుజిల్లాల్లో ఉన్న చెరువులను తగ్గించి దానికి హద్దులు నిర్ధారించి హైడ్రా ఏర్పాటైన తర్వాత ఆక్రమణలుగా చూపించడంతో రాత్రికిరాత్రే సూట్‌కేసులు చేతులు మారుతున్నాయని ఆరోపించారు. తమ పరిశీలనలో ఇప్పటివరకు 30 బడా కంపెనీల ప్రాజెక్టులు ఈ ఆక్రమణల్లో ఉన్నట్టుగా తేలిందని, వీటికి సంబంధించిన ఆధారాలను త్వరలోనే బయటపెడ్తామని చెప్పారు. 2014కు ముందు పదేండ్లు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఆక్రమణలు జరగలేదా? అని ప్రశ్నించారు.

అధికారులకు శిక్ష ఏది?

చెరువుల్లో నిర్మాణాలకు పర్మిషన్లు ఇచ్చిన అధికారులను, అందుకు ప్రోత్సహించిన రాజకీయ నాయకులను పట్టుకోరు కానీ సామాన్యప్రజలను ఇబ్బంది పెట్టడం కరెక్టేనా అని వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. పేదోళ్ల ఇండ్లు కూలగొట్టి శ్మశానం చేస్తున్న రేవంత్‌రెడ్డి .. ప్రజాపాలన అంటే ఇదేనా అని నిలదీశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో లక్షల కోట్ల విలువ చేసే అనేక స్థలాలు కబ్జాకు గురయ్యాయని, వీటిలో కంపెనీలు ఏర్పాటు చేసుకొనేందుకు విదేశీయులకు రేవంత్ సర్కార్ అనుమతులు ఇచ్చిందని తెలిపారు.

భట్టి పీపీటీ లోపభూయిష్టం

డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క చెరువుల ఆక్రమణలపై చేసిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ అంతా లోపభూయిష్టమని వెంకటరమణారెడ్డి విమర్శించారు. మొత్తం 171 ఆక్రమణల గురించి చెప్తూ.. ఎకరం, రెండెకరాలు, పదెకరాలలోపు చెరువులే చూపించారు తప్ప వందల ఎకరాల చెరువుల ఆక్రమణలపై ఎందుకు చెప్పలేకపోయారని ప్రశ్నించారు. కొన్నిచెరువుల పేర్లు, ఐడీలు మార్చారని ఇంకొన్నిచోట్ల చెరువులే మాయమయ్యాయని, ఇవన్నీ ఎందుకు తన ప్రజెంటేషన్‌లో భట్టి వివరించలేదని అన్నారు. మేడ్చల్ జిల్లాలో 127 ఎకరాల రాంపల్లి చెరువును కాకుండా సీనుగున్‌కుంట అని 0.39 ఎకరాలుగా చూపించారని తెలిపారు. ప్రెస్‌మీట్ కేవలం తన వ్యక్తిగతమని, ఎవరికీ సమాచారం ఇవ్వలేదని ఎమ్మెల్యే రమణారెడ్డి వెల్లడించారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు



ధాన్యం దించుకోవడానికి మిల్లర్లు ససేమిరా!

- సన్నధాన్యం అవుట్‌టర్న్‌పై తేల్చండి
- సమస్యలు పరిష్కరించాలని మంత్రులకు మిల్లర్ల స్పష్టీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): తమ సమస్యలు పరిష్కరించే వరకు ధాన్యం దించుకునే ప్రసక్తే లేదని మిల్లర్లు తేల్చి చెప్పినట్టుగా సమాచారం. ధాన్యం కొనుగోలు సమస్యలపై ప్రభుత్వం మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్, శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావుతో కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ బుధవారం మిల్లర్లతో సమావేశమై కొనుగోళ్లు, సమస్యలపై చర్చించింది. ఈ సందర్భంగా మిల్లర్లు తమ సమస్యలను కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. సన్నధాన్యం దించుకునే ప్రసక్తేలేదని, ఆ ధాన్యం వల్ల తాము నష్టపోతామని తేల్చి చెప్పినట్టుగా తెలిసింది. సన్న ధాన్యం అవుట్‌టర్న్ రేషియో తేల్చిన తర్వాతే దించుకుంటామని చెప్పినట్టుగా తెలిసింది. ఇక బిడ్డర్లు ధాన్యం ఎత్తకపోవడంతో మిల్లుల్లోనే ధాన్యం నిండిపోయిందని, ఇప్పుడిచ్చే ధాన్యం ఎక్కడ పెట్టాలని ప్రశ్నించినట్టుగా తెలిసింది. టెండర్ ధర తామే చెల్లిస్తామని, నెల రోజుల గడువు ఇవ్వాలని కోరినట్టుగా సమాచారం. ఇక దీనిపై స్పందించిన మంత్రులు.. మిల్లర్లు నిబంధనల ప్రకారం పని చేయాలని, లేదంటే సహించేది లేదని హెచ్చరించారు. పెండింగ్ బిల్లుల చెల్లింపునకు సహకరిస్తామని తెలిపారు. వానకాలం ధాన్యం సేకరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, సన్నధాన్యం, దొడ్డు ధాన్యం వేర్వేరుగా కొనుగోలు చేయాలని ఆదేశించారు.

వరద ముప్పు నివారణపై హైడ్రా సమీక్ష

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో వరదలు, కారణాలు, ఉపశమనచర్యలపై బుధవారం హైడ్రా కార్యాలయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో బెంగుళూరులో అనుసరిస్తున్న విధానాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కర్ణాటక రాష్ట్ర ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ కేంద్రం మాజీ డైరెక్టర్ డా జీఎస్ శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులతో గ్రేటర్‌లో ప్రస్తుతం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పరిస్థితులపై చర్చించారు. వరద నీటి కాలువల ప్రవాహ స్థాయిని అంచనా వేసేందుకు బెంగళూరులో అమర్చిన సెన్సార్ల ప్రయోజనాలపై తెలుసుకున్నారు. నాలాల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నగరంలో ఉన్న చెరువులన్నింటికీ అలుగులుండేలా, గొలుసుకట్టు చెరువుల లింక్‌ను పునరుద్ధరించి వరద సాఫీగా సాగేలా చూడడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో హైడ్రాకు చెందిన వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

రెండు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో తీర్పులు విభిన్నంగా వచ్చినట్టు కనిపిస్తున్నప్పటికీ వాస్తవం మాత్రం ఒకటే! కాంగ్రెస్ పరిస్థితి దిగజారిపోగా, బీజేపీ పరిస్థితి మెరుగుపడింది. హర్యానాలో దక్కుతుందనుకున్న విజయం చేజారడం కాంగ్రెస్‌కు చావుదెబ్బే. అందుకు ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తాయి. ఒకటి, గెలుపు మీద అలవిమాలిన ధీమా.. రెండు, సరైన వ్యూహం లోపించడం. పాడిందే పాట అన్నట్టుగా హామీలు, గ్యారెంటీలంటూ ఊదరగొట్టడం. హర్యానా ఓటర్ల ముందు ఈ గారడీలేవీ పని చేయలేదు. హిమాచల్, కర్ణాటక, తెలంగాణల్లో బురిడీ కొట్టించినట్టు హర్యానా ఓటర్లను మాయ చేయడం కాంగ్రెస్‌కు సాధ్యపడలేదు. మూడు రాష్ట్రాల్లో హామీలకు ఏ గతి పట్టిందో ఓటర్లకు తెలిసిపోవడం అందుకు కారణం. అధికారం చేపట్టాక గత హామీలను పట్టించుకోని కాంగ్రెస్ పన్నాగాలను ముందుగానే పసిగట్టారు. బీసీ కులగణన మంత్రాన్ని ఎంతగా పఠించినా కాంగ్రెస్ గత చరిత్ర దృష్ట్యా అదీ పని చేయలేదు. పైగా ప్రీపోల్ సర్వేలు కాంగ్రెస్ విజయం ఖాయమని, ప్రభుత్వం ఏర్పాటుచేయడమే తరువాయి అని ఊదరగొట్టాయి. కానీ, తొందరపడి ముందే కూసినట్టుగా 'జిలేబీ'లకు ఆర్డరిచ్చి బొక్కబోర్లా పడింది కాంగ్రెస్.

శివసేన వంటి మిత్రపక్షాలు ఇప్పుడు కాంగ్రెస్ చేతకానితనాన్ని నిలదీస్తున్నాయి. హర్యానాలో ఆ పార్టీ అనుసరించిన వ్యూహాలను, ఎత్తుగడలను ఎండగడుతున్నాయి. బీజేపీకి కాంగ్రెస్ గట్టి పోటీ ఇవ్వడం మాట అటుంచి అసలుకే ఎసరు వచ్చింది. ఇండియా కూటమితో దేశ రాజకీయాల దిశను మార్చాలని కలలు గన్న కాంగ్రెస్ అస్తిత్వమే ప్రమాదంలో పడింది. 'కర్ణుడి చావుకు..' అన్నట్టుగా కాంగ్రెస్ పరాభవానికి దారితీసిన అంశాలు ఎన్నో ఉన్నాయి. స్థానిక నాయకత్వంలో సమన్వయం లోపించడం, 'నేనంటే నేన'ంటూ సీఎం అభ్యర్థులు పోటీపడటం వంటి కాంగ్రెస్ మార్కు రాజకీయాన్ని హర్యానా ఓటర్లు ఏవగించుకున్నారని ఫలితాలు వెల్లడించాయి. రాహుల్, ప్రియాంక కాలికి బలపం కట్టుకుని తిరిగినా సానుకూల ఫలితాలు సాధించలేకపోయారు. సామాజిక సమీకరణాలను వ్యూహాత్మకంగా ఉపయోగించుకున్న బీజేపీ.. కాంగ్రెస్ దూకుడుకు కళ్లెం వేయగలిగింది.

హర్యానా ఫలితాలు బీజేపీకి కొత్త ఊపును ఇవ్వగా కాంగ్రెస్‌ను మరింతగా కుంగదీశాయని చెప్పాలి. కురువృద్ధ రాజకీయ పార్టీ దేశంలో బలమైన రాజకీయ శక్తిగా మళ్లీ పుంజుకోవడం సాధ్యమేనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక కశ్మీర్‌లో పేరుకు ఇండియా కూటమి గెలిచినా సర్కారుపై పెత్తనం సాగించేంది నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) అనేది స్పష్టమైపోయింది. కాగా జాతీయ పార్టీనని చెప్పుకొని తిరిగే కాంగ్రెస్ అక్కడ జూనియర్ పార్ట్‌నర్ పాత్రతో సరిపెట్టుకోవాల్సిందే. ఒకప్పుడు లెక్కలేని తనంతో దేశాన్ని పరిపాలించిన కాంగ్రెస్ ఇప్పుడు లెక్కకురాని పార్టీగా మిగిలిపోయింది. అటు లోక్‌సభ ఎన్నికల్లో దెబ్బతిన్న బీజేపీ కోల్పోయిన తన పలుకుబడిని కొంత తిరిగి దక్కించుకుంటే, కాంగ్రెస్ మాత్రం అందివచ్చిన అవకాశాన్ని చేజార్చుకుని మూలకు పడిపోయింది. మొత్తం మీద రెండు రాష్ట్రాల ఫలితాలు కాంగ్రెస్ మనుగడను ప్రశ్నార్థకం చేశాయని చెప్పవచ్చు.

దసరాకైనా దమ్మిడివ్వని దగాకోరు సర్కార్



జి.దేవీప్రసాద్

'దసరా పండుగ వచ్చే దమ్మిడి చేతుల లేదు, దీపావళి వస్తుంది దీపంత లేదాయే, నీ బతుకంత అమావాస్య లచ్చుమమ్మో లచ్చుమమ్మా..' అని ప్రజా యుద్ధనౌక గద్దర్ రాసిన పాటలోని ఈ వాక్యాలు నేడు కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనుభవిస్తున్న పరిస్థితులకు సరిగ్గా సరిపోతున్నాయి. గద్దర్ కేవలం రైతు కూలీ లచ్చుమమ్మ జీవితాన్ని ఉద్దేశించి రాసినప్పటికీ, నేడు రాష్ట్రంలో రైతు కూలీ నుంచి మధ్యతరగతి ఉద్యోగుల దాకా అందరిదీ అదే పరిస్థితి. ఆ పాటలోని వాక్యాలు ఇప్పుడు అందరికీ అన్వయించేలా ఉన్నాయి.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచిపోయాయి. అయినా, అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఇచ్చిన హామీల్లో ఇప్పటివరకు ఏ ఒక్కటీ పూర్తిగా అమలు కాలేదు. నమ్మి ఓట్లేసిన పాపానికి నగుబాటు పాలయ్యామనే బాధ అందరిలోనూ వ్యక్తమవుతున్నది. రైతులకు ఇచ్చిన హామీల్లో రైతు భరోసా నుంచి ధాన్యానికి బోనస్ దాకా అంతా బోగస్‌గా మారిపోయింది. రుణమాఫీని రూ.49 వేల కోట్ల నుంచి రూ.31 వేల కోట్లకు తగ్గించి, బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు మాత్రమే పెట్టి, చివరికి కేవలం రూ.17 వేల కోట్లకు కుదించి లక్షలాది రైతుల నోట్లో మట్టి కొట్టింది కాంగ్రెస్ సర్కార్. ఇటీవల ఎస్‌బీఐ నుంచి ఆర్టీఐ ద్వారా మాజీ మంత్రి హరీశ్‌రావు తీసుకున్న సమాచారం ద్వారా రుణమాఫీకి సంబంధించిన అసలు వాస్తవాలు తేటతెల్లమయ్యాయి. ఇంతకాలం రుణమాఫీ పూర్తయిందని బొంకిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇటీవల ప్రధానికి రాసిన లేఖలో 46 లక్షల మంది రైతులకు గానూ 22 లక్షల మందికే రుణమాఫీ చేసినట్టు స్వయంగా అంగీకరించారు. ఇక కౌలు రైతుల సమస్యనైతే పూర్తిగా కొండెక్కించారు. బీఆర్ఎస్ హయాంలో కౌలురైతులకు రైతు బంధు ఇవ్వాలని గట్టిగా మాట్లాడిన నోళ్లు ఇప్పుడు మాట మాత్రంగానైనా పెగలటం లేదు. మరో పక్క రైతు భరోసా ఇవ్వాల్సింది కౌలురైతుకా? లేదా భూమి కలిగిన రైతుకా? అనేది వారే తేల్చుకోవాలని చెప్పి వ్యవసాయ మంత్రి లేని ఘర్షణకు ఆజ్యం పోశారు. మహిళలకు ప్రతి నెల రూ.2,500 భృతి ఇస్తామన్న హామీ ప్రభుత్వానికి స్మృతిలో కూడా ఉన్నట్టు లేదు. దివ్యాంగులు, వృద్ధులకు పింఛను పెంపు గురించిన ప్రస్తావనే లేదు. 200 యూనిట్ల ఉచిత కరెంటు పొందే అర్హుల సంఖ్య నెలనెలా తగ్గిపోతున్నది. ఉద్యమకారులకు 250 గజాల స్థలం, కల్యాణలక్ష్మితో పాటు ఇస్తామన్న తులం బంగారం తుస్సుమన్నాయి. ఇక నిరుద్యోగులకు ఇచ్చిన హామీలన్నీ నీరుగారిపోయాయి. 25,000 పోస్టులతో వేస్తామన్న మెగా డీఎస్సీని 11 వేలకే పరిమితం చేసి దగా డీఎస్సీగా మార్చారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి, అన్ని ప్రక్రియలు పూర్తిచేసిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి, వాటిని తమ ఖాతాలో వేసుకొని 30 వేల ఉద్యోగాలు ఇచ్చినట్టు చెప్తూ కాంగ్రెస్ సర్కార్ దారుణమైన మోసానికి పాల్పడుతున్నది. ఉత్త తేదీలే తప్ప జాబులే లేని జాబ్ క్యాలెండర్ ప్రకటించడం నిరుద్యోగుల పట్ల కాంగ్రెస్ చేసిన క్రూరమైన పరిహాసం.

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఉద్యమించిన నిరుద్యోగులను నిర్బంధించటమే కాకుండా పెయిడ్ ఆర్టిస్టులుగా చిత్రీకరించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది. ఏ లైబ్రరీ చుట్టూ తిరిగి కాంగ్రెస్ నాయకులు నిరుద్యోగులకు ఆశలు కల్పించారో, అదే లైబ్రరీలో పోలీసులు చొరబడి నిరుద్యోగులపై లాఠీచార్జీ జరపటం కాంగ్రెస్ కపటనీతికి నిదర్శనం. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఎండమావేనని తేలిపోవటంతో నిరుద్యోగుల నిరసన పర్వం ప్రారంభమైంది.

ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులపై ఎదురుదాడులు, నిర్బంధాలు సర్వసాధారణమైపోయాయి. చివరికి శాసనసభ్యులను సైతం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పే దుర్మార్గానికి ఒడిగడుతున్నారు.



ఉద్యోగ, ఉపాధ్యాయులది మింగ లేని, కక్క లేని పరిస్థితి. కాంగ్రెస్ మార్కు మార్పును నమ్మి ఓటు వేసిన పాపానికి ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదు. 'చెప్పుకొంటే మానం బాయె, చెప్పకుంటె పానం బాయె' అనే తీరుగా ఉద్యోగులు మథన పడుతున్నారు. 4 విడతల కరువుభత్యం తక్షణమే విడుదల చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డిని కలిసి గుర్తుచేసే అవకాశం కూడా లేకపోవడమే కాంగ్రెస్ తెచ్చిన పెద్ద మార్పు. 1వ తారీఖున అందరికీ వేతనాలు ఇస్తున్నామని చెప్తున్న కాంగ్రెస్ నిజానికి కొందరికే ఇస్తున్నది.

లక్షల మంది ఉద్యోగులకు నెలల తరబడి అసలు వేతనాలే ఇవ్వకుండా వేధిస్తున్నది. ముఖ్యంగా తక్కువ వేతనాలతో బతుకు వెళ్లదీసే చిరుద్యోగులు పండుగ పూట కూడా చేతుల పైసా లేక నానా అవస్థలు పడుతున్నారు. అంగన్వాడీ, ఆశా వర్కర్ల వేతనాల చెల్లింపులో తీవ్రమైన జాప్యం జరుగుతున్నది. డిగ్రీ కాలేజీ కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసులు రెన్యువల్ కాకపోవడంతో వేతనాలు రాక, వారంతా 'అలో లక్ష్మణా' అని అలమటిస్తున్నారు.

తెలంగాణ ఉద్యమంలో తమ ఆటపాటలతో జనాలను చైతన్యపరిచిన కళాకారులకు గత ప్రభుత్వం ఉద్యోగాలిచ్చి గౌరవించింది. సాంస్కృతిక సారథి కింద పనిచేస్తున్న 550 మంది కళాకారులకు కాంగ్రెస్ వచ్చినంక 4 నెలల జీతం బకాయి పడింది. ఈ మధ్య ఒక నెల జీతం మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొని సద్దుల బతుకమ్మకు సర్దుకొమ్మన్నారు. పలు డిపార్టుమెంట్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పరిస్థితి అయితే మరీ దారుణం. గ్రామ పంచాయతీల పారిశుద్ధ్య కార్మికులకు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్లకు ఆరు నెలలుగా జీతాలు లేవు.

గత పది నెలలుగా ఉద్యోగులకు సంబంధించిన ఏ ఒక్క బిల్లు పాస్ కావడం లేదు. సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు తమ జేబులోంచి ఖర్చు చేస్తూనో, అప్పు చేసో పిల్లల కడుపు నింపుతున్నారు. ప్రభుత్వం నిధుల విడుదలలో చేసిన, చేస్తున్న జాప్యం, విద్యార్థులకు, వార్డెన్లకు అనేక కష్టాలను తెచ్చిపెడుతున్నది. పంచాయతీ కార్యదర్శులదీ ఇదే పరిస్థితి. పారిశుద్ధ్య పనుల కోసం వాళ్లు సొంత డబ్బులు వినియోగించాల్సి వస్తున్నది.

గత మార్చి నుంచి రిటైర్ అయిన ఉద్యోగులకు హక్కుగా ఇవ్వాల్సిన బెనిఫిట్‌లను నిరవధికంగా పెండింగ్‌లో పెట్టింది కాంగ్రెస్ సర్కార్. ఈ రకమైన దిక్కుమాలిన పరిస్థితి చరిత్రలో ఎన్నడూ లేదు. వయసు మీద పడి, బాధ్యతలు తీరక రిటైర్‌మెంట్ డబ్బుల కోసం ఆశగా ఎదురుచూసే వారికి తీవ్ర నిరాశ ఎదురవుతున్నది. జూలై 23 నుంచి రావాల్సిన పే కమిషన్ రిపోర్ట్ ఏమైందో తెలియనే తెలియదు.

ఆరు నెలల్లో నూతన పీఆర్సీ అమలుచేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ మ్యానిఫెస్టోకు వీడని గ్రహణం పట్టింది. ఉద్యోగుల ఆరోగ్య పథకం పడకేసింది. ఏ ఆసుపత్రి కూడా ఉద్యోగులకు ఈ పథకం కింద వైద్యం అందించడం లేదు. వైద్యఖర్చుల వల్ల లక్షల రూపాయల ఆర్థికభారం మీద పడి ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే నాథుడు లేడు.

ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా అది చెవిటివాని ముందు శంఖ మూదినట్టే. నాలుగు విడతల కరువు భత్యం ఇవ్వాల్సి ఉండగా దసరా సందర్భంగా ఒక విడతైనా ఇవ్వాలని ఉద్యోగులు చేస్తున్న అభ్యర్థన అరణ్య రోదనగా మారుతున్నది. చిరుద్యోగులు కన్నీరు పెట్టుకొని కాళ్లా వేళ్లా పడుతున్నా కనికరించడం లేదు. కోరి కోరి కాంగ్రెస్‌ను కొని తెచ్చుకుని కొరివితో తల గోక్కున్నామని ఉద్యోగ, ఉపాధ్యాయులు వాపోతున్నారు. పది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల ఆగ్రహానికి గురికావడం ఖాయమని తేలిపోతున్నది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల లో ఉద్యోగులకు 73 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి వేతనాలను గణనీయంగా పెంచింది. దేశంలో అత్యధిక వేతనం అందుకుంటున్న ఉద్యోగులుగా తెలంగాణ ఉద్యోగులను నిలిపింది. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన మధ్యంతర భృతి తర్వాత ఇంతవరకు ఉద్యోగుల వేతనాల్లో ఒక్క రూపాయైనా కాంగ్రెస్ పెంచింది లేదు. ఇప్పటికైనా వెంటనే ఉద్యోగ సంఘాలతో సంప్రదింపులు జరిపి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పూనుకోవాలి. ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను వెంటనే దూరం చేయాలి. లేకపోతే రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో దాగి ఉన్న ఆగ్రహం బద్దలు కావటం ఖాయం.

(వ్యాసకర్త: ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ చైర్మన్)

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో ఉద్యోగులకు 73 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి వేతనాలను గణనీయంగా పెంచింది. దేశంలో అత్యధిక వేతనం అందుకుంటున్న ఉద్యోగులుగా తెలంగాణ ఉద్యోగులను నిలిపింది. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన మధ్యంతర భృతి తర్వాత ఇంతవరకు ఉద్యోగుల వేతనాల్లో ఒక్క రూపాయైనా కాంగ్రెస్ ప్రభుత్వం పెంచింది లేదు.

రేవంత్ ఆకతాయి పాలన!



శ్రీధర్ ప్రసాద్

సుదీర్ఘ తెలంగాణ ఉద్యమం. వందల మంది బలిదానాలు. వేల మంది అరెస్టులు. లక్షల మంది కవాతు. రాజీనామాలు. ఉప ఎన్నికలు. అవహేళనలు, అపహాస్యాల నడుమ కోట్లాది మంది ప్రజల ఆకాంక్ష మేరకు ఢిల్లీ మెడలు వంచి కేసీఆర్ తెలంగాణను సాధించారు. వచ్చిన తెలంగాణను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న స్పష్టమైన ప్రణాళికతో పదేండ్లు నిరంతరం, నిర్విరామంగా ముందుకువెళ్లి దేశంలో తెలంగాణను అన్నిరంగాల్లో అగ్రభాగాన నిలబెట్టారు.

ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయం మీద విశ్వాసం కోల్పోయిన రైతుల్లో రైతుబంధు, రైతు బీమా, ఉచితంగా వ్యవసాయానికి 24 గంటల కరెంటు, పంటల కొనుగోళ్లు వంటి పథకాలు, కార్యక్రమాలతో కేసీఆర్ ఆత్మవిశ్వాసం నింపారు. సాగునీరు, బతుకుదెరువు లేక పట్నం బాట పట్టి ప్రత్యామ్నాయ ఉపాధి వెతుక్కున్న రైతన్నలకు 'నేనున్నా' అంటూ భరోసానిచ్చారు. దాని ఫలితంగానే దేశానికే అన్నపూర్ణగా తెలంగాణ మారింది.

ప్రాజెక్టులంటే పెండింగ్ అన్న ఆలోచనకు పాతరవేసి ఉమ్మడి రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి, గోదావరి మీద కాళేశ్వరం ఎత్తిపోతల, కృష్ణా నది మీద పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను తలపెట్టి కేవలం మూడున్నరేండ్లలో ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ కాళేశ్వరాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. కాంగ్రెస్ నేతలు వేసిన వందల కేసులను పరిష్కరించుకుంటూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులను 90 శాతం పూర్తి చేశారు. మిషన్ కాకతీయతో చెరువులు, కుంటలను పునరుద్ధరించారు. చెరువులు, కుంటల్లో ఉచితంగా చేపపిల్లలను వదిలి మత్స్యకారుల కుటుంబాల్లో, సబ్సిడీ గొర్రెపిల్లలతో గొల్ల, కురుమల కుటుంబాల్లో ఆర్థిక స్వావలంబనకు బాటలు వేశారు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలోని ఏ రాష్ట్రంలోనూ తెలంగాణ తొలి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు అమలుచేయలేదు. నాటి తెలంగాణ ప్రభుత్వ పథకాలను కేంద్ర ప్రభుత్వంతో పాటు ఇతర రాష్ట్రాలు కూడా కాపీ కొట్టి అమలు చేస్తున్నయంటే దానికి కేసీఆరే కారణం.



'తేలుకు పెత్తనం ఇస్తే తెల్లవార్లు కుట్టిందని' అలవిగాని హామీలను నమ్మి కాంగ్రెస్‌కు ఓటేసిన తెలంగాణ ప్రజలు ఇప్పుడు నాలుక కరుచుకుంటున్నారు. 'కుంచాలమ్మ కూడబెడితే మంచాలమ్మ మాయం చేసిందని' కేవలం పది నెలల కాలంలోనే తెలంగాణలో కేసీఆర్ అమలుచేసిన పథకాలన్నీ మాయమయ్యాయి. అధికారంలోకి వచ్చిన రోజే రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరాకు ఏడాదికి రూ.15 వేల రైతుభరోసా, రూ.4 వేల పింఛన్ ఖాతాలో వేస్తానని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ రైతుభరోసా ఊసే ఎత్తడం లేదు. పింఛన్ల పెంపు ఏమోగానీ రూ.2 వేల ఫించను కూడా మూడు నెలలుగా ఇవ్వడం లేదు. రూ.41 వేల కోట్ల రుణాలను మాఫీ చేయాల్సి ఉండగా.. రూ.17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి రుణమాఫీ చేశామని దబాయిస్తున్నారు కాంగ్రెస్ నాయకులు.

కాంగ్రెస్ అబద్ధపు హామీలను కాసేపు పక్కనపెడితే మూసీ ప్రక్షాళనను ముందేసుకొని, హైడ్రాను రంగంలోకి దించి పేదల ఇండ్ల మీదకు బుల్డోజర్లు పంపి నేలమట్టం చేస్తున్నది కాంగ్రెస్ సర్కార్. తెలంగాణను కేసీఆర్ నిలబెడితే రేవంత్ కూలగొడుతున్నారు. ఒక్కో పథకంతో ఒక్కో రంగాన్ని కేసీఆర్ పటిష్ఠం చేసుకుంటూ పోతే కేవలం పది నెలల్లోనే హైదరాబాద్ ఖ్యాతిని అధఃపాతాళానికి దిగజార్చారు రేవంత్. రూ.1.50 లక్షల కోట్ల మూసీ ప్రక్షాళన ఎవరి ప్రయోజనాల కోసమన్నది తెలంగాణ ప్రజల మదిని తొలుస్తున్న ప్రశ్న?

సంక్షేమ పథకాలు అమలుచేయాలని అడిగితే 'పండబెట్టి తొక్కుతా' అని సీఎం రేవంత్ అంటుంటే.. మంత్రులు, ఎమ్మెల్యేలు తామేం తక్కువ తిన్నామా అన్నట్టు అంతకుమించి మాట్లాడుతున్నారు. హైడ్రాతో జరిగే మేలు ఏంటో తెలియక జనం అల్లాడుతుంటే ఒక ఎమ్మెల్యే పాలకుర్తికి హైడ్రా వస్తుందని, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ నిజామాబాద్‌కు నిద్రా వస్తుందని చెప్పడం విడ్డూరం. ఇక మంత్రి కొండా సురేఖ వ్యవహారం సర్కారు మెడకు పీకల దాకా చుట్టుకున్నా 'కిందపడ్డా మీది చెయ్యి నాదే' అంటూ మూసీ సమీపాన ఉన్న పేదలు వెళ్లిపోవాల్సిందే అంటూ కరాఖండిగా చెప్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత, దివంగత గడ్డం వెంకటస్వామికి గుడిసెల వెంకటస్వామిగా పేరున్నది. అనేకమంది పేదలతో ప్రభుత్వ భూములలో గుడిసెలు వేయించి వారికి పట్టాలిప్పించారని చెప్తుంటారు. ఆయన జయంతి వేదిక మీద పేదల గుడిసెలు కూలుస్తానని ప్రకటించడం రేవంత్‌కే చెల్లింది.

వేదిక ఏదైనా.. సమయం, సందర్భం లేకుండా అనాలోచిత ప్రకటనలు, అనుచిత వ్యాఖ్యలు, అడ్డగోలు బెదిరింపులు తెలంగాణలో నిత్యకృత్యమయ్యాయి. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు వాడుతున్న భాషను చూసి ప్రజలు ఈసడించుకుంటున్నారు. పది నెలల పాలనలో ఒరగబెట్టిందేమీ లేకున్నా, ప్రసంగాల్లో మాత్రం మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. వీధి రౌడీల్లా మాట్లాడుతున్న ఆకతాయి మాటలను చూసి సమాజం నివ్వెరపోతున్నది. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు అందరూ కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయిన వారే. 'ఎద్దు ఈనిందంటే.. దూడను కట్టేయమన్నట్టు' రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన నడుస్తున్నది. ఈ ఆకతాయి పాలనకు అంతిమ తీర్పు ఇచ్చే రోజు కోసం తెలంగాణ సమాజం ఎదురుచూస్తున్నది.

హైడ్రా ఏర్పడిన నాటి నుంచి అది సమాజంలోని అట్టడుగువర్గాల బతుకులను ఎక్కువగా ప్రభావితం చేసిందనే అభిప్రాయం గణనీయంగా పెరిగింది. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వానికి హైడ్రా అసలు లక్ష్యమేమిటన్న విషయమై స్పష్టత లేకపోవడంతో గందరగోళం నెలకొన్నది. హైడ్రాపై ప్రజల్లో అపనమ్మకం ఏర్పడింది.

ఇది ప్రజా వ్యతిరేక చర్య



పొట్టెపాక సందీప్‌కుమార్
బోడపుంటి వినీత్‌కుమార్



హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇటీవల ఆశ్చర్యకరమైన వ్యాఖ్యలు చేశారు. తాము కూల్చబోయే ఇండ్ల యజమానులకు సమయం ఇవ్వబోమని, అలా సమయమిస్తే వారు కోర్టును ఆశ్రయించి, స్టే తెచ్చుకుంటారని చెప్పడం విడ్డూరం. రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన హక్కును హరించివేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని దీన్నిబట్టి అర్థమవుతున్నది.

హైదరాబాద్ కూల్చివేతలపై ఇటు ప్రజల నుంచి, అటు ప్రతిపక్ష పార్టీల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎలాంటి నోటీసులు లేకుండానే ఇండ్లను నేలమట్టం చేస్తున్నారని, అదీ కాకుండా సామాన్యుల ఇండ్లనే లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇండ్లు కోల్పోయిన పేదలు.. అధికారుల కాళ్లపై పడి అభ్యర్థిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో ద్వారా హైడ్రా ఉనికిలోకి వచ్చింది. సంబంధిత ఆర్డినెన్స్‌కు ఇటీవల గవర్నర్ ఆమోదం తెలిపారు. జీహెచ్ఎంసీతో పాటు తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్‌గా పిలుచుకునే రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఓఆర్ఆర్‌కు ఆనుకొని ఉన్న ప్రాంతాల వరకు దీని పరిధి విస్తరించి ఉన్నది. నగరంలో విపత్తులను నివారించడం, చెరువులు, కుంటల వంటి ప్రజా ఆస్తులను పరిరక్షించడానికి హైడ్రాను ఏర్పాటుచేసినట్టు జీవో ద్వారా తెలుస్తున్నది.


ఏదేమైనా హైడ్రా కూల్చివేతలు చట్టబద్ధమైన పాలనకు కట్టుబడకుండా వ్యవహరించే పోలీసుల తీరును పోలి ఉన్నది. సంపన్నుల ఆస్తులను లక్ష్యంగా చేసుకొని, ఆ ముసుగులో పేదల గూళ్లను కూలగొట్టడం, పౌరులను అసమానంగా చూడటం లాంటి దాని వివాదాస్పద చర్యల పట్ల ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సీఎం సోదరుడు, ఓ బడా రియల్ వ్యాపారికి ముందస్తుగా నోటీసులిచ్చి, నెలకు పైగా సమయమివ్వ డం, ఎలాంటి నోటీసులు లేకుండానే పేదల ఇండ్లను కూలుస్తున్నారనే ఆరోపణలు వినవస్తుండటమే అందుకు నిదర్శనం.

పైసా పైసా కూడబెట్టుకొని, తమ కుటుంబాల నీడ కోసం పేదలు కట్టుకున్న ఇండ్లను కూల్చడమంటే.. ఆర్టికల్ 21 ప్రకారం రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కును హరించివేయడమే. రాజ్యాంగం ప్రకారం ఆస్తి హక్కు అనేది ప్రాథమిక హక్కు కాకపోవచ్చు కానీ, ఆర్టికల్ 300 ఏ ప్రకారం అది చట్టపరమైన హక్కు. నోటీసులు లేకుండా ఇండ్లను కూల్చడమంటే ఈ చట్టపరమైన హక్కును కాలరాయడమే.

కూల్చివేతల కంటే ముందు సమగ్రంగా సర్వే చేసి, బాధితులకు పునరావాసం కల్పించాలని సుధమా సింగ్ VS ఢిల్లీ సర్కార్ కేసులో న్యాయస్థానాలు నొక్కిచెప్పాయి. తద్వారా ఆర్టికల్ 21 ప్రకారం రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కులో ఆశ్రయం పొందే హక్కు కూడా భాగమని న్యాయస్థానాలు గుర్తించాయి. హైడ్రా కూల్చివేతలకు సంబంధించి పేద ప్రజలపై దాని ప్రభావం ఆస్తి నష్టం కంటే ఎక్కువగా ఉన్నందున, వారి మనుగడకే ముప్పు పొంచి ఉన్నది.

భారత్ లాంటి ప్రజాస్వామ్య దేశాల్లో చట్టాలు రూపొందించే సర్వాధికారాలు చట్టసభలకే ఉంది. హైడ్రాను చట్టసభల ద్వారా కాకుండా, జీవో ద్వారా ఏర్పాటుచేయడాన్ని బట్టి, రాష్ట్ర చట్టసభలు తమ అధికారం విషయంలో రాజీ పడ్డాయని తెలుస్తున్నది. ప్రాతినిధ్య హక్కు, అప్పీల్ చేసుకునే హక్కు, దోషిగా నిరూపితమయ్యే వరకు నిర్దోషిగానే భావించాలనే పునాదులపై ఆధునిక న్యాయ వ్యవస్థలు నిర్మితమయ్యాయి. ఇలా ఆకస్మిక కూల్చివేతలు చేపట్టడమంటే న్యాయవ్యవస్థ ప్రజలకు కల్పించిన రక్షణలను విస్మరించినట్టే. ఏదైతేనేం, తక్షణ న్యాయం కొంతమేరకు సంతృప్తికరంగా అనిపించవచ్చు. కానీ, పాలనాపరంగా హైదరాబాద్ లాంటి నగరాల్లో అది పనికిరాదు. విపత్తు నిర్వహణ, వాతావరణ పరమైన సమస్యలకు ఈ విధానం మాత్రం దివ్యౌషధం కాదు. ఆర్థికంగా, నైతికంగా, రాజ్యాంగపరంగా.. ఏ రకంగా చూసుకున్నా ఇది ప్రజా వ్యతిరేక చర్యగానే మిగిలిపోతుంది.

('ది వైర్' సౌజన్యంతో..)



ఓటమికి అహంకారమే కారణం!



'ఒకవేళ ఎన్నికల్లో మేం (కాంగ్రెస్) గెలిచే అవకాశముంటే ఎవరితోనూ పొత్తు పెట్టుకోం. కానీ, ఏదైనా రాష్ట్రంలో మేం బలహీనంగా ఉంటే మాత్రం ప్రాంతీయ పార్టీలు మాతో పొత్తు పెట్టుకోవాలి, మాకు సహకరించాలి'.. ఇలాంటి వ్యవహారశైలి, తీరు ఎన్నికల్లో ఓటమికి దారి తీస్తుంది. ప్రాంతీయ పార్టీల పట్ల అహంకారం, వాటిని చిన్నచూపు చూడటమే ఈ ఎన్నికల్లో (కాంగ్రెస్) ఓటమికి ప్రధాన కారణం.

– సాకేత్ గోఖలే, టీఎంసీ ఎంపీ

ఆడబిడ్డలకు కేసీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు



హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు, పిల్లల ఆటపాటలతో తొమ్మిదిరోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా సందడి నెలకొన్నదని పేర్కొన్నారు. సద్దుల బతుకమ్మతో వేడుకలు ముగుస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రజల జీవితాల్లో ప్రకృతి మాత సుఖశాంతులు నింపాలని ఆకాంక్షించారు.

ఉద్యోగాల భర్తీ హుళక్కేనా!

- మరో 6 నెలలు ఉద్యోగాల భర్తీ లేనట్టే
- జాబ్ క్యాలెండర్ అటకెక్కినట్టేనా?
- ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల భర్తీపై నీలినీడలు
- ఎస్సీ వర్గీకరణను సాకుగా చూపించి తప్పించుకునే యత్నం

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): 'ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తాం. ఏటా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి అమలుచేస్తాం' అంటూ యువత, నిరుద్యోగులను మభ్యపెట్టి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు హామీ నుంచి తప్పించుకునేందుకు స్కెచ్‌వేసింది. ఏకంగా ఉద్యోగాల భర్తీని అటకెక్కించేందుకు పటిష్టమైన ప్రణాళికను సిద్ధం చేసింది. ఎస్సీ వర్గీకరణను సాకుగా చూపించి మరో ఆరు నెలలపాటు నోటిఫికేషన్లు లేకుండా.. ఉద్యోగాల భర్తీని పక్కనపెట్టేందుకు సర్కారు సిద్ధమైంది. దీంతో ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాల భర్తీ అటకెక్కినట్టే.

60 రోజుల్లో సాధ్యమేనా?

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు ఏకసభ్య కమిషన్‌ను నియమించనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ప్రకటించారు. 60 రోజుల్లో నివేదికను తెప్పించాలని గడువుగా విధించారు. ఏకసభ్య కమిషన్ నివేదిక వచ్చాకే నూతన నోటిఫికేషన్లు ఉద్యోగాల భర్తీ అంటూ సెలవిచ్చారు. అంటే ఈ నివేదిక వచ్చే వరకు ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిలిచిపోయినట్టే. అంత వరకు ఒక్కటంటే ఒక్క ఉద్యోగాన్ని భర్తీచేయరన్న మాట. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ నియమించిన విచారణ సంఘాల సంగతి చూస్తే నిరుద్యోగ యువత ఉద్యోగాలపై ఆశలు వదులుకోవాల్సిందే. కాళేశ్వరం ప్రాజెక్ట్, విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు, థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణంపై ప్రభుత్వం రెండు విచారణ సంఘాలను నియమించింది. మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని సూచించింది. కానీ 8 నెలలు దాటినా విచారణ ఇంకా కొనసాగుతూనే ఉంది. గడువును పొడిగిస్తూనే ఉంది. ఇదే తరహాలో ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ నివేదిక 60 రోజుల్లో సాధ్యమేనా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నివేదిక వచ్చేదెన్నడు.. అమలుచేసేదెన్నడు.. ఉద్యోగాలు భర్తీ అయ్యేదెన్నడు అన్న ప్రశ్నలు నిరుద్యోగులను పీడిస్తున్నాయి. మొత్తంగా ప్రణాళిక బద్ధంగా ఉద్యోగాల భర్తీ నుంచి తప్పించుకునేందుకు ప్రభుత్వం వేసిన పన్నాగమని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు.

జాబ్ క్యాలెండర్‌లో భర్తీచేయాల్సిన ఉద్యోగాలు

- ట్రాన్స్‌కో, టీజీ ఎస్పీడీసీఎల్, టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఏఈ, ఏఈఈ, సబ్ ఇంజినీర్ ఇతర పోస్టులు
- అన్ని ఇంజినీరింగ్ విభాగాల్లో గెజిటెడ్ క్యాటగిరీ – ఇంజినీరింగ్ సర్వీస్ ఉద్యోగాలు
- గ్రూప్–1 ప్రిలిమినరీ, అసిస్టెంట్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సహా 19 క్యాటగిరీ పోస్టులు
- గెజిటెడ్ స్కేల్ ఇతర ప్రొఫెషనల్ సర్వీసెస్ (గ్రూప్స్‌లోని లేని) పోస్టులు
- పాఠశాల విద్యాశాఖలో టీచర్ పోస్టులు
- అటవీశాఖలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులు
- పోలీసుశాఖలో ఎస్‌ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీ




పార్శీగుట్ట నుంచి ఇందిరాపార్క్‌కు ర్యాలీగా బయలుదేరిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ.. కరీంనగర్‌లో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అడ్డగింతలు, అక్రమ అరెస్టులు

- ఉద్రిక్తతల నడుమ ఎమ్మార్పీఎస్ ర్యాలీ
- మందకృష్ణ మాదిగ అరెస్టు
- వర్గీకరణకు తూట్లు పొడిచేందుకు రేవంత్ యత్నం
- వర్గీకరణ లేకుండానే ఉద్యోగాల భర్తీకి కుట్ర
- సీఎం రేవంత్‌పై నిప్పులు చెరిగిన మందకృష్ణ మాదిగ



కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఎమ్మార్పీఎస్ నాయకులు



మందకృష్ణమాదిగ అరెస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 9(నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండానే ఉద్యోగాలు భర్తీ చేయడంపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం చేపట్టిన నిరసన కార్యక్రమాలను పోలీసులు అడ్డుకున్నారు. ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకోగా.. హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించేందుకు పార్శీగుట్టలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయం నుంచి బయల్దేరిన నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. కొందరు తప్పించుకొని ఇందిరాపార్క్ వద్దకు చేరుకోగా.. అక్కడ భారీగా మోహరించిన పోలీసులు నిరసనకారులను చెదరగొట్టారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగతోపాటు ముఖ్యనేతలను అరెస్టుచేసి గాంధీనగర్, బొల్లారం, రాజేంద్రనగర్, బండ్లగూడ జాగీర్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిపై మందకృష్ణ మాదిగ నిప్పులు చెరిగారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మాదిగలకు అన్యాయం చేసిందని, వర్గీకరణ చట్టానికి తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అన్ని రాష్ట్రాల కంటే ముందుగానే ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని అసెంబ్లీ సమావేశాల్లో చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, తాజాగా చేపట్టిన టీచర్ ఉద్యోగాల భర్తీలో వర్గీకరణకు తిలోదకాలిచ్చారని అన్నారు. దీంతో మాదిగ సామాజికవర్గానికి చెందిన 600కు పైగా నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు.

మాదిగలకు కాంగ్రెస్ వ్యతిరేకం

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని మందకృష్ణ మండిపడ్డారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే కర్ణాటక మాల సామాజిక వర్గానికి చెందిన వారని, అందుకే ఆ పార్టీ మాదిగ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పనిచేస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న ప్రధానశాఖల మంత్రులు కూడా మాల సామాజిక వర్గానికి చెందిన వారే ఉండటంతో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా నియామకాలు భర్తీ చేశారని ఆరోపించారు.

15న ఉద్యమ కార్యాచరణ

శాంతియుతంగా చేపట్టిన ర్యాలీని అడ్డుకున్న రేవంత్ సర్కార్‌కు తగిన మూల్యం చెల్లించేలా ఎమ్మార్పీఎస్ సిద్ధంగా ఉన్నదని మందకృష్ణ స్పష్టంచేశారు. ఎస్సీ వర్గీకరణ అనుసరించే నియామకాలు జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. ఈనెల 15న రాష్ట్రకార్యవర్గ సమావేశం నిర్వహించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

ఎస్సీ వర్గీకరణ నివేదిక వచ్చాకే నోటిఫికేషన్లు

- 60 రోజుల్లో ఏకసభ్య కమిషన్ నివేదిక
- బీసీ సామాజిక, ఆర్థిక, కుల సర్వే పూర్తిచేయాలి
- కమిషన్ల భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 9(నమస్తే తెలంగాణ): సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ కులాల వర్గీకరణ అమలుకు నియమించిన ఏకసభ్య కమిషన్ 60 రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని, ఆ తర్వాతే ఉద్యోగ నియామకాలకు సంబంధించి కొత్త నోటిఫికేషన్లు వేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎస్సీ వర్గీకరణ అమలు, బీసీ సామాజిక, ఆర్థిక కుల సర్వే తదితర అంశాలపై సచివాలయంలో బుధవారం ఆయన సమీక్షించారు. ఎస్సీ వర్గీకరణపై తమకు అందిన వినతులు, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లో వర్గీకరణ అమలవుతున్న తీరు, హర్యానాలో చేపట్టిన చర్యలను మంత్రివర్గ ఉప సంఘం చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి సీఎంకు వివరించారు. న్యాయపరమైన ఇబ్బందులు ఎదురవకుండా హైకోర్టు మాజీ న్యాయమూర్తితో కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎస్సీ వర్గీకరణ కోసం 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకొని, ఏకసభ్య కమిషన్ 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని గడువు నిర్దేశించారు. కమిషన్‌కు అవసరమైన సమాచారాన్ని అన్ని విభాగాల నుంచి అందేలా చూడాలని సీఎస్‌కు సూచించారు. మంత్రివర్గ ఉపసంఘానికి అందిన వినతులపైనా సమావేశంలో చర్చించడంతోపాటు, వాటన్నింటినీ ఏకసభ్య కమిషన్‌కు అందించాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయి నుంచి విజ్ఞప్తులు, ఫిర్యాదుల స్వీకరణకు ఉమ్మడి పది జిల్లాల్లో ఒక్కోరోజు పర్యటించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. తెలంగాణలో బీసీ సామాజిక, ఆర్థిక, కుల సర్వే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని చెప్పారు. సర్వేకు అవసరమైన యంత్రాంగం తమ వద్ద లేదని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలుపగా, రాష్ట్ర ప్రణాళిక విభాగాన్ని కేటాయిస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. బీసీ కమిషన్, ప్రణాళిక విభాగానికి సమన్వయకర్తగా ఓ సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలని సీఎస్ శాంతికుమారికి ఆదేశాలు జారీచేశారు. 60 రోజుల్లోనే సామాజిక, ఆర్థిక సర్వే పూర్తి చేసి, డిసెంబర్ 9లోగా నివేదిక సమర్పించాలని, ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లొచ్చని సీఎం తెలిపారు. సమీక్షలో ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వీ శేషాద్రి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, న్యాయశాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతి, ముఖ్యమంత్రి కార్యదర్శులు మాణిక్‌రాజ్, షానవాజ్ ఖాసీం, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్డినెన్స్ తెచ్చి నియామకాలు చేపట్టాలి

ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్



ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 9: జనాభా ఆధారంగా తక్షణమే ఆర్డినెన్స్ తీసుకొచ్చి నియామకాలు చేపట్టాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. సుప్రీంతీర్పు అనంతరం అన్ని నియామక నోటిఫికేషన్లలో వర్గీకరణ అమలు చేస్తామని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అవసరమైతే ఆర్డినెన్స్ సైతం జారీ చేస్తామని చెప్పి, ప్రస్తుతం కాలయాపన చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తార్నాకలోని తన కార్యాలయంలో బుధవారం వినోద్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. వర్గీకరణ అమలుచేస్తే దళితుల్లో ఏ కులానికీ అన్యాయం జరగదని అభిప్రాయపడ్డారు.

డీఎస్సీ నియామకాలు రద్దు చేయాలి: ఎంఎస్‌ఎఫ్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 9: సుప్రీంకోర్టు తీర్పు అమలుచేయకుండా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న డీఎస్సీ నియామకాలను రద్దు చేయాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్‌ఎఫ్) డిమాండ్ చేసింది. వర్గీకరణ చేసిన తరువాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకట్, కార్యనిర్వాహక అధ్యక్షుడు వరిగడ్డి చందు కోరారు. డీఎస్సీ నియామకాలను వ్యతిరేకిస్తూ ఎంఎస్‌ఎఫ్ టీజీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిరాహార దీక్ష చేపట్టారు.

త్వరలో వెహికల్ స్క్రాప్ పాలసీ

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రవాణా శాఖలో పలు కీలక సంస్కరణలు తీసుకురానున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. బుధవారం ఆయన రవాణా శాఖ కమిషనర్‌తో కలిసి సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. త్వరలో వెహికిల్ స్క్రాప్ పాలసీని అమలు చేయడంతోపాటు ఆటోమేటిక్ వెహికల్ టెస్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని, వాహన్ సారథి పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.



కోస్గి నుంచి పోలెపల్లికి పెద్ద సంఖ్యలో తరలివస్తున్న రైతులు



కొడంగల్ నియోజకవర్గం హకీంపేట కూడలిలో బారికేడ్లు ఏర్పాటు చేసి రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

సీఎం ఇలాకాలో ఫార్మా బాధితుల ఆందోళన

- మహా పాదయాత్రతో ఉద్రిక్త వాతావరణం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు
- పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

కొడంగల్, అక్టోబర్ 9: సీఎం ఇలాకాలో ఫార్మా బాధిత రైతుల ఆందోళన ఉధృతమైంది. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు వ్యతిరేకంగా రైతులు చేస్తున్న ఆందోళనలకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మహా పాదయాత్రకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం పోలెపల్లి ఎల్లమ్మ దేవాలయం వద్ద ప్రత్యేక పూజల అనంతరం మహాపాదయాత్ర ప్రారంభం కావాల్సి ఉంది. ఇందుకోసం పలు గ్రామాల నుంచి తరలివస్తున్న రైతులను ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటుచేసి పోలీసులు అడ్డుకున్నారు. అయినా బారికేడ్లు తోసుకుని పోలెపల్లి ఆలయానికి రైతులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. మహాపాదయాత్రలో పాల్గొనేందుకు వస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల గ్రామం వద్ద పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాంతో మహాధర్నాకు తరలివచ్చిన రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు ఫార్మా కంపెనీలకు వ్యతిరేకంగా, అరెస్టును ఖండిస్తూ.. హకీంపేట గ్రామ కూడలిలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ధర్నాలో పోలీసులు, బాధిత రైతులు, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకొని ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఫార్మా కంపెనీలు వద్దు.. పచ్చటి భూములను కాపాడాలని శాంతియుతంగా పాదయాత్ర చేపడితే అరెస్టులతో అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించారు. ఫార్మాతో కాలుష్యం అవుతుందని రైతులు మొత్తుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. రైతుల శవాలపై ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయాలని, ఫార్మా కంపెనీల రద్దు కోసం పోరాడేందుకు ఎంతవరకైనా సిద్ధమని రైతులు తేల్చిచెప్పారు. పరిగి పోలీస్‌స్టేషన్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీల ఏర్పాటుపై ప్రజలకు అనుమానాలున్నాయని, వాటిని నివృత్తి చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడాలని, ప్రజలు వ్యతిరేకిస్తున్న కాలుష్య కంపెనీల ఏర్పాటుపై ప్రభుత్వం వెనక్కి తగ్గాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కొడంగల్ ప్రజలు రేవంత్‌రెడ్డిని సీఎంను చేస్తే.. ఆయన కొడంగల్‌లో ఫార్మా కంపెనీలతో కాలుష్యం అంటగట్టేందుకు చూస్తున్నారని ఆరోపించారు. ఫార్మా కంపెనీల ఏర్పాటుకు గతంలో బీఆర్‌ఎస్ హయాంలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరంలో 14 వేల ఎకరాలు కేటాయించామని, అక్కడ ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఫార్మా కంపెనీల ఏర్పాటుపై ప్రభుత్వం వెనక్కి తగ్గకుంటే సీఎం ఇంటి ముందు ధర్నా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

అరెస్ట్ అప్రజాస్వామికం: సబిత

వికారాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా విలేజ్ ఏర్పాటు విషయంలో ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మా విలేజ్ పేరిట రైతుల భూములను లాక్కోవటాన్ని నిరసిస్తూ శాంతియుతంగా పాదయాత్ర చేసేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డిల అరెస్టులు అప్రజాస్వామికమని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి నిర్బంధాలు గతంలో ఎన్నడూ చూడలేదని, అరెస్ట్ చేసిన బీఆర్‌ఎస్ శ్రేణులను వెంటనే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని స్పష్టంచేశారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించి ఫార్మా విలేజ్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సబితారెడ్డి డిమాండ్ చేశారు.



మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

ఫార్మాసిటీ వద్దు ఉయ్యాలో.. వ్యవసాయమే ముద్దు ఉయ్యాలో..

- ఫార్మా వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో యాచారం మండలంలో బతుకమ్మ ఆడి నిరసన

యాచారం, అక్టోబర్ 9: 'ఫార్మాసిటీ వద్దు ఉయ్యాలో.. వ్యవసాయమే ముద్దు ఉయ్యాలో.. కాంగ్రెస్ వచ్చింది ఉయ్యాలో.. రైతులను ముంచింది ఉయ్యాలో' అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బతుకమ్మ పాటలు మార్మోగాయి. ఫార్మాసిటీ వ్యతిరేక నినాదాలతో అక్కడి ప్రాంతం హోరెత్తింది. ఫార్మాసిటీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లిలో ఫార్మా వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం ఫార్మా బాధిత రైతులు వినూత్న నిరసన చేపట్టారు. గ్రామంలో ఉన్న ఫార్మా స్తూపం వద్ద మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన మహిళలు, రైతులు పెద్ద ఎత్తున గుమికూడారు. అక్కడే బతుకమ్మ ఆడుతూ నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. బతుకమ్మలకు హారతి ఇచ్చి ఘనంగా నిమజ్జనం చేశారు. అనంతరం ఫార్మాకు వ్యతిరేకంగా రైతుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సామాజిక వేత్త కవుల సరస్వతి మాట్లాడుతూ.. ఫార్మాసిటీని వెంటనే రద్దు చేయాలని కోరారు. ఫార్మా సిటీ.. ఫ్యూచర్ సిటీ అంటూ ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తున్నదని ఆమె మండిపడ్డారు.



ఫార్మాకు వ్యతిరేకంగా మేడిపల్లిలో బతుకమ్మ ఆడుతూ మహిళల నిరసన

బీఆర్‌ఎస్ నేతల అరెస్ట్ హేయమైన చర్య

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, అక్టోబర్ 9: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి అరెస్టు హేయమైన చర్యగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీ కోసం భూసేకరణను వ్యతిరేకిస్తూ బుధవారం రైతులతో కలిసి పాదయాత్రకు వెళ్లిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని వికారాబాద్ జిల్లా తుంకిమెట్ల వద్ద పోలీసులు అరెస్టు చేశారు. పట్నం, నవీన్‌ను పోలీసులు కొత్తకోట పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రితోపాటు మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పీఎస్‌కు వెళ్లి అరెస్టయిన నేతలకు సంఘీభావం తెలిపారు. కార్పొరేట్ వ్యవస్థతో కుమ్మక్కై రైతులను ముంచుతున్న సీఎం రేవంత్‌రెడ్డి చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. ఎన్ని నిర్బంధాలు చేసినా ప్రజలు, కర్షకుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.



కొత్తకోట పీఎస్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డితో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

దేవుడిపై సర్కారు పన్ను

ఆలయాల సొమ్ము సగం ప్రభుత్వ ఖజానాకే.. సీజీఎఫ్ వాటా 12 శాతం పెంపు

- ఇప్పటికే వివిధ పన్నుల రూపంలో 41% తీసుకుంటున్న సర్కార్
- తాజా పన్నుతో ప్రభుత్వ ఖజానాకే 48%
- ప్రభుత్వ ప్రతిపాదనపై ధార్మిక సంస్థల ఆగ్రహం



ప్రస్తుతం ఆలయాల నుంచి సర్కారు వసూలు చేస్తున్న పన్నులు

ఎండోమెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఫండ్	12%
సీజీఎఫ్	5%
ఆడిట్ ఫీజు	1%
అర్చక వెల్ఫేర్ ఫండ్	3%
గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఆలయాలపై పన్ను	10-20%
మొత్తం కలుపుకొని	41%

(సీజీఎఫ్ 12 శాతానికి పెంచితే 48 శాతానికి పెరగనున్న పన్నులు)

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): సామాన్యులు, సంపన్నులకే కాదు; చివరికి దేవుళ్లకూ రేవంత్ సర్కారు నుంచి తిప్పలు తప్పడం లేదు. దేవుడి సొమ్ముపై మరో 7% పన్ను విధించాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 5% ఉన్న కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) కాంట్రిబ్యూషన్‌ను ఏకంగా 12 శాతానికి పెంచాలని ప్రభుత్వం నిశ్చయించింది. ఆదాయం ఆధారంగా ఆయా దేవాలయాలను నాలుగు రకాలుగా విభజించి, నాలుగు స్లాబుల్లో (5, 7, 10, 12 శాతాల్లో) సీజీఎఫ్ వసూలు చేయాలని సర్కారు నిర్ణయం తీసుకున్నది. సీజీఎఫ్ కాంట్రిబ్యూషన్ పెంపు ద్వారా వసూలయ్యే మొత్తాన్ని చిన్న దేవాలయాల కోసం ఖర్చు పెట్టనున్నట్టు దేవదాయశాఖ వర్గాలు తెలిపాయి.అసలు సీజీఎఫ్ కాంట్రిబ్యూషనే రాజ్యాంగ విరుద్ధమని ధార్మిక సంఘాలు వాదిస్తున్న నేపథ్యంలో, దానిని 12 శాతానికి పెంచడం తీవ్ర విమర్శలకు కారణమవుతున్నది. 'రాష్ట్రంలో ఎక్కడా చర్చీలు, మసీదుల ఆదాయంపై పన్ను లేదు. అలాంటప్పుడు దేవాలయాల నుంచి మాత్రం ఎట్లా వసూలు చేస్తారు?' అని ఒక అర్చక సంఘం నేత ఆగ్రహం వ్యక్తం చేశారు. 'భక్తులు హుండీలో వేసే కానుకలు, కొనుగోలు చేసే టికెట్లతోనే ఆలయానికి ఆదాయం సమకూరుతుంది.ఒకసారి భక్తులు ముడుపును సమర్పించారంటే ఆ సొమ్ము దేవుడిదేనన్నమాట. అటువంటి దేవుని సొమ్ముపై కాంట్రిబ్యూషన్ పేరుతో పన్ను వేయడం దారుణం. అయినా ఉన్న దేవుడి సొమ్మును తీసి లేని దేవుడికి ఇస్తామని చెప్పడానికి సర్కారు ఎవరు?' అని ప్రధాన దేవాలయానికి చెందిన అర్చకుడొకరు ఆగ్రహం వ్యక్తంచేశారు. టెంపుల్ టూరిజం ద్వారా, భక్తుల ద్వారా సర్కారుకు పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతుంది. ఈ నేపథ్యంలో సర్కారు సొమ్ముతో దేవాలయాలను అభివృద్ధి చేయాల్సింది పోయి, దేవుడి సొమ్ము నుంచి వసూళ్లేమిటి? ఆలయాలకు వస్తున్న ఆదాయంలో గండికొట్టడం ఏమిటనే అభ్యంతరం వ్యక్తమవుతున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటైనప్పటినుంచి ఆలయాలకు ఒక్కపైసా ఖర్చుచేసిన దాఖలాలు లేదు. ఆలయాల అభివృద్ధికి నయాపైసా వెచ్చించకపోగా,ధూప దీప నైవేద్యం స్కీమ్‌లో ఒక్క ఆలయాన్ని కూడా చేర్చలేదు. అంతేకాదు, డీడీఎన్ ఆలయాలకు వేతనాలు సక్రమంగా అందడం లేదు. పుండు మీద కారం చల్లిన చందంగా సీజీఎఫ్ కింద ఆలయాల వాటాను 5% నుంచి 12 శాతానికి పెంచాలని తాజాగా నిర్ణయించారు. రూ.25 లక్షలు, అంతకన్నా ఎక్కువ ఆదాయం వచ్చే ఆలయాలనుంచి 12%, అసలు ఆదాయం లేని చిన్న ఆలయాలు, మఠాల నుంచి 5% చొప్పున వసూలు చేయాలని నిశ్చయించారు. ఈ మేరకు ఆయా ఆలయాలు, వాటికి వస్తున్న ఆదాయాలనుబట్టి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈవోలకు ఆదేశాలు జారీచేశారు. ఈ పన్నుతో నియోజకవర్గాల వారీగా ఆదాయం లేని ఆలయాలను అభివృద్ధి చేస్తామయని చెప్తున్నారు.

దేవుడి సొమ్ము సగం సర్కారు ఖజానాకే!

హిందూ ఆలయాలు ఇప్పటికే సర్కారీ పన్నుపోటుతో సతమతమవుతున్నాయి. సీజీఎఫ్ కాంట్రిబ్యూషన్‌కు అదనంగా, ప్రతి దేవాలయం నుంచి ఎండోమెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఫీజు కింద 12% వసూలు చేస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ వేతనం కోసమని గతంలో 5% ఉన్న అడ్మినిస్ట్రేటివ్ ఫీజును ప్రభుత్వం మరో 7% పెంచి 12% చేసింది. చివరికి ఆలయాల లెక్కలు చూడటం కోసమని 1.5% ఆడిట్ ఫీజు వసూలు చేస్తున్నది. అర్చక వెల్ఫేర్ ఫండ్ కింద 3%, గ్రాంట్ ఇన్ ఎయిడ్ వేతనాలు పొందుతున్న ఉద్యోగులున్న ఆలయాల్లో వారి వేతనాల కోసమని 10 నుంచి 20% వరకు ప్రభుత్వం పన్ను వసూలు చేస్తున్నది. వీటన్నింటినీ కలుపుకుంటే దేవుడి సొమ్ములో దాదాపు 45-50% దాకా సర్కారుకే జమ అవుతున్నది.

'అసలు ఆలయాలపై సర్కారు పెత్తనాన్ని ఎవరు అడిగారు. ఆలయ సిబ్బందికి వేతనాల కోసం దేవుడి సొమ్ము వాడుతారా? ఆలయం లెక్కలు చూడటానికి దేవుడు పన్ను కట్టాలా? ప్రభుత్వంలోని మిగతా అన్ని శాఖల్లో ఉద్యోగుల వేతనాల కోసం ఆయా శాఖల నుంచి పన్ను వసూలు చేస్తున్నారా? వాటికి లేని పన్ను హిందూ దేవుళ్లపైనే ఎందుకు?' అని ధార్మిక సంస్థ నాయకుడు ప్రశ్నించారు. మసీదులు, చర్చిలు ప్రభుత్వానికి ఎలాంటి పన్నులూ చెల్లించకున్నా వాటి అభివృద్ధికి, వేతనాలకు నిధులు కేటాయిస్తున్నారని, అదే హిందూ ఆలయాలకు వచ్చే సరికి దేవుడి సొమ్మును లాక్కుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

ఆలయాల ఆదాయం నుంచి సీజీఎఫ్ వాటా పెంపు ప్రతిపాదనలు

క్యాటగిరీ	ఆలయాలు	ప్రతిపాదన
6ఏ (రూ.25 లక్షలు, అంతకన్నా ఎక్కువ ఆదాయం వచ్చేవి)	135	12%
6బీ (రూ. 2లక్షల నుంచి 25 లక్షల వరకు ఆదాయం వచ్చేవి)	304	10%
6సీ(రూ. 2లక్షలలోపు ఆదాయం వచ్చేవి)	11,894	7%
6డీ(మఠాలు, ఆదాయం పెద్దగా లేనివి)	101	5%
మొత్తం	12,434	

కేసీఆర్ హయాంలో ఆలయాల అభివృద్ధి

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ. 2000 కోట్లు వెచ్చించి యాదగిరిగుట్ట ఆలయాన్ని అభివృద్ధి చేశారు. ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) ద్వారా నిధులు కేటాయించి ఆలయంలో అభివృద్ధి పనులు నిర్వహించగా, ఇతర నిర్మాణాలు ఆర్‌అండ్‌బీ సహా ఇతర శాఖల ద్వారా చేపట్టారు. అనేక ప్రధాన ఆలయాల్లో పెద్దఎత్తున నిధులు వెచ్చించి భక్తుల సౌకర్యాలను మెరుగుపర్చారు. వేములవాడ శ్రీ రాజ రాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల కోసం 35 ఎకరాల భూమిని సేకరించడంతోపాటు ఆలయ అభివృద్ధికి రూ.70 కోట్ల వరకు ఖర్చుచేశారు. కొండగట్టు ఆంజనేయస్వామి, బాసర జ్ఞానసరస్వతి, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి, భద్రాచలం రామాలయం తదితర ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలుసిద్ధం చేసి నిధులు కేటాయించారు. ఇవికాకుండా సీజీఎఫ్ నిధుల ద్వారా 150 గ్రామీణ ఆలయాలను అభివృద్ధి చేసేందుకు కూడా ప్రతిపాదించారు. స్థానికులు రూ. 3లక్షలు సమకూర్చుకుంటే... ప్రభుత్వం సీజీఎఫ్ ద్వారా ఒక్కో ఆలయానికి రూ.10 లక్షల చొప్పున మంజూరు చేయాలనేది ఈ ప్రతిపాదన. అలాగే, ధూప దీప నైవేద్య పథకం(డీడీఎన్) కింద 7,000 పైచిలుకు ఆలయాలకు ప్రతినెలా రూ.10,000 చొప్పున నిధులు విడుదల చేశారు. కాగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఆలయాలకు ఇంతవరకు నయాపైసా ఖర్చు చేయకపోగా, ఉన్న పన్నులను మరింత పెంచి సర్కారు ఖజానా నింపుకొనేందుకు చర్యలు చేపట్టడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది.



బాల్కొండలో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

తులం బంగారం ఏమైంది?

- పింఛన్ల పెంపు ఎటుపోయింది?
- హామీలను వదిలేసి మూసీ జపమెందుకు?
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్/మోర్తాడ్, అక్టోబర్ 9: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినా వాటిని అమలు చేయడం లేదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. కల్యాణలక్ష్మితో పాటు ఇస్తామన్న తులం బంగారం ఏమైంది? ప్రతి మహిళకు రూ.2,500 చొప్పున ఇస్తామన్న డబ్బులు ఎటు పోయాయని ప్రశ్నించారు. హామీలు అమలు చేయకుండా మూసీ జపం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా బీఆర్‌ఎస్ తరఫున వెంటాడుతామని స్పష్టంచేశారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్, బాల్కొండ, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమాల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను వేముల పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదింట్లో ఆడబిడ్డల పెండ్లి చేయడం ఎంత కష్టమో కండ్లతో చూసిన అప్పటి సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రారంభించారని, ఇది ఎంతో మంది పేదింటి ఆడబిడ్డలకు వరంగా మారిందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని సక్రమంగా అమలు చేయని సర్కార్.. రూ.1.50 లక్షల కోట్లతో ఎవరికి పనికి రాని మూసీ ప్రక్షాళన చేస్తామనడం విడ్డూరంగా ఉన్నదన్నారు.

గొడవకు దిగిన కాంగ్రెస్ నాయకులు

తులం బంగారం హామీని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ నేతలు ప్రభుత్వానికి విన్నవించాలని వేముల సూచించారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న అధికార పార్టీ నేతలు గొడవకు దిగారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటను గుర్తు చేస్తుంటే అసహనానికి గురై, అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. హామీలు నెరవేర్చాలని ప్రజలంతా అడుగుతుంటే కాంగ్రెస్ నేతలు గత ప్రభుత్వంపై నిందలు మోపి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. ప్రస్తుతం చెక్కులు తీసుకుంటున్న వారంతా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పెండ్లి జరిగిన వారేనని తెలిపారు.

కాంగ్రెస్ నాయకులను నిలదీసిన లబ్ధిదారులు

'మీ ప్రభుత్వం వచ్చాకే మా బిడ్డలకు పెండ్లిళ్లు అయ్యాయి. మీరు ఇచ్చిన హామీ ప్రకారం రూ.లక్షతోపాటు తులం బంగారం అందించాలి' అని అక్కడున్న మహిళలు కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. లబ్ధిదారులు అడుగుతున్న ప్రశ్నలకు అధికార పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని వేముల డిమాండ్ చేశారు. ఎన్ని జిమ్మిక్కులు చేసి తప్పించుకున్నా బీఆర్‌ఎస్ మాత్రం విడిచి పెట్టదని, అన్ని హామీలు అమలయ్యే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

'కల్యాణలక్ష్మి తులం బంగారం' ఎప్పుడిస్తరు?

- భువనగిరి చెక్కుల పంపిణీలో ప్లకార్డులతో బీఆర్‌ఎస్ నిరసన
- బీఆర్‌ఎస్ నాయకుల అరెస్టు.. భువనగిరి స్టేషన్‌కు తరలింపు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 9: కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో భాగంగా కల్యాణలక్ష్మి చెక్కుతోపాటు తులం బంగారం ఎప్పుడిస్తారని బీఆర్‌ఎస్ నాయకులు నిలదీశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని ఓ గార్డెన్‌లో బుధవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ భువనగిరి పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు తులం బంగారం వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏవీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీ సరిగ్గా అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గత ప్రభుత్వం ఇచ్చిన మాదిరిగానే ప్రజలకు కల్యాణలక్ష్మి చెక్కులను అందిస్తున్నదని దుయ్యబట్టారు. వానకాలం రైతుబంధును ఇప్పటికీ ఇవ్వలేదని, ఏకకాలంలో రెండు లక్షల రైతు రుణమాఫీ చేయలేదని మండిపడ్డారు. హామీల అమలులో కాలయాపన చేస్తే బీఆర్‌ఎస్ పార్టీ తరఫున పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

ప్రభుత్వ కాలేజీపై అనధికారిక చిహ్నమా?

- బీఆర్‌ఎస్ నేత కొణతం దిలీప్ విస్మయం

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): నాగర్‌కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీపై ఏర్పాటు చేస్తున్న లోగోపై బీఆర్‌ఎస్ నేత కొణతం దిలీప్ విస్మయం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించని ఒక అనధికారిక చిహ్నాన్ని కాలేజీ భవనం మీద ఎలా ఏర్పాటు చేస్తారని బుధవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఈ విషయంలో స్పందించాలని సీఎస్, నాగర్ కర్నూల్ కలెక్టర్‌ను కోరారు. "మీరు ఒక రాష్ట్ర ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. సర్కస్ కంపెనీని కాదు. రాష్ట్ర అధికారిక చిహ్నానికి ఎంతో గౌరవం, ప్రతిష్ఠ ఉంటుంది. దీన్ని పిల్లలాటగా మార్చవద్దు" అని విజ్ఞప్తి చేశారు. లోగో ఏర్పాటు చేస్తున్న వీడియోను జత చేశారు. చిహ్నం తానే తయారు చేశానంటూ తప్పుడు కేసు పెట్టినా ఆశ్చర్యం లేదని ఎద్దేవా చేశారు.

లక్ష కోట్ల అవినీతికి మూసీ స్కెచ్

లక్షన్నర కోట్లలో లక్ష కోట్లకు ఎసరు • కాంగ్రెసోళ్లు కమీషన్లు రావనే సంక్షేమ పథకాలను పక్కన పెట్టిండ్రు

రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డికే ఉద్యోగాలు.. తెలంగాణ యువతకేవీ? • కేసీఆర్, బీఆర్‌ఎస్ ఉన్నంత వరకు పేదలెవరికీ భయం అవసరం లేదు

- కేసీఆర్ సీఎంగా ఉండి ఉంటే రైతుల ఖాతాల్లో డబ్బు, ఆడబిడ్డలకు చీరలొచ్చేవి
- కాంగ్రెస్ అరాచకాలను చూసి అందరూ కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటున్నరు
- మోసాలను పసిగట్టి హర్యానాలో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పిండ్రు
- మోదీతో కొట్లాడినం.. మా చెల్లిని జైల్లో పెట్టిండ్రు అయినా మేం తలవంచలేదు..
- నీ కొడంగల్‌లోనే రైతులను ఒప్పించలే.. ఇగ రాష్ర్టాన్నేం నడిపిస్తవ్? : రేవంత్‌పై కేటీఆర్ ఫైర్
- అనుచరులతో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ సీనియర్ లీడర్ మహమ్మద్ అలావుద్దీన్ పటేల్
- గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన కేటీఆర్



తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యేలు బాలరాజు, రాజయ్య, ఆనంద్ తదితరులు

> సెక్యులరిజాన్ని కొనసాగిస్తం.. మనిషిని మనిషిగా చూస్తూ భవిష్యత్తులోనూ ఇదే రాజకీయం చేస్తం. మోదీ మమ్మల్ని బెదిరించేందుకు ప్రయత్నించిండు. నా చెల్లిని తీహార్ జైల్లో పెట్టిండు. అయినా మేము తలవంచలే. మోదీతోనే పోరాడినం. అదే స్ఫూర్తిని కొనసాగిస్తం. పేదలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాడుతం.
> - కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 9 (నమస్తే తెలంగాణ) : మూసీ సుందరీకరణ పేరుతో 1.50 లక్షల కోట్లలో లక్ష కోట్ల సొమ్మును రాహుల్, రేవంత్‌రెడ్డి పంచుకునేందుకు సిద్ధమయ్యారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సంక్షేమ పథకాల్లో కమీషన్లు రావనే ఉద్దేశంతోనే వాటిని అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో బతుకమ్మ, దసరా పండుగ వాతావరణమే లేదని, కేసీఆర్ సీఎంగా ఉండి ఉంటే చీరలు, రైతుల ఖాతాల్లో డబ్బులు పడేవని గుర్తుచేశారు. కాంగ్రెస్ అరాచకాలను చూసి ప్రతి ఒక్కరూ కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ హామీల పేరుతో చేసిన మోసాలను చూసి హర్యానా ప్రజలను ఆ పార్టీకి బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ లీడర్ మహమ్మద్ అలావుద్దీన్ పటేల్ సహా ఆయన అనుచరులు బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ యూపీలో సీఎం బుల్డోజర్‌రాజ్‌ను నడిపిస్తున్నాడని గతంలో అనుకున్నామని, ఇప్పుడు తెలంగాణలో కూడా బుల్డోజర్ సంస్కృతి తీసుకొచ్చారని చెప్పారు. అరచేతిలో వైకుంఠం చూపించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, పది నెలల పాలనలో అన్ని వర్గాలు అసంతృప్తితో ఉన్నాయని విమర్శించారు. డిసెంబర్ 9న సోనియా గాంధీ జన్మదినం రోజునే రెండు లక్షలు రుణమాఫీ చేస్తామని రేవంత్, రాహుల్ గాంధీ స్వయంగా ప్రకటించారని, మరో డిసెంబర్ 9 రాబోతున్నా ఇప్పటికీ రుణమాఫీ పూర్తి కాలేదని చెప్పారు. రాహుల్‌గాంధీకి, రేవంత్‌రెడ్డికి తప్ప తెలంగాణ యువతకు ఉద్యోగాలు రాలేదని మండిపడ్డారు.

> కేసీఆర్ ఉద్యోగం పోగొట్టండి.. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలిస్తమని రాహుల్‌గాంధీ అశోక్‌నగర్ వచ్చి యువతకు హామీ ఇచ్చిండు. ఇప్పుడు రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఇద్దరికే తప్ప తెలంగాణ యువతకు ఉద్యోగాలు రాలేదు.
> - కేటీఆర్

లక్ష కోట్ల అవినీతి..

మహిళలకు రూ.2500 ఇస్తామన్నారని, 1.67 కోట్ల మంది మహిళలు రూ.2500 కోసం వేచి చూస్తున్నారని కేటీఆర్ తెలిపారు. వృద్ధులకు రూ.4వేలు అన్నారని, ఇంట్లో ఇద్దరికీ పింఛన్ అన్నారని, ఒక్కరికైనా వచ్చిందా? అని ప్రశ్నించారు. ఉన్న రైతుబంధు, ఉన్న పింఛన్ కూడా వస్తలేదని, కల్యాణలక్ష్మి పేరుతో తులం బంగారమిస్తా అన్నాడని, తులం ఇనుము కూడా ఇవ్వడంటూ ఎద్దేవా చేశారు. 420 హామీల గురించి అడిగితే సమాధానం చెప్పడం లేదని, మూసీ కోసం లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తానంటున్నాడని దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణ పేరిట లక్షకోట్లకు ఎసరు పెట్టారని, అందులో సగం రాహుల్ గాంధీ, వాళ్ల బావ, మిగిలిన సగం రేవంత్‌రెడ్డి పంచుకోవాలని ప్లాన్ వేశారని ఆరోపించారు. హామీలు, పథకాలపై ఓట్ల కోసం వచ్చిన కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

> సంక్షేమ పథకాల కోసం నిధులిస్తే కమీషన్లు రావు కదా? అదే మూసీ ప్రాజెక్ట్ అయితే లక్ష కోట్లు మింగొచ్చు.. ఇందులో సగం రాహుల్ గాంధీ, వాళ్ల బావ.. మిగిలిన సగం రేవంత్‌రెడ్డి పంచుకోవాలన్నదే వారి స్కెచ్చు.
> - కేటీఆర్

రాహుల్ బుద్ధి తెచ్చుకోవాలి

కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణలో గ్యారెంటీల పేరుతో మోసం చేశారని, హర్యానాలో ఏడు గ్యారెంటీలంటూ మోసం చేయబోయారని, కాంగ్రెస్ మోసాలను గుర్తించి అక్కడి ప్రజలు సరైన బుద్ధి చెప్పారని, ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. హామీలు నెరవేర్చకుంటే ఇక్కడి ప్రజలు కూడా గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

కేసీఆర్ సీఎంగా లేరన్న బాధ..

రాష్ట్రంలో ప్రతి పౌరుడు ఇప్పుడు కేసీఆర్ సీఎంగా లేరన్న బాధలో ఉన్నారని, పేదల కోసం కేసీఆర్ అన్నీ చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కేసీఆర్, బీఆర్‌ఎస్ ఉన్నంత వరకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సెక్యులర్ వైఖరినే కొనసాగిస్తామని, మనిషిని మనిషిగా చూస్తూ భవిష్యత్తులోనూ ఇదే తరహా రాజకీయం చేస్తామని స్పష్టంచేశారు. మోదీ తమను బెదిరించేందుకు తన చెల్లిని జైల్లో పెట్టించినా తాము తల వంచలేదని, ఆయనతో పోరాటం చేశామని, అదే స్ఫూర్తితో కాంగ్రెస్‌తోనూ పోరాడుతామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు.

రాష్ట్రంలో భయానక వాతావరణం

రాష్ట్ర ప్రజలందరికీ కేటీఆర్ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పుడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటే రైతుల ఖాతాల్లోకి టింగ్‌టింగ్‌మని డబ్బులు, ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు అందేవి అని గుర్తుచేశారు. ఈ సారి బతుకమ్మ బతుకమ్మలా దసరా దసరాలా లేదని, రాష్ట్రంలో పండుగ జరుపుకొనే పరిస్థితి లేకుండా భయానక వాతావారణం సృష్టించారని వాపోయారు. ఆడబిడ్డలు బతుకమ్మ అడుకుంటామంటే డీజేలను కూడా బంద్‌పెట్టారని మండిపడ్డారు. మంగళవారం వరంగల్‌లో ఓ ఎమ్మార్వో బతుకమ్మ ఘాట్‌ను చూసేందుకు వెళ్తే ఇండ్లు కూలగొట్టేందుకు వచ్చారనుకొని అక్కడివాళ్లు తరిమి కొట్టారని, రేవంత్‌రెడ్డి వచ్చాక రాష్ట్రంలో పరిస్థితి ఇలా తయారైందంటూ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు.

సొంత నియోజకవర్గ ప్రజలను ఒప్పించు..

ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో రైతులు, మహిళలు, పేదలు తమ భూములను ప్రభుత్వం అక్రమంగా గుంజుకుంటున్నదని ఆవేదనతో అండగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి కోరారని, ఆయన పాదయాత్ర చేస్తే రేవంత్‌రెడ్డి సూచన మేరకు దుర్మార్గంగా, అరాచకంగా, అక్రమంగా అరెస్ట్ చేశారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్కడ రైతుల మీద లాఠీచార్జీ చేశారని చెప్పారు. 'నీ సొంత నియోజకవర్గం కొడంగల్‌లోనే ప్రజలను ఒప్పించ చేతకాని నీవు రాష్ర్టాన్ని ఎట్ల నడిపిస్తవ్?, నిన్ను ప్రజలు ఎట్లా నమ్ముతరు?' అంటూ కేటీఆర్ నిలదీశారు. స్థానిక ఎమ్మెల్యేవైతే రైతులను ఒప్పించి మెప్పించి, వారి భయాలు, అనుమానాలను నివృత్తి చేసి భూములను తీసుకోవాలని సూచించారు. తమ పార్టీ నేత పట్నం నరేందర్‌రెడ్డి సహా బీఆర్‌ఎస్ కార్యకర్తలను, రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాలుష్య కారక పరిశ్రమ ఏది పెట్టినా ప్రజాభిప్రాయ సేకరణ తర్వాతే పెట్టాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎంలు మహమూద్ అలీ, టీ రాజయ్య, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, గువ్వల బాలరాజు, పీ విష్ణువర్ధన్ రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు పీ కార్తీక్‌రెడ్డి, గజ్జెల నగేశ్, దాసోజు శ్రవణ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, తుంగ బాలు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం 48 గంటల దీక్ష

బతుకమ్మ నుంచి దసరా వరకు గాంధీనాయక్ నిరసన

జనగామ, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ) : రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 48 గంటల ఉపవాస దీక్షకు తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ (జీసీసీ) మాజీ చైర్మన్, బంజారా కీర్తిరత్న అవార్డు గ్రహీత, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అభిమాన్ గాంధీనాయక్ సిద్ధమయ్యారు. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రూ. 2 లక్షల వరకు రుణమాఫీలో కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ వినూత్నరీతిలో పండుగ పూట దీక్ష చేయబోతున్నట్టు ప్రకటించారు. సద్దుల బతుకమ్మ రోజు (గురువారం) ఉదయం 10 నుంచి దసరా పండుగ 12వ తేదీ ఉదయం 10 వరకు 48 గంటలపాటు పాలకుర్తి నియోజకవర్గంలోని కొడకండ్ల మండలం గిర్ని తండాలోని తన నివాసంలో ఉపవాస దీక్ష చేస్తానని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం పూర్తిస్థాయిలో రుణ మాఫీ చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 9న రాష్ట్రంలోని రైతులందరికీ రూ. 2 లక్షల వరకు ఉన్న రుణాన్ని మాఫీ చేస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పిన రేవంత్ రెడ్డి కేవలం 40 శాతం మందికే అమలు చేశారని మండిపడ్డారు.




గాంధీనాయక్, మాజీ జీసీసీ చైర్మన్

అనుముల తహసీల్దార్ అరెస్ట్

- హుజూర్‌నగర్‌లో రైతుబంధు సొమ్ము స్వాహా

హుజూర్‌నగర్, అక్టోబర్ 9: గతంలో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా పనిచేసి రైతుబంధు పేరుతో భారీ కుంభకోణానికి పాల్పడిన వజ్రాల జయశ్రీని పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె అనుముల తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ రెవెన్యూ పరిధిలోని 36.23 ఎకరాల భూమికి పాసు పుస్తకాలను సృష్టించి ధరణి ఆపరేటర్ జగదీశ్ సాయంతో రూ.14,63,004 లక్షల రైతుబంధు నిధులను అప్పటి తహసీల్దార్ జయశ్రీ కాజేశారు. 2019లో ఆపరేటర్ జగదీశ్ బంధువుల పేరిట తహసీల్దార్ పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేశారు. తద్వారా వచ్చిన రైతుబంధు నిధులను తహసీల్దార్, ఆపరేటర్ జగదీశ్ చెరి సగం పంచుకున్నట్టు పోలీసులు విచారణలో తేలింది. ఈ విషయం ఇటీవల వెలుగు చూడగా ధరణి ఆపరేటర్‌ను మూడు నెలల క్రితమే విధుల నుంచి తొలగించారు. బుధవారం తహసీల్దార్‌ను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా జూనియర్ సివిల్ జడ్జి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.



తహసీల్దార్ జయశ్రీ

ప్రొటీన్లపై పరిశోధనలకు నోబెల్

రసాయన శాస్త్రంలో ముగ్గురికి పురస్కారం

డేవిడ్ బేకర్, జాన్ జంపర్, డెమిస్ హస్సబిస్‌కు అవార్డు


డేవిడ్ బేకర్ | జాన్ జంపర్ | డెమిస్ హస్సబిస్

స్టాక్‌హోమ్, అక్టోబర్ 9: ప్రొటీన్లపై జరిపిన పరిశోధనలకు గానూ రసాయన శాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ పురస్కారం దక్కింది. డేవిడ్ బేకర్, డెమిస్ హస్సబిస్, జాన్ జంపర్‌కు ఈ ఏడాది అవార్డుకు ఎంపిక చేసినట్టు నోబెల్ కమిటీ ఫర్ కెమిస్ట్రీ చైర్మన్ హైనెర్ లింకె బుధవారం ప్రకటించారు. డేవిడ్ బేకర్ ప్రస్తుతం వాషింగ్టన్ యూనివర్సిటీలో పని చేస్తుండగా డెమిస్ హస్సబిస్, జాన్ జంపర్ లండన్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రిసెర్చ్ ల్యాబొరేటరీ అయిన గూగుల్ డీప్‌మైండ్‌లో పని చేస్తున్నారు. 2003లో బేకర్ ఒక ఊహాత్మక ప్రొటీన్‌ను తయారుచేశారని, ఈ సాంకేతికతతో సృష్టించిన ప్రొటీన్లను ఔషధాలు, వ్యాక్సిన్లు, నానోమెటీరియల్స్, సూక్ష్మ సెన్సార్లలో వాడుతున్నట్టు నోబెల్ కమిటీ తెలిపింది. 20 కోట్ల ప్రొటీన్ల నిర్మాణ శైలిని గుర్తించేలా హస్సబిస్, జంపర్ ఒక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నమూనాను తయారు చేసినట్టు పేర్కొన్నది.

జీవాన్ని అర్థం చేసుకోవడంలో కీలకం

జీవం ఎలా పని చేస్తుందో అర్థం చేసుకోవాలంటే, ముందుగా ప్రొటీన్ల రూపాన్ని అర్థం చేసుకోవాలని, ఇందుకు వీరి ఆవిష్కరణలు ఉపయోగపడుతున్నాయని హైనెర్ లింకె పేర్కొన్నారు. అమినో యాసిడ్ సీక్వెన్స్, ప్రొటీన్ స్ట్రక్చర్‌కు మధ్య సంబంధాన్ని గుర్తించిన వీరి పరిశోధనలకు నోబెల్‌తో గౌరవిస్తున్నట్టు ప్రకటించారు. దశాబ్దాలుగా రసాయన శాస్త్రానికి, ప్రత్యేకించి జీవ రసాయనశాస్త్రానికి సవాల్‌గా మారిన అంశానికి వీరి పరిశోధన పరిష్కారం చూపిందని ఆయన చెప్పారు. కాగా, నోబెల్ బహుమతి కింద దక్కే రూ.8.4 కోట్లలో బేకర్‌కు సగం దక్కుతుందని, మిగతా సగం హస్సబిస్, జంపర్‌కు కలిపి ఇవ్వనున్నట్టు నోబెల్ కమిటీ తెలిపింది.

బియ్యం ధరలు పైపైకి

- **ఎగుమతులపై ఆంక్షల తొలగింపు**
- **అంతర్జాతీయంగా డిమాండ్**
- **దేశంలో పెరుగుతున్న ధరలు**
- **వారంలోనే 15% పెరుగుదల**

న్యూఢిల్లీ: పండుగల వేళ దేశంలో బియ్యం ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఇప్పటికే కూరగాయలు, వంటనూనెలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్న పరిస్థితుల్లో బియ్యం ధరలు పెరుగుతుండటం ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. కేవలం వారం రోజుల్లో దేశంలో బియ్యం ధరలు దాదాపు 10-15 శాతం వరకు పెరిగాయి. బియ్యం ఎగుమతులపై ఆంక్షలను తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెప్తున్నారు. ప్రపంచ బియ్యం మార్కెట్‌లో భారత్ వాటా 45 శాతం వరకు ఉంటుంది. భారత్ నుంచి ప్రధానంగా ఇరాన్, సౌదీ అరేబియా, చైనా, యూఏఈ, ఆఫ్రికా దేశాలకు బియ్యం ఎగుమతి అవుతుంది. అయితే, బాస్మతీయేతర బియ్యంపై ఎగుమతులపై కేంద్రం గత ఏడాది ఆంక్షలు విధించడంతో పాటు పారాబాయిల్డ్ బియ్యంపై సుంకాన్ని 20 శాతానికి పెంచింది. బాస్మతియేతర బియ్యం ఎగుమతులపై ఆంక్షలను తొలగించడంతో పాటు పారాబాయిల్డ్ బియ్యంపై సుంకాన్ని 10 శాతానికి తగ్గిస్తూ సెప్టెంబర్ 28న కేంద్రం నిర్ణయం తీసుకుంది.

పెరుగుతున్న ఎగుమతులతోనే ధరల పెరుగుదల

కేంద్రం నిర్ణయంతో భారత్ నుంచి విదేశాలకు బియ్యం ఎగుమతులు జోరందుకున్నాయి. దీంతో దేశంలో వారం వ్యవధిలోనే బియ్యం ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఆఫ్రికాకు ఎక్కువగా ఎగుమతయ్యే స్వర్ణ రకం బియ్యం ఇంతకు ముందు రూ.35 కిలో ఉండగా ఇప్పుడు రూ.41కి పెరిగింది. బాస్మతి బియ్యం మినహా మిగతా అన్ని రకాల బియ్యం ధరలు 10-15 శాతం పెరిగాయని బియ్యం ఎగుమతిదారులు చెప్తున్నారు.

రతన్ టాటా అస్తమయం

- అనారోగ్యంతో కన్నుమూసిన పారిశ్రామిక దిగ్గజం
- 86 ఏండ్ల వయసులో తుదిశ్వాస వదిలిన దాతృశీలి
- సంతాపం తెలిపిన రాజకీయ, వ్యాపార ప్రముఖులు

ముంబై, అక్టోబర్ 9: వ్యాపార దిగ్గజం, టాటా సన్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటా(86) కన్నుమూశారు. బీపీ లెవెల్స్ పడిపోవడంతో సోమవారం ఆయనను ముంబైలోని బ్రీచ్ కాండీ హాస్పిటల్‌లో చేర్పించారు. వృద్ధాప్య సమస్యలతో ఐసీయూలో చికిత్స పొందుతున్న ఆయన బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. తన ఆరోగ్యం బాగానే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సోమవారం రతన్ టాటా సోషల్ మీడియా ద్వారా తెలియజేశారు. రెండు రోజుల్లోనే ఆయన ఆరోగ్యం క్షీణించడంతో తుదిశ్వాస విడిచారు. రతన్ టాటా మృతి చెందిన విషయాన్ని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ప్రకటించారు. తన స్నేహితుడు, మార్గదర్శిని కోల్పోయినట్టు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20 ఏండ్ల పాటు టాటా సంస్థలను రతన్ టాటా విజయవంతంగా నడిపించారు. వ్యాపారానికి మించి దాతృత్వానికి మారుపేరుగా ఆయన నిలిచారు. అనేక పరిశ్రమలు కలిగిన టాటా గ్రూప్‌నకు చైర్మన్‌గా రతన్ టాటా 1991లో బాధ్యతలు స్వీకరించి 2012వరకు కొనసాగారు. టాటా సన్స్ చైర్మన్ బాధ్యతల నుంచి ఆయన తప్పుకున్నప్పటికీ సేవా సంస్థ అయిన టాటా ట్రస్ట్స్‌కు చైర్మన్‌గా కొనసాగుతున్నారు. 2000లో రతన్ టాటాకు పద్మభూషణ్, 2008లో పద్మ విభూషణ్ పురస్కారాలు దక్కాయి.

విచారం వ్యక్తం చేసిన ప్రముఖులు

రతన్ టాటా మృతికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. రతన్ టాటా దూరదృష్టి కలిగిన వ్యాపార నాయకుడని, దయాగుణం కలిగిన అసాధారణ మనిషి అని ప్రధాని 'ఎక్స్'లో కొనియాడారు. రతన్ టాటా వ్యాపారంతో పాటు దాతృత్వంలోనూ తనదైన ముద్ర వేసుకున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భారతీయ ఆర్థిక, వ్యాపార, పరిశ్రమల్లో రతన్ టాటా అనేక సేవలు అందించారని, భారతీయ పరిశ్రమల్లో ఆయన టైటాన్ అని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. రతన్ టాటా మృతి పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. రతన్ టాటా మృతిని జీర్ణించుకోలేకపోతున్నట్టు ఆనంద్ మహీంద్ర పేర్కొన్నారు.

యుద్ధం కారణంగా ప్రేమ దూరం

1937లో రతన్ టాటా జన్మించారు. 1948లో ఆయన తల్లిదండ్రులు వేరుపడటంతో నానమ్మ నవజ్‌బాయ్ టాటా వద్ద రతన్ టాటా పెరిగారు. కార్నెల్ యూనివర్సిటీ నుంచి ఆర్కిటెక్చర్‌లో పట్టభద్రుడైన తర్వాత ఆయన హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేశారు. రతన్ టాటా అవివాహితుడు. అయితే, లాస్ ఏంజెల్స్‌లో ఉన్నప్పుడు ఆయన ఒక అమ్మాయితో ప్రేమలో పడ్డారు. అప్పుడు 1962 ఇండియా – చైనా యుద్ధం జరుగుతుండటంతో అమ్మాయిని రతన్ టాటాతో పాటు భారత్‌కు పంపేందుకు తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో ఆయన ప్రేమకు దూరమయ్యారు.

పేరు: రతన్ టాటా
జననం: 1937 డిసెంబర్ 28
మరణం: 2024 అక్టోబర్ 9
విద్యార్హతలు: ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ
టాటా గ్రూప్ అధినేతగా: 1991-2012, 2016-2017
అవార్డులు: పద్మభూషణ్, పద్మవిభూషణ్, మహారాష్ట్ర భూషణ్, అస్సాం బైభవ్, ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా, హానరరీ నైట్ గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్

టాటా జీవితంలో మైలురాళ్లు

- 1961: ఐబీఎంలో అవకాశాన్ని వదులుకుని టాటా స్టీల్‌లో బ్లాస్ట్ ఫర్నేస్ నిర్వహణ మొదలు
- 1981: టాటా ఇండస్ట్రీస్ చైర్మన్‌గా బాధ్యతలు
- 1983: దేశీయ ఉప్పు తయారీలో విప్లవాత్మకంగా తొలిసారి అయోడైజ్డ్ ఉప్పు తయారీ
- 1986: ఎయిర్ ఇండియా చైర్మన్‌గా ఎన్నిక
- 1991: టాటా గ్రూప్ చైర్మన్‌గా ఎంపిక
- 1999: ఫోర్డ్ మోటర్స్‌కు టాటా మోటర్స్ అమ్మకం తిరస్కరణ
- 2000: పద్మభూషణ్ అవార్డును అందుకున్న రతన్ టాటా. టెట్లీ గ్రూప్‌ను సొంతం చేసుకున్న టాటా టీ. ప్రపంచంలోనే ఇది రెండో అతిపెద్ద టీ బ్రాండ్
- 2004: పబ్లిక్ లిస్టెడ్ కంపెనీగా టీసీఎస్. 1 బిలియన్ డాలర్ల రెవెన్యూను దాటిన తొలి భారతీయ ఐటీ సంస్థగా రికార్డు
- 2006: టాటా స్కైతో డీటీహెచ్ వ్యాపారంలోకి
- 2008: దివాలా నుంచి ఫోర్డ్ మోటర్స్‌ను కాపాడిన టాటా. జాగ్వార్-లాండ్‌రోవర్‌ను చేజిక్కించుకున్న టాటా మోటర్స్. పద్మవిభూషణ్ అవార్డు స్వీకారం
- 2009: దేశంలోనే చౌక కారు టాటా నానో ఆవిష్కరణ. లక్ష రూపాయల ధరతో సామాన్యుడి కారుగా ప్రఖ్యాతి
- 2010: హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌కు 50 మిలియన్ డాలర్ల విరాళం. ఓ హాల్‌కు టాటా పేరు
- 2012: టాటా గ్రూప్ చైర్మన్ పదవీ విరమణ. చైర్మన్ ఎమిరేట్స్‌గా కొనసాగిన రతన్ టాటా.
- 2014: ఐఐటీ బాంబే చరిత్రలోనే అతిపెద్ద విరాళం. దాని ఆర్‌అండ్‌డీ సెంటర్‌కు రూ.95 కోట్ల డొనేషన్
- 2022: 69 ఏండ్ల తర్వాత టాటా గ్రూప్‌లోకి మళ్లీ ఎయిర్ ఇండియా రాక





వినయం నిండిన దిగ్గజం: కేటీఆర్

రతన్ టాటా నిజమైన ఆవిష్కర్త అని, అద్భుతమైన మానిషి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. అనేకమందికి ఆయన ప్రేరణగా నిలిచారని, ఆయన వినయం నిండిన దిగ్గజం అని అన్నారు. టీహబ్‌ను చూసిన ప్రతిసారీ రతన్ టాటాను గుర్తు చేసుకుంటామని, ఆయన అందరి హృదయాల్లో నిలిచి ఉంటారని అన్నారు.

హర్యానాలో ఈవీఎంల హ్యాక్

ఈసీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ ఆరోపణలను తోసిపుచ్చిన ఈసీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 9: హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని, దీనిపై దర్యాప్తు జరపాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. హర్యానా ఎన్నికల్లో ఈవీఎంల హ్యాకింగ్ జరిగిందని ఆరోపించింది. ఓట్ల లెక్కింపు సందర్భంగా కొన్ని ఈవీఎంలలో కొన్ని వ్యత్యాసాలు కనుగొన్నామని, అలాంటి ఈవీఎంలను తక్షణం సీల్ చేసి, వాటిని భద్రపర్చి విచారణకు ఆదేశించాలని కాంగ్రెస్ కోరింది. లెక్కింపు సందర్భంగా ఈవీఎంల బ్యాటరీ 99 శాతం సామర్థ్యంతో ఉండాలని, అయితే చాలా ఈవీఎంలలో 60 నుంచి 70 శాతం బ్యాటరీ సామర్థ్యంతో మాత్రమే పనిచేశాయని కాంగ్రెస్ నేతలు తెలిపారు. కాగా, ఈవీఎంలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణలను ఎన్నికల సంఘం ఖండించింది. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు లేఖ రాసింది.



ఓడినప్పుడు మాత్రమే ఈవీఎం రాగం

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): హర్యానాలో అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతను కాంగ్రెస్ పార్టీ సద్వినియోగం చేసుకోలేదని, ఆ పార్టీ అంతర్గత విభేదాలే బీజేపీ గెలుపునకు కారణమైనట్టు హైదరాబాద్ పార్లమెంటు సభ్యుడు, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. ఓటమి తర్వాత కాంగ్రెస్ పార్టీ ఈవీఎంలను నిందించడంపై ఆయన విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎంలలో తప్పులను ఎత్తి చూపుతుందని, ఈవీఎంలను నిందించడం చాలా సులభమైందన్నారు. ఎన్నికల పోరులో ఏ మాత్రం అవకాశం వచ్చినా దాన్ని బీజేపీ సద్వినియోగం చేసుకుంటుందని 2024 పార్లమెంటు ఎన్నికల తర్వాత తెలిసిందని, అయితే కాంగ్రెస్ మాత్రం ఆ పార్టీని ఓడించడానికి సువర్ణావకాశం వచ్చినా, దాన్ని సద్వినియోగం చేసుకోలేక పోయిందని విమర్శించారు.

కాంగ్రెస్‌ది అతివిశ్వాసం, అహంకారం

- హర్యానాలో ఆ పార్టీ ఓటమికి కారణాలివే
- దుమ్మెత్తిపోస్తున్న ఇండియా కూటమి పార్టీలు
- ఢిల్లీలో ఒంటరిగా పోటీ చేస్తామన్న ఆప్
- యూపీ ఉప ఎన్నికల్లో ఎస్పీ ఒంటరి పోరు!

న్యూఢిల్లీ, అక్టోబర్ 9: గెలుపు ఖాయమనుకున్న హర్యానాలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడం ఇండియా కూటమిలో చిచ్చు పెట్టింది. ఆ పార్టీ అహంకారం, అతి విశ్వాసం వల్లే ఓడిపోయిందని మిత్రపక్షాలే దుమ్మెత్తిపోస్తున్నాయి. ప్రాంతీయ పార్టీలను కాంగ్రెస్ వాడుకుంటున్నదని ఆరోపిస్తున్నాయి. హర్యానా ఫలితాల ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికలపైనా పడబోతున్నట్టు కనిపిస్తున్నది. ఇండియా కూటమి విచ్ఛిన్నమయ్యేలా పరిణామాలు మారుతున్నాయి. తమ బలం కాంగ్రెస్‌కు ఉపయోగపడుతుంది కానీ కాంగ్రెస్ వల్ల తమకేమీ లాభం లేదని ఇండియా కూటమి పార్టీలు భావిస్తున్నాయి. త్వరలో జరగనున్న పలు రాష్ర్టాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను దూరం పెట్టాలని పలు పార్టీలు నిర్ణయానికి వచ్చాయి.

ప్రాంతీయ పార్టీలపై కాంగ్రెస్‌కు చిన్నచూపు

హర్యానాలో ఓటమితో కాంగ్రెస్ తీరుపై ఇండియా కూటమిలోని తృణమూల్ కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. 'కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందనుకున్న చోట ప్రాంతీయ పార్టీలను కలుపుకోదు. ఆ పార్టీ బలంగా లేని రాష్ర్టాల్లో మాత్రం ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌ను కలుపుకోవాలనే అహంకారం, హక్కుగా భావించడం, ప్రాంతీయ పార్టీలను చిన్నచూపు చూడటమే ఈ పరాభవానికి కారణం' అని తృణమూల్ ఎంపీ సాకేత్ గోఖలే తీవ్రస్థాయిలో విమర్శించారు. మిత్రపక్షాలను కలుపుకుపోవడంలో కాంగ్రెస్ విఫలమైందని, స్థానిక నేతలను అవిధేయతను అదుపు చేయలేకపోయిందని శివసేన(ఉద్ధవ్ వర్గం) విమర్శించింది. గెలవాల్సిన ఆటలోనూ ఓడిపోయే సామర్థ్యం కాంగ్రెస్‌కు ఉందని ఎద్దేవా చేసింది. కూటమిలో పెద్దన్నగా ఏ పార్టీ భావించొద్దని కాంగ్రెస్‌ను ఉద్దేశించి శివసేన(ఉద్ధవ్) నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలని, పొత్తు సూత్రాలను, ప్రాంతీయ పార్టీలను గౌరవించాలని ఆర్జేడీ స్పష్టంచేసింది.

ఆప్ బాటలోనే సమాజ్‌వాదీ పార్టీ!

సమాజ్‌వాదీ పార్టీ కూడా కాంగ్రెస్‌కు దూరమవుతున్నది. ఉత్తరప్రదేశ్‌లో త్వరలో 10 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. పొత్తులో భాగంగా తమకు ఐదు స్థానాలు కేటాయించాలని కాంగ్రెస్ కోరుతున్నది. అయితే, సమాజ్‌వాదీ పార్టీ మాత్రం 2-3 సీట్లకు మించి ఇవ్వొద్దని భావిస్తున్నది. కాంగ్రెస్‌కు సంబంధం లేకుండానే ఆరు స్థానాలకు అభ్యర్థులను కూడా ప్రకటించింది.



కాంగ్రెస్‌కు ఆమ్ ఆద్మీ గుడ్‌బై

కాంగ్రెస్‌తో తెగదెంపులు చేసుకోవాలని ఆప్ నిర్ణయించింది. త్వరలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తామని ఆ పార్టీ ప్రకటించింది. అతివిశ్వాసం కలిగిన కాంగ్రెస్‌పై, అహంకార బీజేపీపై ఒంటరిగా పోటీ చేసే సామర్థ్యం తమ పార్టీకి ఉందని ఆప్ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ ప్రకటించారు. గత పదేండ్లుగా ఢిల్లీలో కాంగ్రెస్‌కు ఒక్క అసెంబ్లీ సీటు లేకపోయినప్పటికీ తాము లోక్‌సభ ఎన్నికల్లో మూడు సీట్లు ఇచ్చామని, అయినా హర్యానాలో ఆ పార్టీ మిత్రపక్షాలను కలుపుకోలేదని ఆమె ఆరోపించారు.

ఢిల్లీ ముఖ్యమంత్రి నివాసం బలవంతంగా ఖాళీ

- **ఆతిశీ లగేజీని బయటకు విసిరేశారని ఆప్ ఆగ్రహం**
- **ముఖ్యమంత్రిని ఖాళీ చేయించడమేంటని ధ్వజం**

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య మరో వివాదం రేగింది. అధికారికంగా కేటాయించకుండానే సీఎం ఆతిశీ సీఎం బంగ్లాను అనధికారికంగా ఆక్రమించారన్న ఆరోపణలతో రెండు రోజుల క్రితం దిగిన ఆమెను ఎల్జీ ఆదేశాలతో బలవంతంగా ఖాళీ చేయించారు. ఆమెకు సంబంధించిన సామాన్లను అక్కడి నుంచి తరలించారు. ఎల్జీ చర్యపై ఆప్ తీవ్రంగా మండిపడింది. ఇది చాలా అగౌరవ చర్య అని, దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రికీ ఇలాంటి అవమానం జరగలేదని విమర్శించింది. రెండు రోజుల క్రితమే అధికారిక నివాసంలో దిగిన ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీని ఇంటి నుంచి గెంటేశారని అధికార ఆప్ బుధవారం ఆరోపించింది. దీనిపై ఎల్జీ కార్యాలయం వివరణ ఇస్తూ అది సీఎం నివాసం కాదని, దానిని ఎవరికైనా కేటాయించవచ్చునని తెలిపింది. అధికారికంగా ఆ మెకు ఆ నివాసం కేటాయించకపోయినా నిబంధనలను అతిక్రమించి దానిని ఆక్రమించుకున్నారని పేర్కొంది.

కేటాయించకున్నా ఎలా దిగుతారు?

ఉత్తర ఢిల్లీ సివిల్ లైన్స్‌లోని 6 నంబర్ ఫ్లాగ్ స్టాఫ్ రోడ్‌లో మాజీ సీఎం కేజ్రీవాల్ తొమ్మిదేండ్లుగా నివసిస్తున్న గృహాన్ని ఖాళీ చేయడంతో కొత్త సీఎం ఆతిశీ అందులో సోమవారం దిగారు. అయితే బంగ్లాను పీడబ్ల్యూడీ శాఖ ఇంకా ఎవరికీ కేటాయించ లేదని బీజేపీ ఆరోపించింది. ఆ నివాసంలోకి ఆమె ఎలా దిగుతారని ప్రశ్నించింది. కేజ్రీవాల్ ఈ బంగ్లాను ఖాళీ చేసినట్టు డాక్యుమెంట్ రుజువు ఉన్నప్పటికీ ఈ అంశంపై బీజేపీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నదని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ విమర్శించారు. బీజేపీ దొడ్డిదారిలో బంగ్లాను ఆక్రమించుకోవడానికి ప్రయ త్నం చేస్తున్నదని, దానికి ఒక బీజేపీ నేతకు కేటాయించడానికి ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు.

బీజేపీని ఆదుకున్న ఆరెస్సెస్

హర్యానాలో కమలం పార్టీ గెలుపు వెనుక సంఘ్

చండీగఢ్: హర్యానాలో ఓటమి తప్పదనుకున్న బీజేపీ అనూహ్యంగా విజయం సాధించింది. అయితే, ఈ విజయంలో ఆరెస్సెస్ కీలకపాత్ర పోషించినట్టు తెలుస్తున్నది. 2020-21 రైతుల ఉద్యమం, మనోహర్‌లాల్ ఖట్టర్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతను ఆరెస్సెస్ ముందుగానే గుర్తించి బీజేపీని అప్రమత్తం చేసింది. ఖట్టర్‌ను మార్చాలని సైతం ఆరెస్సెస్ సిఫార్సు చేసినట్టు సమాచారం. దీంతో పాటు గ్రామీణ ఓటర్ల విశ్వాసాన్ని మళ్లీ నిర్మించుకునేందుకు సహకరించాల్సిందిగా ఆరెస్సెస్‌ను బీజేపీ కోరింది. దీంతో ప్రతి జిల్లాకు 150 మంది చొప్పున ఆరెస్సెస్ వలంటీర్లు క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగారు. దాదాపుగా 16 వేల సమావేశాలను నిర్వహించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి అభిప్రాయాన్ని మార్చుకునేలా ప్రచారం చేశారు. ఇది బీజేపీ గెలుపునకు దోహదపడింది.

'వాల్మీకి' మాస్టర్‌మైండ్ నాగేంద్ర

- కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రే ప్రధాన సూత్రధారి
- మరో 24 మందికి కూడా ఈ స్కామ్‌లో భాగస్వామ్యం
- ఈడీ వెల్లడి.. పీఎంఎల్‌ఏ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు
- హైదరాబాద్‌కు పాకిన 'వాల్మీకి' కార్పొరేషన్ స్కామ్
- కర్ణాటక నుంచి తెలంగాణకు పెద్దయెత్తున నగదు బదిలీ
- లోక్‌సభ ఎన్నికలకు ముందు రూ.45 కోట్లు ట్రాన్స్‌ఫర్
- హైదరాబాద్‌కి చెందిన 9 కంపెనీల ఖాతాలకు సొమ్ము

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో వెలుగుచూసిన 'వాల్మీకి' కుంభకోణం వెనుక అసలు మాస్టర్‌మైండ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే, షెడ్యూల్డ్ ట్రైబ్ శాఖ మాజీ మంత్రి బీ నాగేంద్రేనని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం వెల్లడించింది. బెంగళూరులోని పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టులో ఈ మేరకు ఇటీవలే ఛార్జిషీట్ దాఖలు చేసినట్టు గుర్తు చేసింది. రూ. 187 కోట్ల విలువైన ఈ స్కామ్‌లో నాగేంద్రతో పాటు మరో 24 మంది పాలు పంచుకొన్నారని తెలిపింది. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి, మధ్యవర్తి సత్యనారాయణ వర్మ, ఫస్ట్ ఫైనాన్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ ఏటకారి సత్యనారాయణ, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జేజీ పద్మనాభ, అధికారులు నాగేశ్వరరావు, నెక్కంటి నాగరాజు, విజయ్‌కుమార్ గౌడ తదితరులు ఈ జాబితాలో ఉన్నట్టు పేర్కొంది. నాగేంద్ర కనుసన్నల్లోనే వాల్మీకి కార్పొరేషన్ నుంచి రూ. 187 కోట్లు పక్కదారిపట్టినట్టు వివరించింది. ఇందులో రూ. 20.19 కోట్లను ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బళ్లారి నియోజకవర్గంలో వినియోగించినట్టు తెలిపింది. అక్రమంగా తరలిన మరికొంత నగదు హైదరాబాద్‌కు చేరినట్టు వివరించింది. ఈ స్కామ్‌కు సంబంధించి బుధవారం ఈడీ ప్రాసిక్యూషన్ కంప్లైంట్ దాఖలు చేసింది.

ఏమిటీ స్కామ్?

'కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్'కు చెందిన పలు బ్యాంకు ఖాతాల్లో ఉండాల్సిన రూ. 187 కోట్లు పక్కదారిపట్టాయి. దీన్నే 'వాల్మీకి కార్పొరేషన్' స్కామ్‌గా పిలుస్తున్నారు. నిజానికి ఈ స్కామ్ జరిగినట్టు ఎవరికీ తెలియదు. అయితే, వాల్మీకి కార్పొరేషన్ అకౌంట్స్ సూపరింటెండెంట్ పీ చంద్రశేఖరన్ గత మే 26న ఆత్మహత్య చేసుకోవడంతో ఈ కుంభకోణం వెలుగు చూసింది. వాల్మీకి కార్పొరేషన్ నుంచి చట్ట విరుద్ధంగా పలు బ్యాంకు ఖాతాలకు రూ.187 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేశారని చంద్రశేఖరన్ తన ఆరు పేజీల సూసైడ్ నోటులో పేర్కొన్నారు. దీనిపై గిరిజన సంఘాలు, ప్రతిపక్షాలు అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలను ఎక్కుపెట్టాయి. ప్రత్యేక బృందంతో విచారణ చేయించాలని పట్టుబట్టాయి. సర్వత్రా ఒత్తిడి పెరుగడంతో సిద్ధరామయ్య ప్రభుత్వం.. ఈ కుంభకోణంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. అటు ఈడీ కూడా ఈ స్కామ్‌పై విచారణ ప్రారంభించింది.

విచారణ, అరెస్టులు ఇలా..

లోక్‌సభ ఎన్నికల్లో మద్యం, డబ్బు పంచడం కోసమే 'వాల్మీకి కార్పొరేషన్' నిధులను అక్రమంగా వాడుకొన్నట్టు ఈడీ, సిట్ విచారణలో ప్రాథమికంగా తేలింది. అయితే, నిధుల బదిలీని వాల్మీకి కార్పొరేషన్ సూపరింటెండెంట్ చంద్రశేఖరన్ తొలుత వ్యతిరేకించడంతో ఆయన్ని తప్పించినట్టు సమాచారం. దీంతో ఆయన గత మే 26న ఆత్మహత్య చేసుకొన్నారు. అయితే, తన మరణ వాంగ్మూలంలో స్కామ్‌కు సంబంధించిన కీలక వివరాలను బయటపెట్టారు. దీంతో విచారణ జరిపిన ఈడీ కుంభకోణంలో భాగమైన మాజీ మంత్రి నాగేంద్ర, వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ బసనగౌడ దద్దల్, మరో ఇద్దరు బ్యాంకు అధికారులు సహా 11 మందిని అరెస్ట్ చేసింది.


నాగేంద్ర

హైదరాబాద్‌కు నగదు బదిలీ ఇలా..

వాల్మీకి కార్పొరేషన్ నుంచి దారిమళ్లిన మొత్తం రూ. 187 కోట్లలో తెలుగు రాష్ర్టాలకు రూ. 90 కోట్లు చేరినట్టు సిట్ అంతర్గత నివేదికలో వెల్లడించింది. ఇందులో రూ. 44.6 కోట్లు హైదరాబాద్‌కు చెందిన తొమ్మిది కంపెనీల బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్టు వివరించింది. సిట్ నివేదిక ప్రకారం.. వాల్మీకి కార్పొరేషన్ ఎండీ, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న జేజీ పద్మనాభ్, సస్పెండైన అకౌంట్స్ అధికారి పరశురామ్ బెంగళూరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంజీ రోడ్డు బ్రాంచీలో మార్చి 30, 2024న రూ. 50 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ టర్మ్ డిపాజిట్‌పై అదే రోజు రూ. 45 కోట్ల మేర రుణానికి దరఖాస్తు చేశారు. ఇందులో నుంచి అదేరోజు హైదరాబాద్‌లోని ఆర్బీఎల్ బ్రాంచీకి చెందిన 9 బ్యాంకు ఖాతాలకు రూ. 44.6 కోట్లను బదిలీ చేశారు. ఈ మేరకు సిట్ నివేదిక వెల్లడించింది. హైదరాబాద్‌కు చేరిన రూ. 44.6 కోట్ల నగదుతో లోక్‌సభ ఎన్నికల ముందు పెద్దయెత్తున మద్యం, ఖరీదైన వాహనాలను కొనుగోలు చేసినట్టు ఈడీ అధికారులు పేర్కొన్నారు.

'వాల్మీకి' సిట్ విచారణ పక్కదారి?!

'వాల్మీకి స్కామ్' విచారణను ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ఉద్దేశపూర్వకంగా పక్కదారి పట్టిస్తున్నట్టు అర్థమవుతున్నది. సిట్ రెండో ఛార్జిషీట్‌లో కుంభకోణంలో ప్రధాన నిందితులైన మాజీ మంత్రి నాగేంద్ర, వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ బసనగౌడ దద్దల్, బ్యాంకు ప్రధానాధికారి పేర్లు కనిపించకపోవడం ఈ అనుమానాలకు తావిస్తున్నది. వాల్మీకి స్కామ్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) చీఫ్ మేనేజర్ సుచిస్మితా రావల్, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జేజీ పద్మనాభ, మాజీ అకౌంట్స్ అధికారి పరశురామ్ జీ దుర్గాన్నవార్ పాత్ర ఉన్నట్టు తన సూసైడ్‌నోట్‌లో చంద్రశేఖరన్ వెల్లడించారు. నాగేంద్ర, బసనగౌడ దద్దల్ కనుసన్నల్లోనే ఈ స్కామ్ జరిగినట్టు పేర్కొన్నారు. అయితే, తొలి ఛార్జిషీట్‌లో వీరి పేర్లను ప్రస్తావించిన సిట్.. శివమొగ్గ జిల్లా కోర్టుకు ఇటీవల సమర్పించిన రెండో ఛార్జిషీట్‌లో ప్రస్తావించకపోవడం గమనార్హం. జేజీ పద్మనాభ, పరశురామ్ జీ దుర్గాన్నవార్ పేర్లను మాత్రమే సిట్ ఈ ఛార్జిషీట్‌లో ప్రస్తావించి చేతులు దులుపుకొన్నది. దీంతో మాజీ మంత్రి నాగేంద్ర, కార్పొరేషన్ ఛైర్మన్‌తో పాటు ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలు ఉన్న యూబీఐ బ్యాంకు చీఫ్ మేనేజర్‌ను కాపాడటానికే సిద్ధరామయ్య ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసినట్టు ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

15న హ్యుందాయ్ ఐపీవో

రూ.27,870 కోట్లతో పబ్లిక్ ఇష్యూ • షేర్ ధరల శ్రేణి రూ.1,865-1,960

న్యూఢిల్లీ/ముంబై, అక్టోబర్ 9: హ్యుందాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్ భారీ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 15న ప్రారంభం కానున్నది. దేశ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా రూ.27,870 కోట్ల నిధుల సమీకరణే లక్ష్యంగా ఈ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) వస్తున్నది. షేర్ ధరల శ్రేణిని రూ.1,865-1960గా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లను ఆకట్టుకొనేందుకు సంస్థ రోడ్‌షో నిర్వహించింది. ఈ సందర్భంగా కంపెనీ సీవోవో తరుణ్ గార్గ్ మాట్లాడుతూ.. ప్రస్తుత పండుగ సీజన్‌లో కార్ల అమ్మకాలు బాగున్నాయన్నారు. అంతర్జాతీయ ప్రతికూలతల ప్రభావం ఏమీ లేదన్నారు. కాగా, యాంకర్ ఇన్వెస్టర్ల కోసం షేర్ల బిడ్డింగ్ 14నే మొదలవుతుంది. 17న ముగుస్తుంది. ఇక ఈ ఐపీవోతో ఇప్పటిదాకా భారీది గా పేరున్న ఎల్ఐసీ రూ.21,000 కోట్ల పబ్లిక్ ఇష్యూ రెండో స్థానంలోకి వెళ్లనున్నది.

త్వరలో క్రెటా ఈవీ

వచ్చే ఏడాది జనవరి-మార్చిలో నాలుగు విద్యుత్తు ఆధారిత వాహనాలను (ఈవీ) మార్కెట్‌కు హ్యుందాయ్ పరిచయం చేయనున్నది. ఆరంభ, గరిష్ఠ స్థాయి ధరల్లో వీటిని తీసుకురానున్నారు. ఇందులో అత్యంత ప్రజాదరణ పొందిన క్రెటా మాడల్ కూడా ఉన్నట్టు సంస్థ ఎండీ ఉన్సూ కిమ్ తెలిపారు.

థర్మల్ విద్యుదుత్పత్తి డౌన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 9: దేశంలో బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి (థర్మల్ పవర్) వరుసగా రెండో నెలా పడిపోయింది. తగ్గిన విద్యుత్తు వినియోగం, పెరిగిన సోలార్ విద్యుదుత్పత్తి కారణంగా సెప్టెంబర్‌లో థర్మల్ పవర్ ఉత్పాదకత తక్కువైందని గ్రిడ్ రెగ్యులేటర్ గణాంకాలు చెప్తున్నాయి. దేశీయంగా బొగ్గు, లిగ్నైట్ ఆధారిత ప్లాంట్లలో విద్యుదుత్పత్తి నిరుడుతో పోల్చితే గత నెల 5.8 శాతం క్షీణించినట్టు తేలింది. అంతకుముందు నెల ఆగస్టులోనూ 4.9 శాతం పతనమైనట్టు ప్రభుత్వ రంగ గ్రిడ్ ఇండియా లెక్కలు చూపుతున్నాయి.

తగ్గిన పసిడి, వెండి ధరలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 9: బంగారం, వెండి ధరలు వరుసగా రెండోరోజూ తగ్గుముఖం పట్టాయి. బుధవారం న్యూఢిల్లీలో 24 క్యారెట్ 10 గ్రాముల పుత్తడి విలువ రూ.600 దిగి రూ.77,700 వద్ద నిలిచింది. ఇక వెండి రేటు ఏకంగా కిలో రూ.2,800 పడి రూ.91,200 పలికింది. మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడమే ఇందుకు కారణమని వ్యాపార వర్గాలు చెప్తున్నాయి. కాగా, హైదరాబాద్‌లో 24 క్యారెట్ గోల్డ్ తులం రేటు రూ.760 క్షీణించి రూ.76,690గా ఉన్నది. 22 క్యారెట్ రూ.700 తగ్గి రూ.70,300గా నమోదైంది.

కఠిన ద్రవ్య వైఖరికి చెల్లు

ఇకపై 'న్యూట్రల్' పాలసీనే • తాజా ద్వైమాసిక ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ నిర్ణయం

ముమ్మందు వడ్డీరేట్ల తగ్గింపునకు సంకేతాలు • వరుసగా 10వసారీ రెపోరేటు యథాతథం



ముంబై, అక్టోబర్ 9: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇన్నాళ్లూ అవలంబించిన కఠిన ద్రవ్య విధానానికి స్వస్తి పలికింది. ఈ మేరకు బుధవారం ముగిసిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో నిర్ణయం తీసుకున్నది. ఇకపై 'న్యూట్రల్' పాలసీని అనుసరిస్తామని స్పష్టం చేసింది. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లు తగ్గుతాయన్న సంకేతాలను ఇచ్చింది. కాగా, ద్రవ్య విధానంపై ఆర్బీఐ వైఖరిని కఠినం నుంచి తటస్థానికి మార్చేందుకు కొత్త సభ్యులతో కొలువుదీరిన మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ)లోని అందరూ అంగీకరించారు. 2019 జూన్ నుంచి చూసినట్టైతే ఆర్బీఐ తటస్థ ద్రవ్య విధాన వైఖరిని తీసుకోవడం ఇదే తొలిసారి. ఈ విధానంలో ద్రవ్యోల్బణం, జీడీపీ డాటాల ఆధారంగా వడ్డీరేట్లను ఆర్బీఐ పెంచడం లేదా తగ్గించడం చేస్తుంది. ఆర్బీఐ ప్రధానంగా మూడు ద్రవ్య విధాన వైఖరిలను ప్రదర్శిస్తుంది. అందులో హాకిష్ పాలసీ ఒకటైతే, మరొకటి డోవిష్ పాలసీ. ఇంకొకటే న్యూట్రల్ పాలసీ. హాకిష్ పాలసీలో ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా వడ్డీరేట్లను అధిక స్థాయిల్లోనే ఉంచుతుంది. వడ్డీరేట్లను పెంచడం తప్ప తగ్గించదు. ఇక డోవిష్ పాలసీలో జీడీపీ వృద్ధికి పెద్దపీట వేస్తుంది. మార్కెట్‌లో ద్రవ్య సరఫరా పెరిగేలా, రుణ లభ్యతను పెంచేలా వడ్డీరేట్లను తగ్గిస్తూ ఉంటుంది. కాగా, తదుపరి ద్రవ్యసమీక్ష డిసెంబర్ 4-6.

6.5 శాతం వద్దే రెపోరేటు

రెపోరేటును ఈసారి ద్రవ్యసమీక్షలోనూ 6.5 శాతం వద్దే ఉంచుతూ ఆర్బీఐ నిర్ణయం తీసుకున్నది. ఆరుగురు సభ్యులున్న ఎంపీసీలో ఐదుగురు దీన్ని సమర్థించారు. ఇది 10వసారి కావడం గమనార్హం. గత ఏడాది ఫిబ్రవరిలో 6.25 శాతం నుంచి 6.5 శాతానికి మార్చింది. ఆ తర్వాతి నుంచి ఇది అక్కడే ఉన్నది. దీంతో ఆటో, గృహ, కార్పొరేట్, వ్యక్తిగత, ఇతరత్రా రుణాలపై వడ్డీరేట్లూ తగ్గడం లేదు. రెపోరేటు ఆధారంగానే బ్యాంకులు తమ రుణాలపై వడ్డీరేట్లను సవరిస్తాయి. దీంతో ఆర్బీఐ ఆ రేటును తగ్గిస్తే ఆయా రుణాలపై వడ్డీరేట్లూ తగ్గేందుకు ఆస్కారం ఉంటుంది. కరోనాతో పడకేసిన దేశ ఆర్థిక వ్యవస్థను బలపర్చేందుకు వడ్డీరేట్లను బాగా తగ్గించిన ఆర్బీఐ.. ఆ తర్వాత విజృంభించిన ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి పెంచింది. అయితే రాబోయే రోజుల్లో ఆహార ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతుందన్న ఆశలు, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతలు ద్రవ్య విధానం మారేందుకు దోహదం చేశాయి.

ఎన్బీఎఫ్‌సీలకు హెచ్చరిక

కొన్ని బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్బీఎఫ్‌సీ)ల్లోని ప్రమోటర్లు నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నారని, మానుకోకపోతే కఠిన చర్యలు తప్పవని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఈ సందర్భంగా హెచ్చరించారు. తమ సంస్థలను వేగంగా విస్తరించాలని, అభివృద్ధిపర్చాలని తప్పుడు దారుల్లో వెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా చేయడం వల్ల రిస్క్ పెరుగుతుందని సూచించారు.

రేట్ల తగ్గింపుపై ఇప్పుడే మాట్లాడలేం: దాస్



అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ద్రవ్యోల్బణాన్ని ఎగదోసేలా ఉన్నాయని, కాబట్టి రాబోయే ద్రవ్యసమీక్షల్లో తప్పకుండా కీలక వడ్డీరేట్లు తగ్గుతాయని ఇప్పుడే చెప్పలేని పరిస్థితి అని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. సుదీర్ఘకాలంపాటు కఠిన ద్రవ్యవిధానాన్ని అవలంభించిన ఆర్బీఐ.. తాజా ద్వైమాసిక ద్రవ్యసమీక్షలో దాన్ని వీడుతున్నట్టు ప్రకటించింది. వడ్డీరేట్లపై నిర్ణయంలో ఇకపై 'న్యూట్రల్' పాలసీని అనుసరిస్తామని స్పష్టం చేసింది. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లు తగ్గుతాయన్న ఊహాగానాలు, అంచనాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే దాస్ పైవిధంగా స్పందించారు. పరిస్థితులనుబట్టి వడ్డీరేట్ల యథాతథ స్థితి, తగ్గింపులపై నిర్ణయాలుంటాయని తేల్చిచెప్పారు. అయితే ద్రవ్యోల్బణంపై పోరులో ఇప్పటిదాకా ఆర్బీఐ వైఖరి ఏనుగులా సాగిందని, ఇక నుంచి గుర్రం మాదిరి దూకుడుగా ఉంటుందని వ్యాఖ్యానించడం గమనార్హం. ఇదిలావుంటే అధిక వడ్డీరేట్లతో వృద్ధిరేటుకు వచ్చే ముప్పేమీ లేదని దాస్ అన్నారు. గత ఏడాదిన్నర కాలంగా దేశ ఆర్థిక వ్యవస్థలో కార్యకలాపాలు బాగానే సాగుతున్నాయని గుర్తుచేశారు. ఈ ఆర్థిక సంవత్సరం అక్టోబర్-మార్చిలో అంచనాలను మించి వృద్ధిరేటు నమోదవుతుందన్న ఆశాభావాన్ని కనబర్చారు.

> ఈసారి వడ్డీరేట్లను తగ్గిస్తే ఈ పండుగ సీజన్‌లో హౌజింగ్ డిమాండ్ పుంజుకొనేది. అటు రియల్ ఎస్టేట్ రంగంలో, ఇటు యావత్తు ఆర్థిక వ్యవస్థలో వృద్ధిరేటును పరుగులు పెట్టించే ఓ మంచి అవకాశాన్ని ఆర్బీఐ చేజార్చుకున్నది.
> **-బొమన్ ఇరానీ, క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు**

> వృద్ధిరేటు పెరుగుదలను, ద్రవ్యోల్బణం తగ్గుదలను ఆర్బీఐ పాలసీ నిర్ణయాలు ప్రతిబింబిస్తున్నాయి. ద్రవ్య విధాన వైఖరిని ఆర్బీఐ 'న్యూట్రల్'కు మార్చడం వల్ల రాబోయే ద్రవ్యసమీక్షల్లో రెపోరేటు తగ్గేందుకున్న అవకాశాలు పెరిగాయి. దీనివల్ల అన్నిరకాల రుణాలపై వడ్డీరేట్లు తగ్గుతాయి.
> **-బ్యాంకింగ్ సంస్థలు**

> ఆర్బీఐ కఠిన ద్రవ్య విధానాన్ని వీడటం ఆహ్వానించదగ్గ పరిణామం. ఇకనైనా వడ్డీరేట్లను తగ్గించి వృద్ధిరేటు పురోగతికి సహకారాన్ని అందించాలి. రాబోయే ద్రవ్యసమీక్షల్లో ఆ మేరకు నిర్ణయాలుంటాయని ఆశిస్తున్నాం.
> **-దీపక్ సూద్, అసోచామ్ ప్రధాన కార్యదర్శి**

డిజిటల్ లావాదేవీలకు కిక్కు

యూపీఐ లైట్ వ్యాలెట్, యూపీఐ123పే ట్రాన్జాక్షన్స్ పరిమితి పెంపు

ఆర్టీజీఎస్, నెఫ్ట్ సిస్టమ్స్‌ల్లో కొత్త ఫీచర్

దేశంలో డిజిటల్ చెల్లింపులను వీలైనంత ఎక్కువగా పెంచాలని చూస్తున్న ఆర్బీఐ.. తాజా ద్రవ్యసమీక్షలో ఆ మేరకు మరిన్ని కీలక నిర్ణయాలను తీసుకున్నది. ఇందులో భాగంగానే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లైట్ వ్యాలెట్‌కున్న పరిమితిని రూ.5,000కు పెంచింది. ప్రస్తుతం ఇది రూ.2,000గానే ఉన్నది. అలాగే ఒక్కో లావాదేవీకున్న పరిమితిని కూడా రూ.1,000కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ఇప్పుడిది రూ.500లు మాత్రమే. ఇక యూపీఐ123పేలోనూ ఒక్కో లావాదేవీ పరిమితిని ప్రస్తుతమున్న రూ.5,000ల నుంచి రూ.10,000 పెంచుతున్నట్టు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలియజేశారు. స్మార్ట్ ఫోన్లను వినియోగించని ఫీచర్ ఫోన్ యూజర్ల కోసం 2022 మార్చిలో యూపీఐ123ని అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడీ సౌకర్యం 12 భాషల్లో అందుబాటులో ఉన్నది. ఇదిలావుంటే రియల్ టైమ్ గ్రాస్ సెటిల్మెంట్ సిస్టమ్ (ఆర్టీజీఎస్), నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్) సిస్టమ్స్‌లో బెనిఫీషియరీ అకౌంట్ పేరు కనిపించే వెసులుబాటును తెస్తున్నట్టు దాస్ వెల్లడించారు. వినియోగదారుల నుంచి పెద్ద ఎత్తున వస్తున్న విజ్ఞప్తుల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నారు.

మళ్లీ నష్టాల్లోకి స్టాక్ మార్కెట్లు

ముంబై, అక్టోబర్ 9: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం మళ్లీ నష్టాల్లోకే జారుకున్నాయి. ఉదయం ఆరంభంలో సూచీలు లాభాల్లో కదలాడినా.. చివరి గంటలో మదుపరులు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యారు. దీంతో వరుస నష్టాల నుంచి మంగళవారం తేరుకున్నాయనిపించినా.. తిరిగి పాత బాటనే పట్టాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 167.71 పాయింట్లు లేదా 0.21 శాతం పడిపోయి 81,467.10 వద్ద ముగిసింది. అయితే ఒకానొక దశలో 684.40 పాయింట్లు పుంజుకున్నది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 31.20 పాయింట్లు లేదా 0.12 శాతం కోల్పోయి 24,981.95 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలో మాత్రం 220.90 పాయింట్లు ఎగిసింది.

దేశీయంగా రెండు న్యూక్లియర్ సబ్ మెరైన్ల నిర్మాణం

అమెరికా నుంచి 31 ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలు: కేంద్ర క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: దేశీయంగా రెండు న్యూక్లియర్ సబ్‌మెరైన్ల తయారీకి కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. రూ.45 వేల కోట్ల వ్యయంతో ఈ రెండు న్యూక్లియర్ సబ్‌మెరైన్లను విశాఖలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో నిర్మించనున్నారు. ఎల్ అండ్ టీ వంటి ప్రైవేట్ సంస్థలు ఇందులో కీలక పాత్ర పోషించనున్నాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరోవైపు అమెరికా నుంచి 31 ప్రిడేటర్ డ్రోన్లను కొనుగోలు చేసేందుకూ కేంద్ర మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మరికొద్ది రోజుల్లోనే అమెరికా ప్రభుత్వంతో దీనిపై ఒప్పందం కుదుర్చుకోనున్నారు.

లేజర్ లైట్‌తో డ్రోన్ల కూల్చివేత

సరికొత్త రక్షణ వ్యవస్థను తయారుచేసిన ఇజ్రాయెల్

జెరూసలేం, అక్టోబర్ 9: అధునాతన ఆయుధాలకు పేరొందిన ఇజ్రాయెల్ సరికొత్త రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసింది. డ్రోన్ల దాడులు జరుగుతున్న వేళ లేజర్ లైట్‌తో డ్రోన్లను కూల్చగలిగే లైట్ బీమ్ లేజర్ ఇంటర్‌సెప్షన్ వ్యవస్థను తయారుచేసింది. త్వరలో దీనిని వాషింగ్టన్ డీసీలో ప్రదర్శించనుంది. ఇప్పటికే ఇజ్రాయెల్ ట్రోఫీ అనే యాంటీ ట్యాంక్ రక్షణ వ్యవస్థను వినియోగిస్తున్నది. దీనికే ఈ కొత్త వ్యవస్థను సైతం జత చేయనున్నది. ఇప్పటికే ఈ కొత్త వ్యవస్థ సామర్థ్యాలను ఇజ్రాయెల్ పరీక్షించింది. డ్రోన్లను కూల్చేయడంలో ఇది సమర్థంగా పని చేస్తున్నట్టు తెలుస్తున్నది. రాకెట్లు, దీర్ఘశ్రేణి క్షిపణులపై మాత్రం ఇది పని చేయదు. హమాస్, హెజ్బొల్లా వంటి మిలిటెంట్ సంస్థలతో పాటు ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ కొత్త వ్యవస్థ ఇజ్రాయెల్‌కు కీలకంగా మారనున్నది.

ఇరాన్‌పై మా దాడి భయంకరంగా ఉంటుంది: ఇజ్రాయెల్

హమాస్ అధినేత నస్రల్లాను హతమార్చినందుకు ప్రతీకారంగా గతం వారం ఇజ్రాయెల్‌పై ఇరాన్ రాకెట్లు, క్షిపణుల వర్షం కురిపించింది. అయితే దీనికి బదులు తీర్చుకుంటామని ఇజ్రాయెల్ ప్రకటించినా ఇప్పటివరకు ఎలాంటి ప్రతి దాడి చేయలేదు. దీనిపై ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి యోవ్ గాలెంట్ బుధవారం స్పందించారు. ఇరాన్‌పై తాము చేసే దాడి విధ్వంసకరంగా ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. మా దాడితో ఇరాన్ గందరగోళంలో పడుతుంది. అసలేం జరిగిందో, ఎలా జరిగిందో వారికి అర్థం కాదని అన్నారు. కాగా, ఇరాన్ అణు కేంద్రాలు లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడి జరపవచ్చునని ప్రచారం జరుగుతున్నది.

2028 వరకు ఉచిత బియ్యం

కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 9: ఉచిత బియ్యం పంపిణీపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన, ఇతర సంక్షేమ కార్యక్రమాల కింద ఉచితంగా సరఫరా చేస్తున్న బలవర్ధకమైన బియ్యం పథకాలను 2028 డిసెంబర్ వరకు కొనసాగించాలని కేంద్ర మంత్రివర్గం బుధవారం నిర్ణయించింది. పౌరుల్లో రక్తహీనత, సూక్ష్మ పోషక లోపాల నివారణకు సరఫరా చేయనున్న ఈ బియ్యం పథకానికి రూ.17,082 కోట్లను వెచ్చించనుంది. ఈ పథకానికి అయ్యే వ్యయాన్నంతా కేంద్రమే భరిస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు.



100 కొట్టు.. పొట్టేలు పట్టు!



- దసరా సందర్భంగా లక్కీ డ్రాలు
- రాష్ట్రవ్యాప్తంగా వినూత్న స్కీమ్‌లు

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ) : దసరా పండుగ వచ్చిందంటే ఆఫర్లు ప్రకటించని షాపులు ఉండవు. ఆన్‌లైన్ వ్యాపార వేదికలు మొదలు.. షాపింగ్ మాల్స్ వరకు ఆఫర్లు కోకొల్లలు ప్రకటించడం చూస్తుంటాం. కానీ, ఈ సారి విజయదశమికి గ్రామాల్లోనూ వినూత్న స్కీమ్‌లు పుట్టుకొచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా అనేక గ్రామాల్లో కొందరు యువకులు బృందాలుగా ఏర్పడి లాటరీ స్కీమ్‌లు ప్రవేశపెట్టారు. 'వంద కొట్టు.. పొట్టేలు పట్టు' అని కరపత్రికలతోపాటు వాట్సాప్‌లో జోరుగా ప్రచారం చేస్తున్నారు. పోతే వంద.. వస్తే పది వేల పొట్టేలు అని ప్రజలు కూడా స్కీమ్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఒక్కొక్కరి దగ్గర రూ.100 తీసుకొని, ఈ నెల 10న లక్కీడ్రా తీస్తామని చెప్తున్నారు. కొన్ని గ్రామాల్లో రూ.50 కొట్టు.. మేకను పట్టు అని తక్కువ మొత్తంతో ఎక్కువ మందిని ఆకర్షిస్తున్నారు.

10 మందికే బహుమతులు..

దసరా అంటేనే సుక్క, ముక్క. అందుకే నిర్వాహకులు గ్రామస్తులను ఆకర్షించేందుకు బహుతులుగా మేకపోతు, గొర్రెపొట్టేలు, ప్రీమియం మద్యం బాటిళ్లను బహుమతులుగా పెడుతున్నారు. ఈ స్కీమ్‌లో రూ.100 చొప్పున వెయ్యి మంది, రూ.50 చొప్పున రెండు వేల మంది చేరితే రూ.లక్ష అవుతాయి. బహుమతులకు రూ.50 వేలు పోగా, మరో రూ.50 వేలు నిర్వాహకులకు మిగులనున్నాయి. రెండు వారాల్లోనే 50 వేలు మిగులుతాయనే ఉద్దేశంతోనే నిర్వాహకులు ఈ ఆఫర్లు పెడుతున్నట్టు తెలిసింది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. ఈ లాటరీలో పది మందికి మాత్రమే బహుమతులు రానుండగా, మిగతా వారంతా నష్టపోవాల్సి ఉంటుంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం లాటరీ సిస్టమ్‌ను నిషేధించిందని పోలీసులు హెచ్చరిస్తున్నా.. మరోవైపు వీటిపై ప్రజలు ఆసక్తి కనబరుస్తుండడం గమనార్హం.

మంచిర్యాల జిల్లాలోని ఓ గ్రామంలో లాటరీ స్కీమ్ వివరాలు ఇలా..

కూపన్ ధర రూ.100

మొదటి బహుమతి :	ఫ్రిజ్
రెండో బహుమతి :	గొర్రెపొట్టేలు
మూడో బహుమతి :	మేకపోతు
నాలుగో బహుమతి :	జానీవాకర్ ఫుల్‌బాటిల్
ఐదో బహుమతి :	బ్లాక్‌డాగ్ ఫుల్‌బాటిల్
ఆరో బహుమతి:	100 పైపర్స్ ఫుల్‌బాటిల్
7వ బహుమతి:	కేఫ్ లైట్ కాటన్ బీర్లు
8వ బహుమతి :	నాటుకోడి పుంజు
9వ బహుమతి:	నాటుకోడి పెట్ట
10వ బహుమతి :	బాయిలర్ కోడి



బతుకమ్మ సంబురాల్లో గవర్నర్ దంపతులు, మహిళా మంత్రులు, సీఎస్

రాజ్‌భవన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సతీమణి సుధాదేవ్‌వర్మ, మహిళా మంత్రులు, సీఎస్

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ) : రాజ్‌భవన్‌లో బుధవారం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, తన సతీమణి సుధాదేవ్‌వర్మ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడులను నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం, గవర్నర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విదేశాల్లో బతుకమ్మ ఉత్సవాలు

తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (టీడీఎఫ్) కెనడా ఆధ్వర్యంలో తంగేడు సాంస్కృతిక సంస్థ బతుకమ్మ వేడుకలు నిర్వహించింది. కెనడాలో పుట్టిన పిల్లలకు తెలంగాణ సంస్కృతి ప్రాధాన్యత తెలియజేయాలన్న ఉద్దేశంతోనే ప్రతి ఏడాది బతుకమ్మ, బోనాలు, ఇతర పండుగలను నిర్వహిస్తున్నట్టు టీడీఎఫ్ తెలిపింది. కార్యక్రమంలో టీడీఎఫ్ బోర్డు ఆఫ్ ట్రస్టీ శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ ప్రమోద్ ధర్మపురి, వెంకటరమణా రెడ్డి పాల్గొన్నారు. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో మలేషియా తెలంగాణ సంఘం (మైతా) ఆధ్వర్యంలో 800 మంది ప్రవాస తెలంగాణ ఆడబిడ్డలు బతుకమ్మ పండుగను జరుపుకొన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ సైదం తిరుపతి, వైస్ ప్రెసిడెంట్ చిరుత చిట్టిబాబు, మహిళా ప్రెసిడెంట్ కిరణ్మయి, జనరల్ సెక్రటరీ సందీప్‌గౌడ్, జాయింట్ సెక్రటరీ సత్యనారాయణరావు, ట్రెజరర్ సందీప్ కుమార్, జాయింట్ ట్రెజరర్ సుందర్ రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ సంతోష్, వైస్ ప్రెసిడెంట్ శివతేజ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మారుతి, హరిప్రసాద్, రాములు, రమేశ్, మహేశ్, శ్రీహరి, జీవన్‌రెడ్డి, వినోద్, రఘుపాల్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన విలేకరులపై కేసు

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో ఘటన

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 9 : దసరా పండుగకు తమకు రూ.10 వేలు మామూళ్లు ఇవ్వాలని ఓ దవాఖాన యాజమాన్యాన్ని బెదిరించిన ఐదుగురు విలేకరులపై రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో కేసు నమోదైంది. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 8న శంకర్‌పల్లిలోని ఓ ప్రైవేట్ దవాఖానకు వెళ్లిన స్థానిక విలేకరులు రాజేశ్‌గౌడ్ (మనసాక్షి), సాయికిరణ్ రెడ్డి (నమస్తే జ్యోతి), ప్రతాప్ (జ్యోతి), సుధాకర్‌గౌడ్ (సూర్య వెలుగు), మల్లేశ్‌గౌడ్ (నేటి ప్రస్థానం) దసరా పండుగ మామూళ్లు రూ.10 వేలు ఇవ్వాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. దవాఖాన యాజమాన్యం తిరస్కరించడంతో వారు బెదిరింపులకు గురిచేశారు. దవాఖాన యాజమాన్యం ఫిర్యాదు మేరకు ఐదుగురు విలేకరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. విలేకరుల ముసుగులో వసూళ్లకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని, కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

గతంలోనూ ఐదుగురు..

గతంలోనూ శంకర్‌పల్లికి చెందిన విలేకరులు ఓ ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్న యజమానిని డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో ఆయన కుమారులతో కలిసి ఆత్మహత్య చేసున్నాడు. దీంతో ఆ ఐదుగురు విలేకరులపై కేసు నమోదైంది. విలేకరుల తీరుపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చంద్రుగొండలో నామరూపాల్లేకుండా డోజర్‌తో చదును చేసిన పల్లె ప్రకృతివనం



బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పచ్చని చెట్లతో కళకళలాడుతున్న చంద్రుగొండలోని పల్లె ప్రకృతివనం (ఫైల్)

మాయమైన పల్లె ప్రకృతివనం

- డోజర్‌తో తొలగించిన గుర్తుతెలియని వ్యక్తులు
- వరంగల్ జిల్లా చంద్రుగొండలో ఘటన
- కలెక్టర్, పోలీసులకు పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు

నెక్కొండ, అక్టోబర్ 9 : నిన్నటి వరకు పచ్చని చెట్లతో కళకళలాడిన పల్లె ప్రకృతి వనం మాయమైంది. గుర్తుతెలియని వ్యక్తులు డోజర్‌తో ప్రకృతివనాన్ని నామరూపాల్లేకుండా చేశారు. ఈ ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చంద్రుగొండలో బుధవారం వెలుగులోకి వచ్చింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మూడున్నరేండ్ల కిందట రూ.లక్షలు వెచ్చించి చంద్రుగొండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. రూ.3.50 లక్షలతో దాదాపు 1,500 పూలు, పండ్ల మొక్కలను తీసుకొచ్చి నాటారు. వనానికి ఫెన్సింగ్‌తోపాటు ఇతర ఖర్చులకు దాదాపు రూ.10 లక్షలు వెచ్చించినట్టు నాటి ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఏపుగా పెరిగిన చెట్లతో కళకళలాడిన పల్లె ప్రకృతి వనం ఆనవాళ్లు సైతం లేకుండా బుధవారం మధ్యాహ్నం డోజర్‌తో భూమిని చదును చేశారు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమన్‌రెడ్డి.. ఎంపీడీవో దయాకర్, కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు నెక్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పైలెట్ ప్రాజెక్టుగా మంత్రుల నియోజకవర్గాలే!

- 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్'కు ఎంపికైన 19లో 10 వారి స్థానాలే
- మిగిలిన 9లో ఒకటి ఎంఐఎం, 8 కాంగ్రెస్‌వే

హైదరాబాద్, అక్టోబర్9 (నమస్తే తెలంగాణ): 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ఏర్పాటుకు పైలెట్ ప్రాజెక్టు కింద 19 నియోజకవర్గాలను ప్రభుత్వం ఎంపిక చేసినట్టు తెలుస్తున్నది. పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకున్న జాబితాలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలే ఉండటం గమనార్హం.

19లో 10 మంత్రులవే..

'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్'కు ఎంపిక చేసిన 19 నియోజకవర్గాల్లో పది మంత్రులవే కావడం గమనార్హం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, తుమ్మల , జూపల్లి , పొంగులేటి, దామోదర ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్, మధిర, మంథని, హుస్నాబాద్, నల్లగొండ, ములుగు, ఖమ్మం, కొల్లాపూర్, పాలేరు, అందోల్ నియోజకవర్గాలు ఉన్నాయి.

'జలమండలి' ప్రహరీ కూల్చిన కాంగ్రెస్ నేత

- ఫిర్యాదుకు సిద్ధమైన కమిషనర్
- మేయర్ జోక్యంతో వెనక్కి

బోడుప్పల్, అక్టోబర్ 9: బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలోని చెంగిచర్ల జలమండలి కార్యాలయ ప్రహరీని స్థానిక కాంగ్రెస్ నాయకుడు కొత్త గోపాల్ గౌడ్ బుధవారం జేసీబీతో కూల్చివేశారు. ఈ విషయాన్ని మున్సిపల్ సిబ్బంది కమిషనర్ రామలింగంకు చేరవేయగా గోపాల్‌గౌడ్‌పై చర్యలు తీసుకోవడానికి ఆయన సిద్ధమయ్యారు. మేడిపల్లి పీఎస్‌కు చేరుకునే సమయంలో మేయర్ అజయ్‌యాదవ్, స్థానిక కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్ జోక్యం చేసుకుని ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. మహిళలు బతుకమ్మ ఆడుకోవడానికి గోడను తొలగించినట్టు వారు వివరించారు. తప్పు తెలుసుకున్న గోపాల్‌గౌడ్ ప్రహరీని 48గంటల్లో తిరిగి నిర్మించి ఇచ్చేందుకు అంగీకరించడంతో కమిషనర్ వెనక్కితగ్గారు. బోడుప్పల్ నగరపాలక సంస్థలో చెంగిచర్ల విలీనం కావడంతో గ్రామపంచాయతీగా సేవలందించిన ఆ భవనాన్ని జలమండలి కార్యాలయం కోసం వినియోగించుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారపక్ష నేతలు ఇలాంటి చర్యలకు ఉపక్రమించడమేంటని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ప్రయాణికులకు ఆర్టీసీ షాక్

- స్పెషల్ బస్సుల్లో చార్జీల బాదుడు

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): బతుకమ్మ, దసరాకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు టీజీఎస్ ఆర్టీసీ షాక్ ఇచ్చింది. స్పెషల్ బస్సులు ఏర్పాటుచేశామని గొప్పగా ప్రకటించిన సంస్థ.. పెంచిన చార్జీల విషయాన్ని రహస్యంగా ఉంచింది. బస్సు ఎక్కిన తర్వాత పెరిగిన చార్జీలను చూసిన ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. సాధారణ చార్జీల కంటే స్పెషల్ బస్సుల్లో 25 శాతం అధికంగా వసూలు చేస్తున్నారు. ఈ విషయాన్ని ఓ ప్రయాణికుడు సోషల్ మీడియాలో బయటపెట్టే వరకు ఆర్టీసీ అధికారులు చెప్పకపోవడం గమనార్హం. 2 నుంచి అదనపు చార్జీలు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. హైదరాబాద్ నుంచి నల్లగొండకు సాధారణ చార్జీ రూ.200 ఉంటే, రూ.250 వసూలు చేస్తున్నారు. నలుగురు కుటుంబ సభ్యులు ఊరెళ్తే అదనంగా రూ.200 పెట్టాల్సి వస్తుంది. ఆర్టీసీ అధికారులను వివరణ కోరగా.. రోజువారీగా బస్సుల్లో అదనపు చార్జీలు లేవని, స్పెషల్ బస్సుల్లో ధరలు వర్తిస్తాయని తెలిపారు.

కంప్లీషన్ సర్టిఫికెట్ రద్దు ఏకపక్షం

హైదరాబాద్, అక్టోబర్9 (నమస్తే తెలంగాణ): కంప్లీషన్ సర్టిఫికెట్‌ను నీటిపారుదల శాఖ రద్దు చేయడం ఏకపక్ష నిర్ణయమని ఎల్ అండ్‌టీ సంస్థ నీటిపారుదల శాఖకు లేఖ రాసింది. మేడిగడ్డ బరాజ్‌ను నిర్మించిన కాంట్రాక్టు ఏజెన్సీ ఎల్‌అండ్‌టీకి సాగునీటిపారుదల శాఖ మార్చి 15 2021లో కంప్లీషన్ సర్టిఫికెట్‌ను జారీ చేసింది. బరాజ్‌లోని ఏడవబ్లాక్‌లో 3 పిల్లర్లు కుంగుబాటునకు గురవడంతో గతంలో జారీ చేసిన కంప్లీషన్ సర్టిఫికెట్‌ను రద్దు చేస్తూ సాగునీటిపారుదల శాఖ ఇటీవల ఎల్‌అండ్‌టీకి లేఖ రాసింది. బరాజ్ నిర్మాణం, ఒప్పందం నిబంధనలు డిపార్ట్‌మెంట్ ఉల్లంఘించినట్టు చూడాల్సి వస్తుందని హెచ్చరించింది. 2019లోనే బరాజ్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని నిర్ధారించిన తర్వాతనే నీటిపారుదల శాఖ అధికారులు 2021న కంపెనీకి సర్టిఫికెట్ జారీ చేశారని ఏజెన్సీ గుర్తుచేసింది.

పెరిగిన దసరా ప్రయాణాలు

- రద్దీగా మారిన రైళ్లు, స్టేషన్లు
- అరకొరగానే కనీస సౌకర్యాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ప్రయాణికులతో కిక్కిరిసి ఉన్న సికింద్రాబాద్ బస్ స్టేషన్

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో అతి పెద్దదైన దసరా పండుగ నేపథ్యంలో నగరాల నుంచి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి పోయేవారి సంఖ్య అధికమైంది. ఇప్పటికే బస్సులు, ప్రైవేటు వాహనాల్లో చాలామంది సొంతూళ్లకు చేరుకున్నారు. అయినప్పటికీ రైళ్ల ద్వారా ప్రయాణం చేసేవారి సంఖ్య ఏ మాత్రం తగ్గడం లేదు. దసరా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ప్రయాణాలు మరింత పెరిగాయి. కుటుంబ సమేతంగా వెళ్తుండడంతో సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లు రద్దీగా మారాయి. రైళ్లన్నీ కిటకిటలాడుతున్నాయి. పలు రైల్వేస్టేషన్ల నుంచి అదనపు రైళ్లు ఏర్పాటుచేసినప్పటికీ అవి కూడా సరిపోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక రైళ్లలో 30 నుంచి 50 శాతం వరకు అదనపు చార్జీలు వసూలు చేస్తున్న నేపథ్యంలో ప్రయాణికులు రెగ్యులర్ రైళ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రయాణికుల రద్దీకి తగిన సౌకర్యాలు కల్పించలేదని రైల్వే అధికారులపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

6,304 స్పెషల్ బస్సులు..

సద్దుల బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 6,304 ప్రత్యేక బస్సులను టీజీఎస్‌ఆర్టీసీ ఏర్పాటుచేసింది. ఈసారి మహాలక్ష్మి పథకం అమలు నేపథ్యంతో రద్దీ దృష్ట్యా గత ఏడాదితో పోల్చితే అదనంగా 600 స్పెషల్ సర్వీసులను తిప్పాలని నిర్ణయించింది. బుధవారం నుంచి ఈ నెల 14 వరకు అధిక రద్దీ ఉండే అవకాశముండటంతో ఆ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతున్నది. జేబీఎస్ నుంచి 1,602, ఎల్బీనగర్-1193, ఉప్పల్-585, ఆరాంఘర్ నుంచి 451 అదనపు బస్సులను నడుపుతున్నట్టు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు.

తుగ్లక్‌ను తలదన్నేలా రేవంత్ పాలన

- బీఆర్‌ఎస్ సీనియర్ నేత శ్రవణ్



హైదరాబాద్, అక్టోబర్ 9(నమస్తే తెలంగాణ): పరిపాలనలో తుగ్లక్‌ను తలదన్నేలా సీఎం రేవంత్ రెడ్డి మూర్ఖంగా వ్యవహరిస్తున్నారని బీఆర్‌ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఆరోపించారు. హైకోర్టు కల్పించుకోకముందే హైడ్రా పేరిట ప్రజల ఇండ్లు కూల్చివేయవద్దనే సోయి ఎందుకు రాలేదని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు ఆయన బుధవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో సర్వే చేయకుండానే ప్రజల ఇండ్లు కూల్చి సీఎం రేవంత్‌రెడ్డి ఘోర తప్పిదం చేశారని ఆరోపించారు. హైడ్రా బెదిరింపులకు కలత చెంది ఆత్మహత్య చేసుకున్న కూకట్‌పల్లి బుచ్చమ్మ, వారి కుటుంబ సభ్యులకు ఎవరు న్యాయం చేస్తారని ప్రశ్నించారు. ఇందిరాగాంధీ అమలు చేసిన రోటీ, కపడా ఔర్ మకాన్ విధానానికి విరుద్ధంగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అడుగుజాడల్లో నడుస్తున్నారని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని రేవంత్‌రెడ్డి గుర్తించాలన్నారు. హైడ్రా పేరిట చెరువుల పునరుద్ధరణకు, సుందరీకరణకు సంబంధిత నిపుణులు, ప్రజా ప్రతినిధులతో చర్చించి, ఒక సమగ్ర పాలసీని తయారుచేయాలని సూచించారు. ప్రతి చెరువు క్యాచ్‌మెంట్ ఏరియా, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ వంటి అంశాలను శాటిలైట్ చిత్రాలు, లైడార్ సర్వే, డ్రోన్ల సాయంతో సేకరించి, ప్రజాప్రతినిధులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి సర్వే పూర్తిచేయాలని సూచించారు.

63 కోట్లు ఖర్చు చేస్తే 100 కోట్ల అవినీతా...?

- బీఆర్‌ఎస్ నేత కే వాసుదేవరెడ్డి



హైదరాబాద్, అక్టోబరు 9 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల్లో దివ్యాంగుల కార్పొరేషన్‌కు కేటాయించింది రూ.63 కోట్లయితే రూ.వంద కోట్ల అవినీతి జరిగిందంటూ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య అవివేకంగా మాట్లాడుతున్నారని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కే వాసుదేవరెడ్డి ఎద్దేవాచేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్యారెంటీలు అమలు చేసే శక్తి లేక కాంగ్రెస్ నాయకులు తనపై, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్‌పై నిరాధార ఆరోపణలు చేశారని మండిపడ్డారు. దివ్యాంగుల స్కీములకు సంబంధించి కేసీఆర్ హయాంలో ఆన్‌లైన్‌లో పూర్తి పారదర్శకతతో లబ్ధిదారుల ఎంపిక జరిగిందని స్పష్టం చేశారు. అవినీతి జరిగితే విచారణకు ఆదేశించాలి సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొలిటర్మ్‌లో దివ్యాంగుల శాఖ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వర్‌రావు ఇపుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారని గుర్తు చేశారు. దివ్యాంగులకు రూ. ఆరు వేల పెన్షన్, ఉచిత బస్సు ప్రయాణం ఎందుకు అమలుకు నోచుకోవడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ తరహాలో మోసపోవద్దని హర్యాణా ఓటర్లు కాంగ్రెస్‌ను తిరస్కరించారని తెలిపారు. వైఎస్ హయాంలోనే దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర నిధులు ఆగిపోయాయని, రాష్ట్రం ద్వారానే తీసుకోవాలని అప్పటి ప్రభుత్వం 492 జీవో జారీ చేసిందని గుర్తు చేశారు. దివ్యాంగులకు ఇచ్చిన హామీల అమలు కోసం త్వరలోనే సచివాలయాన్ని ముట్టడిస్తామని ప్రకటించారు.

లంబాడీలను వంచించిన కాంగ్రెస్: గణేశ్‌నాయక్

ఖైరతాబాద్, అక్టోబర్ 9 : లంబాడీలకు ఏదో చేస్తారని చేతిగుర్తుకు ఓటేస్తే హ్యాండిచ్చారని, 40 లక్షల మంది జనాభా ఉన్న తమకు మంత్రి పదవి ఇవ్వకుండా వంచించారని నంగారాభేరి లంబాడీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ధరావత్ గణేశ్ నాయక్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో గిరిజన విద్యార్థి సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ బంజారాతో కలిసి మాట్లాడారు. అనంతరం ముట్టడి కార్యక్రమ పోస్టర్లను గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనునాయక్‌తో కలిసి విడుదల చేశారు.

ప్రత్యేక తెలంగాణ వృద్ధి కొనసాగింది: బాబు

హైదరాబాద్, అక్టోబర్9 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విభజన తరువాత తెలంగాణలో అభివృద్ధి కొనసాగిందని ఏపీ సీఎం చంద్రబాబు కొనియాడారు. ఉండవల్లి నివాసంలో బుధవారం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలను వివరించారు. సమైక్యాంధ్రలో తెలంగాణ బలమైన ఆర్థిక వ్యవస్థగా రూపొందిందని చెప్పారు.

సంగారెడ్డి దవాఖానలో పసికందు మాయం

కంది, అక్టోబర్ 9: సంగారెడ్డి ప్రభుత్వ దవాఖాన నుంచి బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు ఓ నవజాత ఆడ శిశువును ఎత్తుకెళ్లారు. సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం దూదిగొండకు చెందిన నసీమా నాలుగో కాన్పు కోసం మంగళవారం రాత్రి సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానలో చేరింది. సిజేరియన్ ద్వారా ఆడ శిశువుకు జన్మనిచ్చింది. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో కుటుంబ సభ్యులందరూ ఉండగానే క్షణంలో శిశువును ఎత్తుకెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు సంగారెడ్డి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్పీ చెన్నూరి రూపేశ్, డీఎస్పీ సత్తయ్య దవాఖాన దగ్గరికి చేరుకొని కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆందోళన చెందవద్దని దుండగులను పట్టుకొని శిశువును అప్పగిస్తామని ధైర్యం చెప్పారు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా ముగ్గురు మహిళలు అనుమానాస్పదంగా తిరగడం గమనించారు. బురఖాలు ధరించి శిశువును దవాఖాన నుంచి బయటకు తీసుకెళ్లిన దశ్యాలు సీసీ ఫుటేజీలో నమోదయ్యాయి. ఎత్తుకెళ్లినవారు మైనార్టీ మహిళలై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.



మీడియాతో మాట్లాడుతున్న ది వైజాగ్ పటం క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సీఎంఆర్‌పై సోషల్ మీడియాలో దుష్ప్రచారం

- సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసిన నిర్వాహకులు

సిటీబ్యూరో, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ) : సీఎంఆర్ షాపింగ్ మాల్‌పై సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచార పోస్టులను నమ్మవద్దని నిర్వాహకులు పేర్కొన్నారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ నాలుగు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల్లో సుపరిచితమైన బ్రాండ్‌గా గుర్తింపు తెచ్చుకుని, వేడుక ఏదైనా సీఎంఆర్‌తోనే శుభారంభం అనే నానుడితో ప్రతి ఇంటా చెరగని ముద్రవేసిన సంస్థగా గుర్తింపు తెచ్చుకుందన్నారు. ఇటీవల కొంతమంది పోటీదారులు సీఎంఆర్ ప్రతిష్టను దెబ్బతీసే ఉద్దేశంతో సీఎంఆర్ లోగోను సోషల్ మీడియా పోస్టులో మార్ఫింగ్ చేసి దుష్ప్రచారం చేస్తున్నారని ది వైజాగ్ పటం క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కంకటాల మల్లిక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలందరూ దీనిని గమనించాలని కోరారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశామని ది వైజాగ్‌పటం క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ఫౌండర్ మావూరి వెంకటరమణ చెప్పారు. సీఎంఆర్ వ్యాపార రంగంలోనే కాకుండా సేవా రంగంలోనూ ముందుందని మురళీకృష్ణ గుర్తు చేశారు. సీఎంఆర్‌పై కావాలనే కొందరు మతపరమైన అంశాలను జోడించి విషప్రచారం చేస్తున్నారని వీసీసీఐ ప్రెసిడెంట్ సుదర్శన్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి సీఎంఆర్‌పై వస్తున్న విష ప్రచారాన్ని నమ్మవద్దని పైడా కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.

కూతురిపై మారు తండ్రి లైంగికదాడి

నాలుగేండ్లుగా అఘాయిత్యం

వెంగళరావునగర్, అక్టోబర్ 9: వావి వరసలు మరిచి కామంతో కండ్లు మూసుకుపోయి కూతురిపై అత్యాచారానికి పాల్పడ్డాడో మారుతండ్రి. పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముండే మహిళకు ఖదీర్‌తో వివాహమై 2010లో విడాకులయ్యాయి. పిల్లలను సోదరుడి వద్ద ఉంచి ఆమె హైదరాబాద్‌లో ఉంటున్నది. ఆ మహిళకు సిరిసిల్లకు చెందిన లింగంపల్లి మహేందర్ పరిచయమయ్యాడు. ఇద్దరూ పెండ్లి చేసుకోగా, వీరికో కుమారుడు పుట్టాడు. 2019లో మొదటి భర్తతో కలిగిన కూతురిని (తొమ్మిదేండ్లు) తన ఇంటికి తీసుకొచ్చింది. ఉద్యోగం చేయకుండా ఇంట్లోనే ఉండే మారు తండ్రి మహేందర్ ఆ బాలికపై నాలుగేండ్లుగా అత్యాచారానికి పాల్పడుతున్నాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బాలికను బెదిరించాడు. ఇటీవల మహిళకు విషయం తెలిసి భర్తను గట్టిగా నిలదీయడంతో ఇద్దరిని చంపుతానని బెదిరించాడు. అంతేకాకుండా తనకు కుమార్తెను ఇచ్చి పెండ్లి చేయాలని మారుతండ్రి మహేందర్ వేధిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గంట వ్యవధిలో తల్లీకొడుకు మృతి

- క్యాన్సర్‌తో బాధపడుతున్న కొడుకు..దిగులుతో తల్లి మృతి
- తల్లి మృతిచెందిన గంటకే తనువు చాలించిన కొడుకు
- హనుమకొండ జిల్లా ముల్కనూరులో విషాదం



తల్లి శోభ, కొడుకు సాయికిరణ్ (ఫైల్)

భీమదేవరపల్లి, అక్టోబర్ 9: క్యాన్సర్ బారిన పడిన కొడుకు ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తుండటంతో ఆ తల్లి తట్టుకోలేకపోయింది. తీవ్ర మనస్తాపం చెందిన ఆ మాతృమూర్తి అనారోగ్యంతో మంచం పట్టింది. కొడుకు మృతిని తట్టుకోలేనను కుందో ఏమో కానీ.. అతడి కంటే ముందే కన్నుమూసింది. తల్లి లేకపోతే తననెవరు పట్టించుకుంటారనుకున్నాడో ఏమో.. ఆమె మరణించిన గంట సేపటికే కొడుకు తనువు చాలించాడు. ఈ హృదయ విదారక ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో బుధవారం చోటుచేసుకుంది. చిదురాల లక్ష్మయ్యకు భార్య శోభ (48), ఇద్దరు కుమారులు సందీప్, సాయికిరణ్ (28), కూతురు దివ్య ఉన్నారు. భార్యాభర్తలిద్దరు కూలి పని చేసి కుటుంబాన్ని పోషిస్తూ కూతురు వివాహం చేశారు. పెద్ద కొడుకు సందీప్ కూడా కూలి పని చేస్తున్నాడు. చిన్న కొడుకు సాయికిరణ్ ముల్కనూరులోనే కొంతకాలం బైక్ మెకానిక్ పని నేర్చుకునేందుకు వెళ్లేవాడు. ఇంతలో సాయికిరణ్ అస్వస్థతకు గురికావడంతో చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లారు. నిత్యం గుట్కాలు తినడం వల్ల క్యాన్సర్ సోకిందని, ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. ఏడాది క్రితం పేగు ఆపరేషన్ చేసినా నయం కాకపోవడంతో హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే దవాఖానకు తరలించారు. అక్కడ కీమో థెరపీ చేసినా ప్రయోజనం లేకపోవడంతో ఇంటికి తీసుకొచ్చారు. రోజురోజుకూ కొడుకు ఆరోగ్యం క్షీణిస్తుండటంతో తల్లి శోభ దిగులు పెట్టుకున్నది. దీంతో ఆమె కూడా అనారోగ్యం బారిన పడి బుధవారం ఉదయం కన్నుమూసింది. ఆమె మరణించిన గంటసేపటికే సాయికిరణ్ కూడా మృతిచెందాడు. ఇంటి ముందు తల్లి, కొడుకుల మృతదేహాలను చూసిన గ్రామస్థులు చలించిపోయారు. రెక్కాడితేగాని డొక్కాడని చిదురాల లక్ష్మయ్య కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పంట నష్టంలో భారీ కోత

79 వేల ఎకరాలకే పంట నష్ట పరిహారం • 79 కోట్లతో సరిపెట్టిన రేవంత్ సర్కార్
ప్రాథమిక అంచనాలకు భారీగా కోత • లక్షలాది రైతులకు మొండిచెయ్యి

హైదరాబాద్, అక్టోబర్ 9(నమస్తే తెలంగాణ): పంట నష్టం పరిహారంలో ప్రభుత్వం భారీగా కోత విధించింది. గత నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల విస్తీర్ణం అంచనాలను వ్యవసాయ శాఖ భారీగా కుదించింది. 4.25 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా అంచనా వేసిన వ్యవసాయ శాఖ వాస్తవిక అంచనాలను 79,574 ఎకరాలకు తగ్గించింది. వీరికి మాత్రమే పంట నష్ట పరిహారం మంజూరు చేసిన ప్రభుత్వం.. బుధవారం రూ.79.57 కోట్లు విడుదల చేసింది. ఈ మొత్తాన్ని గురువారం రైతుల ఖాతాల్లో జమ చేయనున్నది. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల కారణంగా 4.25 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు ప్రభుత్వం ప్రాథమిక అంచనా వేసింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా వెల్లడించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు. ఆ తర్వాత వ్యవసాయ శాఖ పంట నష్టంపై మళ్లీ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో సవాలక్ష కొర్రీలు పెట్టినట్టు తెలిసింది. మరీ ముఖ్యంగా 33% లేదా ఆ పైన పంట నష్టపోతేనే పంటనష్టం కింద పరిగణించారు. ఈ విధంగా 33%, ఆపై పంట నష్టం జరిగిన భూమి 79,574 ఎకరాలు మాత్రమేనని తేల్చారు. ఇందులో ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 28,407 ఎకరాలు, మహబూబ్‌నగర్‌లో 14,669 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 9,828 ఎకరాలు, మిగిలిన జిల్లాల్లో 3,288 ఎకరాల్లో నష్టం జరిగినట్టు తేల్చారు. ప్రాథమిక అంచనాలతో పోల్చితే వాస్తవ నష్టం ఏకంగా 3.45 లక్షల ఎకరాలు నష్టం తగ్గడం గమనార్హం. అసలు ఎక్కడైనా ప్రాథమిక అంచనాలకు, వాస్తవ అంచనాలకు ఇంత భారీ వ్యత్యాసం ఉంటుందా? అని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.



ప్రాథమిక అంచనా ప్రకారం దెబ్బ తిన్న విస్తీర్ణం – **4.25** లక్షల ఎకరాలు

చివరకు పంట నష్టపరిహారం ఇచ్చిన విస్తీర్ణం – **79,574** ఎకరాలు

ప్రాథమిక, వాస్తవిక అంచనాల మధ్య తేడా – **3.45** లక్షల ఎకరాలు

నా భార్య అవినీతి అధికారి

- ఇదిగో ఈ నోట్ల కట్టలే నిదర్శనం
- వీడియోతో రచ్చకెక్కిన ఓ భర్త



మణికొండ, అక్టోబర్ 9: తన భార్య అవినీతి అధికారి అని, ఇదిగో ఆమె సంపాదించిన నోట్ల కట్టలు అంటూ ఓ భర్త రచ్చకెక్కాడు. ఇంట్లో పలు చోట్ల దాచిపెట్టిన నగదును వీడియోతీసిన సదరు భర్త దానిని సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశాడు. ఇటీవలి వరకు మణికొండ మున్సిపాలిటీలో డీఈఈగా పనిచేసిన దివ్యజ్యోతి ఇటీవలే జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. అయితే ఆమె అవినీతి అధికారి అని కోట్ల రూపాయలు సంపాదిస్తున్నదని, ప్రతిరోజు నోట్ల ఇంటికి నోట్ల కట్టలతో వస్తున్నదని ఆరోపిస్తూ ఆమె భర్త శ్రీపాదశర్మ మంగళవారం రాత్రి ఓ వీడియో పోస్ట్ చేశారు. అవినీతికి పాల్పడవద్దని పలుమార్లు వారించినా ఆమె వినటం లేదని చెప్పారు. ఆమె కాంట్రాక్టర్ల వద్ద లక్షల రూపాయలు లంచం తీసుకొని వాటిని ఇంట్లో డబ్బాల్లో, సెల్ఫ్‌ల్లో పెడుతున్నదని తెలిపారు. ఆమె డబ్బు ఎక్కడెక్కడ దాచిందీ ఆ ప్రదేశాలన్నీ తన వీడియోలో చిత్రీకరించాడు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ కావడంతో ఆమె సహ ఉద్యోగుల్లో సైతం వణుకు మొదలైంది. ఓ అధికారి ఇంతలా సంపాదనకు పాల్పడిందంటే ఆమెతోటివారు ఇంకా ఏ స్థాయిలో సంపాదించి ఉంటారోనంటూ నెటిజన్లు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అధికారుల అవినీతికి అంతు లేకుండా పోయిందని విమర్శిస్తున్నారు. అనేకమందిని అవినీతి నిరోధక శాఖ వల వేసి పట్టుకుంటున్నా.. ఇంకా పుట్టుకొస్తూనే ఉన్నారని అంటున్నారు.

వివాదం వల్లనే రచ్చకెక్కారు



మంత్రి శ్రీధర్‌బాబుతో శ్రీపాదశర్మ

శ్రీపాదశర్మ, దివ్యజ్యోతిది ప్రేమ వివాహమని, ఎందుకో ఇద్దరి మధ్య మనస్పర్థలు తారస్థాయికి చేరుకున్నాయని స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే భర్త తన భార్యపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆమె సన్నిహితులు వెల్లడించారు. వారి వివాదం ఇటీవల విడాకుల నోటీసుల వరకు వెళ్లినట్టు తెలిసింది. ఈ దంపతులకు ఓ మూడేండ్ల కొడుకు ఉన్నాడు. ఈ వివాదాల కారణంగానే ఆమె ప్రతిష్ఠను దిగజార్చేందుకు శ్రీపాదశర్మ ఇంట్లోని నగదును మూటలుగా చుట్టి, వీడియోతీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడని మున్సిపల్ సిబ్బంది అంటున్నారు. శ్రీపాదరావు రాష్ట్ర ఐటీశాఖ మంత్రి డీ శ్రీధర్‌బాబుకు దగ్గరి బంధువు అని స్థానిక ప్రజలు తెలిపారు. మంత్రి అండదండలతోనే శ్రీపాదశర్మ ఆమెను వేధిస్తున్నాడని అన్నారు. అతడు నిరుద్యోగి అని, ఆమె సంపాదిస్తుంటే ఇంట్లో ఉంటూ వేధింపులకు గురిచేస్తున్నాడని తెలిసింది.

కొరివి దయ్యం రేవంత్

> తెలంగాణ రావడం ఇష్టంలేని మాతృద్రోహి రేవంత్‌రెడ్డికి ఈ మట్టి బిడ్డ కేసీఆర్ త్యాగాలు ఎట్లా కనిపిస్తయ్? నీ లాంటి కొరివి దయ్యాన్ని తెచ్చుకొని పొరపాటు చేశామని తెలంగాణ సమాజం పశ్చాత్తాపపడుతున్నది. – హరీశ్

> ఎమ్మెల్యేకు లంచం ఇవ్వబోయి పట్టుబడ్డ దొంగ.. టీచర్లకు నీతి వచనాలు చెప్తున్నడు. సమాజాన్ని తీర్చిదిద్దాల్సిన టీచర్ల మెదళ్లలో అసభ్యకరమైన భాషను ఎక్కించే ప్రయత్నం చేస్తున్నడు. విద్యార్థులకు బిల్లా, రంగాల గురించి బోధించాలని టీచర్లకు చెప్తున్నవా? –హరీశ్

> కట్టిన ఇంటికి సున్నం వేస్తే ఇల్లు నువ్వు కట్టినట్టేనా? కేసీఆర్ హయాంలో ఉద్యోగాల నియామక ప్రక్రియను కోర్టులకు వెళ్లి అడ్డుకున్నది కాంగ్రెస్ నేతలు కాదా? స్వార్థం కోసం నిరుద్యోగులను రెచ్చగొట్టి మోసంచేస్తున్న దగాకోరువు. జాబ్ క్యాలెండర్‌ను జాబ్‌లెస్ క్యాలెండర్ చేసింది నువ్వు.. – హరీశ్

- తెలంగాణ సూరీడు కేసీఆర్
- ఉద్యమంలో రేవంత్‌లాంటి ఎన్నో కొరివి దయ్యాలను తుదముట్టించినం
- లంచం ఇవ్వబోతూ పట్టుబడ్డ దొంగ టీచర్లకు నీతి వచనాలు చెప్తున్నడు
- 2014లోనే పొరపాటున రేవంత్‌రెడ్డికి అధికారమిస్తే రాష్ట్రాన్నే అమ్మేసేటోడు
- విద్యార్థులకు బిల్లా, రంగాల గురించి బోధించాలని టీచర్లకు చెప్తున్నవా?
- నోటిఫికేషన్లన్నీ బీఆర్‌ఎస్ సర్కార్ ఇచ్చినవే
- వంట అయినంక రేవంత్ గంటె తిప్పిండు
- తెలంగాణ ద్రోహులకు కట్టు బానిసవు నువ్వు..
- రాష్ట్ర ప్రజలకు బానిసలం మేము
- రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్



> గంట కూడా రెస్ట్ లేకుండా పనిచేస్తున్న అని ఈ సిపాయి చెప్తున్నడు.. అంత పనిచేస్తుంటే రాష్ట్ర ప్రజలకు ఇన్ని కష్టాలెందుకు? ప్రజలను ఎట్ల బాధపెట్టాల్నని రెస్ట్ లేకుండా ఆలోచిస్తున్నవా? –హరీశ్

హైదరాబాద్, అక్టోబరు 9 (నమస్తే తెలంగాణ) : రేవంత్‌రెడ్డే అసలు సిసలు కొరివి దయ్యమని, రేవంత్ నుంచి తెలంగాణను కాపాడే కొర్రాయి కేసీఆర్ అని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. కేసీఆర్‌ను కొరివి దయ్యమని తెలంగాణ ద్రోహులు తప్ప ఎవ్వరూ అనరని, తెలంగాణ ఉద్యమంలో రేవంత్‌రెడ్డి లాంటి ఎన్నో కొరివి దయ్యాలను తుదముట్టించి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నిజం చేసిన ఉద్యమ సూరీడు కేసీఆర్ అని స్పష్టంచేశారు. బుధవారం ఎల్బీస్టేడియంలో కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఓ ప్రకటనలో ఘాటుగా స్పందించారు. రేవంత్ రెడ్డి తీరు వెయ్యి ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయినట్టుగా ఉన్నదని ఎద్దేవాచేశారు. ప్రభుత్వ సొమ్మును తెలంగాణ నిర్మాత కేసీఆర్‌ను తిట్టేందుకే వినియోగిస్తున్నాడని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి పొరపాటున 2014లో అధికారం ఇస్తే తెలంగాణను అమ్మేసేవాడని ఆందోళన వ్యక్తంచేశారు. కేసీఆర్ చేతిలో తెలంగాణ సురక్షితంగా ఉంది కాబట్టే రేవంత్ సీఎం కాగలిగాడని, సీఎం అనే ఉద్యోగం కూడా కేసీఆర్ చలవేనని గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు.

నోటిఫికేషన్లన్నీ గత సర్కార్‌వే

30 వేల ఉద్యోగ నియామక పత్రాలు కూడా కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లతోనే ఇచ్చిన విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని హరీశ్ సూచించారు. నోటిఫికేషన్ ఇచ్చింది.. ఫైనాన్స్ క్లియరెన్స్ ఇచ్చింది.. పరీక్షలు నిర్వహించింది కూడా బీఆర్‌ఎస్సేనని గుర్తు చేశారు. 'రేవంత్ రెడ్డి చేసిన పనేందంటే వంట అయినంక గంటె తిప్పిండు అంతే' నని ఎద్దేవా చేశారు. అలవాటు ప్రకారమే రేవంత్ అబద్ధం చెప్పాడని, మూడు నెలల్లోనే ఇచ్చినమని చెప్పుకొన్న 30వేల ఉద్యోగాల సంగతి కూడా ఇదేనని దుయ్యబట్టారు. వాటికి నోటిఫికేషన్ ఇచ్చింది, పరీక్షలు నిర్వహించిందీ.. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసింది కూడా బీఆర్‌ఎస్ సర్కారేనని హరీశ్ స్పష్టంచేశారు. 7,094 స్టాఫ్ నర్సుల నియామకాల విషయంలోనూ ఇలానే అబద్ధం చెప్పారని, స్టాఫ్ నర్సులు, సింగరేణి, పోలీస్, టీచర్ల నోటిఫికేషన్లు ఇచ్చింది బీఆర్‌ఎస్సేనని, పరీక్ష నిర్వహించింది కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. నోటిఫికేషన్లు లేకుండా, పరీక్షలు నిర్వహించకుండా, ఏకంగా నియామక పత్రాలు ఇవ్వడం కుదురుతుందా? అని ప్రశ్నించారు. 2017లో టీఎస్పీఎస్సీ ద్వారా 8,792 టీచర్ పోస్టులు, గురుకులాల్లో 11 వేలకు పైగా టీచర్ పోస్టులు, 12 వేల నాన్ టీచింగ్ పోస్టులు మంజూరు ఇచ్చామని చెప్పారు. ఇంటర్ కాలేజీల్లో 3,096 మందిని, టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో 520 మందిని, డిగ్రీ కాలేజీల్లో 280 కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశామని తెలిపారు. హయ్యర్ ఎడ్యుకేషన్‌లో 3,232 పోస్టులు, యూనివర్సిటీల్లో 1,061 పోస్టులు మంజూరు చేశామని, ఇవన్ని దాచేస్తే దాగని సత్యాలని హరీశ్ గుర్తుచేశారు. 25 వేల మెగా డీఎస్సీ అని ఊదరగొట్టి, బీఆర్‌ఎస్ ఇచ్చిన 5,089 పోస్టులకు అదనంగా ఆరు వేలు కలిపి నోటిఫికేషన్ ఇచ్చి మెగా డీఎస్సీని దగా చేశారని మండిపడ్డారు.

సీఎం స్థానంలో ఉండి ఇలా పోల్చవచ్చా?

సీఎం స్థానంలో ఉండి బిల్లా, రంగాలతో పోల్చవచ్చా? అని హరీశ్ ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో ఓడిపోయిన వారికి పదవులు ఇవ్వలేదా? అని నిలదీశారు. కవిత ఎమ్మెల్సీగా ఎన్నికల ప్రక్రియలో ఓట్లతోనే గెల్చిచిందని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో లక్షా 60 వేలకు పైగా ఉద్యోగాలిచ్చారని, గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందా? అని ప్రశ్నించారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలిస్తానని మభ్యపెట్టారని, పది నెలలైనా ఉద్యోగాల ఊసే లేదని మండిపడ్డా రు. 'విద్యార్థులు, నిరుద్యోగులు నీ మోసాన్ని అర్థం చేసుకున్నరు.. నీకు కొలువు ఇచ్చిన నిరుద్యోగులే నీకు కొరివి పెడుతరు' అంటూ హెచ్చరించారు. 'నిన్ను పడగొడతం అని ఎవరో అన్నట్టు సానుభూతి రాజకీయాలు మొదలు పెడుతున్నవ్.. నీ మాటలే నిన్ను పడగొడతయ్. హర్యానా ఓటర్లు మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ గ్యారెంటీలకు గోరీ తవ్విండ్రు.. తెలంగాణలో ఇప్పుడు బొంద తవ్వడం మొదలైంది' అంటూ మండిపడ్డారు. 'తెలంగాణను నీ దుష్ట పన్నాగం నుంచి కాపాడేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తం.. ఉద్యమం తెలియని వాడివి.. తెలంగాణ ఆర్తి లేనివాడివి.. తాతకు దగ్గులు నేర్పుతవా?' అని ధ్వజమెత్తారు. 'తెలంగాణ ద్రోహులకు కట్టు బానిసవు నువ్వు.. తెలంగాణ ప్రజలకు బానిసలం మేము' అంటూ హరీశ్ స్పష్టంచేశారు.

కోర్టు తీర్పు మేరకే నడుచుకుంటాం..

ఎమ్మెల్సీ అనర్హతపై మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 9 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యేల అనర్హతపై కోర్టు ఇచ్చే తీర్పు ఆధారంగానే ఎమ్మెల్సీల అనర్హత పిటిషన్‌పై చర్యలు తీసుకుంటానని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. మండలి చైర్మన్ చాంబర్‌లో బుధవారం మీడియాతో మాట్లాడారు. రాజకీయ నాయకులు పరుష పదజాలం వాడటం బాధాకరమని, ప్రజలు సైతం నాయకుల భాషను జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. పట్నం మహేందర్‌రెడ్డి అఫీషియల్ ప్రభుత్వ చీఫ్ విప్ అన్నారు. తాను బీఆర్‌ఎస్ మండలి చైర్మన్‌ను కాదని, మండలి చైర్మన్ పదవి తీసుకున్న తర్వాత ఏ పార్టీ ఉండదన్నారు. ప్రొటోకాల్ విషయంలో తనకెలాంటి ఇబ్బ ందులు లేవంటూనే.. తమ జిల్లాలో అరటి చెట్టుకు ముండ్లున్నాయంటూ ఎద్దేవా చేశారు. వచ్చే ఏడాది 9 ఎమ్మెల్సీలు ఖాళీ అవుతున్నాయన్నారు.

ఫీజు బకాయిలన్నీ విడుదల చేయాలి

ఆర్ కృష్ణయ్య డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నీ విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం ప్రకటన విడుదల చేశారు. బీసీ సంక్షేమశాఖకు కేవలం రూ.1502 కోట్లు విడుదల చేయడంతో సరిపోదని, బకాయిలన్నీ విడుదల చేస్తేనే విద్యార్థుల స్కాలర్‌షిప్ సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. మూసీ సుందరీకరణకు 1.50 లక్షల కోట్లు ఖర్చు పెట్టాలని చూస్తున్న ప్రభుత్వానికి.. విద్యార్థుల కోసం పెట్టే 3 వేల కోట్లు భారమా? అని ప్రశ్నించారు.

నేడు పరువు నష్టం దావాపై విచారణ

రెండో సాక్షి వెంకటేశ్వర్లు వాంగ్మూలం

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): మంత్రి కొండా సురేఖపై అక్కినేని నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం దావాపై గురువారం విచారణ కొనసాగనుంది. రెండో సాక్షిగా వెంకటేశ్వర్లు తన వాంగ్మూలం నమోదు చేసే అవకాశం ఉంది. కోడలు సుప్రియ సాక్ష్యం సరిపోతుందని కోర్టు భావిస్తే కేసు నమోదుకు తదుపరి చర్యలు చేపడుతుంది. ఈ కేసులో పెన్‌డ్రైవ్, పత్రికల్లో వచ్చిన వార్తల క్లిప్పింగ్‌లు, సోషల్ మీడియాలోని కథనాలను నాగార్జున తరపు న్యాయవాది అశోక్‌రెడ్డి కోర్టుకు సమర్పించారు. వాటిని పరిశీలించిన పిదప కేసు నమోదుకు కోర్టు చర్యలు చేపట్టనుంది. అనంతరం మంత్రికి సమన్లు జారీ చేయనుంది.

14న గ్రూప్-1 హాల్‌టికెట్లు విడుదల

సాంకేతిక సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 మెయిన్ హాల్‌టికెట్లను 14న విడుదల చేయనున్నట్టు టీజీపీఎస్సీ ప్రకటించింది. పరీక్షకు ఒక రోజు ముందు(ఈ నెల 21) వరకు హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయని సెక్రటరీ నవీన్ నికోలస్ తెలిపారు. 21 నుంచి 27 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. సాంకేతిక సమస్యల పరిష్కారానికి అభ్యర్థులు 040 –23542185, 040 –23542187 హెల్ప్‌లైన్ నంబర్లు, Helpdesk@tspsc. gov. in ఈ-మెయిల్‌ను సంప్రదించాలి. జనరల్ ఇంగ్లిష్ తప్ప అన్ని పేపర్లను తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్‌లో రాయవచ్చు.

14న కోర్టు కేసు

గ్రూప్ –1 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రం ఫైనల్ 'కీ'లో 7 ప్రశ్నలపై అభ్యంతరాలు వ్యక్తంచేస్తూ అభ్యర్థులు హైకోర్టులో కేసు వేయగా, 14న విచారణకు రానుంది. ఈ కేసును పక్కదారి పట్టించేందుకే హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో పెడుతున్నారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. గ్రూప్–1పై స్టే రావాలంటే మెయిన్ రాసే అభ్యర్థులెవరూ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోకుండా ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని అభ్యర్థులు కోరుతున్నారు.

యువ రైతు ఆత్మహత్య


- అప్పుల బాధతో ఆందోళన
- జనగామ జిల్లాలో విషాదం



కత్తుల రాజు(ఫైల్)

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 9 : అప్పుల బాధ భరించలేక ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెంలో చోటుచేసుకున్నది. బంధువుల కథనం మేరకు..కత్తుల రాజు (30) తనకున్న 1.20 ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఇటీవల రూ.5లక్షల వరకు అప్పు చేసి ఇల్లు నిర్మించుకున్నాడు. వాటిని తీర్చలేక మూడు రోజుల క్రితం గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించగా బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య వసంత, ఇద్దరు పిల్లలున్నారు.

కరెంట్‌షాక్‌తో రైతు మృతి



ఐలయ్య (ఫైల్)

గూడూరు, అక్టోబర్ 9 : కరెంట్‌షాక్‌తో రైతు మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొల్లేపల్లి గ్రామ పరిధి వడ్డెరగూడెంలో బుధవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంపంగి ఐలయ్య (55) పొలానికి నీరు పెట్టేందుకు మోటర్‌ను ఆన్ చేస్తున్న క్రమంలో స్టార్టర్‌కు విద్యుత్ సరఫరా జరిగి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నర్సమ్మ, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

ఇంజినీర్ కంటే మేస్త్రీ సంపాదనే ఎక్కువ

- ప్రభుత్వ బడికి పిల్లలను పంపడం నామోషీగా ఉన్నది
- ఉపాధ్యాయులే ఆ పరిస్థితిని మార్చాలి: సీఎం రేవంత్
- కొత్త టీచర్లకు నియామక పత్రాలు అందజేసిన సీఎం



ఉపాధ్యాయ నియామకపత్రాన్ని అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం తదితరులు

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇంజినీర్ కంటే మేస్త్రీయే ఎక్కువ సంపాదిస్తున్నాడని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. 'రాష్ట్రంలో రూ.15 వేలకు ఇంజినీర్ దొరుకుతున్నడు.. కానీ, 60 వేలకు కూడా మేస్త్రీ దొరకని పరిస్థితులున్నయ్' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితిని మార్చేందుకే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. డీఎస్సీ–2024లో ఉద్యోగాలు పొందినవారికి బుధవారం ఎల్బీ స్టేడియంలో రేవంత్‌రెడ్డి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఈ రోజుల్లో ప్రభుత్వ బడికి వెళ్లడమంటేనే గ్రామాల్లోనూ నామోషీగా భావిస్తున్నారని, ఉపాధిహామీ కూలీలు సైతం తాము తిన్నా, తినకపోయినా పుస్తె లమ్మి తమ పిల్లలను ప్రైవేట్ బడికి పంపాలనుకుంటున్నారని, ఈ పరిస్థితిని మార్చాలని పిలుపునిచ్చారు. తెలంగాణ బిడ్డలను ఇంజినీర్లుగా, సైంటిస్టులు, డాక్టర్లుగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రభుత్వ స్కూళ్లలో చదువుకోవడాన్ని గర్వంగా చెప్పుకునే రోజులు రావాలని ఆకాంక్షించారు. తెలంగాణ బిడ్డలు ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించాలన్న లక్ష్యంతో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 30 వేల సర్కారు స్కూళ్లలో 24 లక్షల మంది విద్యార్థులు ఉంటే, పదివేల ప్రైవేట్ పాఠశాలల్లో 34 లక్షల మంది విద్యార్థులు చదువుకొంటున్నారని వివరించారు. ప్రైవేట్‌లో సర్కారు టీచర్ల కంటే ఎక్కువ చదువుకున్నవారు, గొప్ప వ్యక్తులు, అనుభవమున్నవారు బోధిస్తున్నారా? అని ప్రశ్నించారు.

అభిషేక్ మను సింఘ్వీ హాజరు

రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యుడిగా ప్రాతినిధ్యం వహిస్తున్న అభిషేక్ మనుసింఘ్వీ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా పలువురు నూతన టీచర్లకు నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, సీఎస్ శాంతికుమారి, విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌కు సెక్యూరిటీ పెంపు..!

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సెక్యూరిటీని పెంచారు. గతంలో ఉన్న భద్రతా సిబ్బందికి అదనంగా రెండు పూర్తిస్థాయి టీములను జోడించారు. సాధారణంగా ముఖ్యమంత్రి బందోబస్తుకు నాలుగు ప్రత్యేక బృందాలు ఉంటాయి. ఒక అడ్వాన్స్ టీం, ఒక స్పేర్ టీం, రెండు రెగ్యులర్ బృందాలతో భద్రత కల్పిస్తారు. ఒక్కొక్క బృందంలో 48 మంది పోలీసు సిబ్బంది ఉంటారు. వీరిలో డీఎస్పీ సహా ఇన్‌స్పెక్టర్లు, ఎస్సై, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్.. ఇలా రకరకాల సిబ్బంది ప్రతీ టీమ్‌లోను ఉంటారు. నాలుగు బృందాలకు అదనంగా మరో రెండు బృందాలను జోడించారు. సీఎం కాన్వాయ్‌లో కూడా అదనంగా రెండు వాహనాలను పెంచారు. మూడు రోజులుగా సీఎం భద్రతను పెంచినట్టు పోలీసు వర్గాలు చెప్తున్నాయి.

ప్రజావ్యతిరేకతే కారణమా?

రాష్ట్రంలో హైడ్రా కూల్చివేతలు, మూసీ బ్యూటిఫికేషన్ పేరుతో ఇండ్ల తొలగింపు జరుగుతున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున ప్రజలు ఆందోళన బాటపట్టారు. సీఎం నివాసాన్ని ముట్టడిస్తామని, సెక్రటేరియేట్ వద్ద ఆందోళనలు చేస్తామని పలు ప్రజాసంఘాలు ప్రకటించాయి. దీంతోపాటు రాష్ట్ర సరిహద్దుల్లో ఇటీవల భారీ ఎత్తున మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఈ నేపథ్యంలో బందోబస్తును పెంచినట్టు పోలీసు వర్గాలు చెప్తున్నాయి.

కొత్త టీచర్ల ముందు సీఎం తిట్లదండకం

- స్ఫూర్తినివ్వాల్సింది పోయి బూతుపురాణం
- సమాజ నిర్దేశకుల్లో విషం నింపే యత్నం

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ) : వారంతా కొత్త టీచర్లు! భావితరాలకు బంగారు బాటలు వేయాల్సిన వారు! వారి ముందు నాలుగు మంచి మాటలు చెప్తే గుర్తుంచుకుంటారు! వీలైతే జీవితాంతం ఆచరిస్తారు! అలాంటి వారి ముందు మాట్లాడేటప్పుడు బాధ్యతతో వ్యవహరించాలి. కానీ ఇందుకు భిన్నంగా సీఎం రేవంత్‌రెడ్డి తిట్ల దండకాన్ని అందుకున్నారు. కొరివి దయ్యమంటూ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. సాక్షాత్తూ టీచర్ల ముందే బూతుపురాణం వల్లించారు. 'చప్పట్లు కొడితే గుండె పల్గాలె' అంటూ ప్రభుత్వ ఉపాధ్యాయులను పార్టీ కార్యకర్తల్లా భావించి పిలుపునిచ్చారు. డీఎస్సీ–2024లో ఉద్యోగాలు పొందిన టీచర్లకు ఎల్బీ స్టేడియంలో బుధవారం నియామక పత్రాలు అందించే కార్యక్రమంలో పాల్గొన్న సీఎం సభలో మాట్లాడారు. సీఎం ప్రసంగం కోసం కొత్త టీచర్లంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న తరుణంలో మైకు అందుకున్న రేవంత్, కొరివి దయ్యమంటూ ఆక్షేపణీయ వ్యాఖ్యతో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. నాలుగు మంచిమాటలతో స్ఫూర్తి నింపాల్సింది పోయి, సమాజాన్ని తీర్చిదిద్దాల్సిన టీచర్ల మెదల్లో విషాన్ని నింపే ప్రయత్నం చేశారు. రాజకీయ విమర్శలతో సభను పూర్తిగా రాజకీయ పార్టీ కార్యక్రమంలా మార్చారు. గతంలోనూ 'బొందపెట్టి', 'కాళ్లకు తాడు కట్టి బజార్ల ఈడ్చుకెళ్లాలె', 'మగతనం', 'అచ్చోసిన అంబోతు', 'పేగులు మెడలో', 'లాగుల తొండలు' అంటూ మాటలు జారారు. ఇలా రోజురోజుకూ సీఎం బూతుపురాణం మితిమీరుతుండటంపై రాజకీయ విశ్లేషకులు సైతం విస్తుపోతున్నారు. ఆయన భాషను మార్చుకోవాలని హితవు పలుకుతున్నారు.

అవన్నీ దొంగ ప్రకటనలు!

- డిజిటల్ క్రాప్ సర్వేకు ఒప్పుకోలేదు
- అధికారులతో చర్చలు విఫలం
- యథావిధిగా కొనసాగుతున్న ఏఈవోల నిరసన
- పండుగ తర్వాత జేఏసీ ఏర్పాటు, కార్యాచరణ

హైదరాబాద్, అక్టోబర్ 9(నమస్తే తెలంగాణ): డిజిటల్ క్రాప్ సర్వేపై అధికారులతో జరిగిన చర్చలు సఫలమయ్యాయని, సర్వే చేసేందుకు తాము అంగీకరించామని జరుగుతున్న ప్రచారాన్ని ఏఈవోలు ఖండించారు. మంగళవారం వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో జరిగిన చర్చలు పూర్తిగా విఫలమయ్యాయని, తాము సర్వే చేయబోమని తేల్చి చెప్పినట్టుగా తెలిపారు. తమకు తెలియకుండానే దొంగ ప్రకటనలు జారీ చేశారని, తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిజిటల్ క్రాప్ సర్వేపై తాడో పేడో తేల్చుకునేందుకు ఏఈవోలు సిద్ధమవుతున్నారు. అన్ని సంఘాలు కలిసి జేఏసీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పండగ తర్వాత సోమవారం జేఏసీని ఏర్పాటు చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

టీచర్స్ ఎమ్మెల్సీ బరిలో 'గురుకులం'

తొలిసారి పోటీలో నిలబడేందుకు నిర్ణయం

- ప్రత్యేక గుర్తింపు కోసమేనంటున్న గురుకుల టీచర్లు
- ఇతర ఉపాధ్యాయ సంఘాలతో కలిసేందుకు సై
- త్వరలో 2 టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): రెండు టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు త్వరలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు గురుకుల సొసైటీకి చెందిన అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వద్ద బలంగా వినిపించడమే లక్ష్యంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్టు గురుకుల సంఘాల నేతలు చెప్తున్నారు. గురుకుల టీచర్లు సైతం ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రభావితం చేసే స్థాయిలో ఉండటం కూడా వారిని ఆ దిశగా ప్రేరేపిస్తున్నది. వరంగల్–ఖమ్మం–నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ, కరీంనగర్–మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానాలు వచ్చే ఏడాది మార్చిలో ఖాళీ కానున్నాయి. ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ పరిధిలో మొత్తం 25 వేల వరకు ఓట్లు ఉండగా, అందులో గురుకులాల టీచర్లవే ఆరు వేలకుపైగా ఉన్నాయి. కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 28 వేలకుపైగా ఉపాధ్యాయులు ఉండగా, అందులో గురుకులాల నుంచే ఎనిమిది వేలకుపైగా ఉన్నారు. వీటితోపాటు కేజీబీవీలు సైతం ఆయా జిల్లాల పరిధిలో భారీగా ఉన్నాయి. కొత్తగా గురుకులాల్లో నియామకాలు జరిగిన నేపథ్యంలో ఆ మేరకు ఓట్ల సంఖ్య కూడా పెరగనున్నది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసేందుకు దాదాపు 4–5 నెలల క్రితం నుంచే గురుకుల సొసైటీకి చెందిన యూనియన్లు కసరత్తు చేస్తున్నాయి. టీచర్లతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నాయి. టీచర్ ఎమ్మెల్సీ బరిలో నిలిచే ఆశావహుల్లో ప్రధానంగా టిగారియా యూనియన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మధుసూదన్ పేరు వినిపిస్తున్నది. హత్నూర్ సీవోఈలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఆయన వచ్చే ఏడాది ఉద్యోగ విరమణ పొందాల్సి ఉన్నది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిలిచేందుకు వీఆర్‌ఎస్ పెట్టుకుంటున్నారనే ప్రచారం కూడా జోరుగా కొనసాగుతున్నది. ప్రధానంగా కరీంనగర్–మెదక్– నిజామాబాద్–ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్టు యూనియన్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. గురుకుల సొసైటీలకు సంబంధించిన మరో రెండు యూనియన్లకు చెందిన నేతలు కూడా ఈ ఎన్నికల్లో బరిలో నిలిచేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

స్టీరింగ్ కమిటీ ఏర్పాటు

'ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గురుకుల అభ్యర్థిని గెలిపించుకుంటాం' అనే నినాదంతో గురుకుల సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రతినిధి వర్గం బుధవారం ప్రత్యేకంగా టిగారియా కార్యాలయంలో సమావేశమైంది. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గురుకుల ఉపాధ్యాయుడిని అభ్యర్థిగా బరిలో నిలపాలని తీర్మానించింది. గురుకుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపించిన నాయకులెవరైనా సరే ఎమ్మెల్సీ బరిలో నిలిచేందుకు ముందుకు వస్తే, వారిని గెలిపించుకోవడానికి గురుకుల సంఘాలు పనిచేయాలని తీర్మానించారు. ప్రత్యేకంగా స్టీరింగ్ కమిటీని ఏర్పాటుచేశారు. కమిటీ చైర్మన్‌గా టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈటీపీ ఫౌండర్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. గురుకుల సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి మొదటి ప్రాధాన్య ఓటుతోటే గెలిపించాలని జేఏసీ నేతలు మామిడి నారాయణ, డాక్టర్ మధుసూదన్, అంజయ్య పిలుపునిచ్చారు.

ప్రత్యేక గుర్తింపు కోసమే

గురుకుల టీచర్ల సమస్యలను ఎజెండా మీదకు తేవడమే లక్ష్యంగా ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలవాలని భావిస్తున్నట్టు పలు గురుకుల సంఘాల నేతలు చెప్తున్నారు. విద్యాశాఖ పరిధిలోని టీచర్లకు దక్కే ప్రాధాన్యం, అవకాశాలు, వెసులుబాట్లు తమకు లభించడం లేదన్న ఆవేదన గురుకుల ఉపాధ్యాయుల్లో ఉన్నది. గురుకులాల్లో పనివేళలు గతంలో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉండగా, ఇటీవల ప్రభుత్వం దానిని ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటలకు వరకు పొడిగించింది. వీరికి బోధనేతర బాధ్యతలు కూడా అధికమే. దీనికితోడు నైట్ స్టే విధులు కూడా ఉంటాయి. విద్యాశాఖలోని టీచర్లకు వర్తిస్తున్న సర్వీస్‌రూల్స్ గురుకులాల్లోని బోధన, బోధనేతర సిబ్బందికి వర్తించడం లేదు. ఆఖరికి వేతనాలు కూడా 010 పద్దు ద్వారా కాకుండా సొసైటీ ద్వారా నెలలో ఏదో ఒక తేదీన చెల్లిస్తున్న దుస్థితి.

రెండో రౌండ్‌లో లక్ష్యసేన్

వాంటా (ఫిన్‌లాండ్): అర్క్‌టిక్ బ్యాడ్మింటన్ ఓపెన్‌లో భారత యువ షట్లర్ లక్ష్యసేన్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో ప్రత్యర్థి రాస్మస్ జెమ్కె వాకోవర్‌తో లక్ష్యసేన్ తదుపరి రౌండ్‌లో నిలిచాడు. ఇటీవలి పారిస్ ఒలింపిక్స్‌లో తృటిలో కాంస్య పతకం చేజార్చుకున్న లక్ష్యసేన్..రెండో రౌండ్‌లో ఏడో సీడ్ చైనీస్ తైపీ షట్లర్ చో టీన్ చెన్‌తో తలపడనున్నాడు. మరో సింగిల్స్‌లో కిరణ్ జార్జ్ 23-21, 21-18తో వాంగ్ జు వీ(చైనీస్ తైపీ)పై విజయంతో ముందంజ వేశాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్ 21-19, 24-22తో సంగ్ షు యున్‌పై గెలిచి ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించింది.

విలియమ్సన్ లేకుండానే

భారత్‌తో టెస్టులకు కివీస్ జట్టు

అక్లాండ్: భారత్‌తో టెస్టు సిరీస్ కోసం న్యూజిలాండ్ జట్టును బుధవారం ఎంపిక చేశారు. శ్రీలంకతో సిరీస్ సందర్భంగా గాయపడ్డ స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ లేకుండానే కివీస్ జట్టును సెలెక్టర్లు ఎంపిక చేశారు. గజ్జల్లో గాయంతో ఇబ్బంది పడుతున్న విలియమ్సన్ కోలుకునేందుకు మరింత సమయం పట్టే అవకాశమున్న నేపథ్యంలో సెలెక్టర్లు ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. టిమ్ సౌథీ స్థానంలో టామ్ లాథమ్ జట్టును ముందుండి నడిపించనున్నాడు. ఆల్‌రౌండర్ మిచెల్ బ్రేస్‌వెల్ తొలి టెస్టు తర్వాత స్వదేశానికి వెళ్లనుండగా, అతని స్థానాన్ని ఇష్ సోధీ భర్తీ చేయనున్నాడు. ఈ నెల 16 నుంచి బెంగళూరు వేదికగా ఇరు జట్ల మధ్య తొలి టెస్టుపోరు జరుగనుంది.

టాప్-10లోకి అర్ష్‌దీప్‌సింగ్

దుబాయ్: టీమ్‌ఇండియా యువ పేసర్ అర్ష్‌దీప్‌సింగ్..ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో టాప్-10లోకి దూసుకొచ్చాడు. బుధవారం ఐసీసీ విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో అర్ష్‌దీప్ 642 పాయింట్లతో 8వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో మూడు వికెట్లు తీయడం ద్వారా ఎనిమిది ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని అర్ష్‌దీప్ కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్‌కు చేరుకున్నాడు.


గెలిచి నిలిచారు..

హర్మన్‌ప్రీత్, మందన అర్ధసెంచరీలు ● శ్రీలంకపై భారత్ ఘన విజయం ● సెమీస్ రేసులోకి టీమ్‌ఇండియా


మందన (50)

ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు సమిష్టి ప్రదర్శనతో కదం తొక్కింది. కీలకమైన సెమీస్ రేసులో నిలువాలంటే భారీ విజయం తప్పనిసరి అయిన పరిస్థితుల్లో టీమ్‌ఇండియా జూలు విదిల్చింది. నాయక ద్వయం హర్మన్‌ప్రీత్ కౌర్, మందన అర్ధసెంచరీలతో భారీ స్కోరు అందుకున్న భారత్..శ్రీలంకను స్వల్ప స్కోరుకు కట్టడి చేసింది. తద్వారా సెమీస్ రేసులో రెండో స్థానానికి దూసుకొచ్చింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఓటములతో లంకకు నిరాశే ఎదురైంది.

దుబాయ్: టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ ఫేవరేట్లలో ఒకటైన భారత్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. మెగాటోర్నీలో నిలువాలంటే భారీ తేడాతో గెలువాల్సిన స్థితిలో అదరగొట్టింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 82 పరుగుల తేడాతో లంకపై ఘన విజయం సాధించింది. దీంతో 0.576 రన్‌రేట్‌తో గ్రూపు-ఏలో ఆస్ట్రేలియా(2.52) తర్వాత స్థానంలో కొనసాగుతున్నది. తొలుత కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్(27 బంతుల్లో 52 నాటౌట్, 8ఫోర్లు, సిక్స్), స్మృతి మందన(38 బంతుల్లో 50, 4ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీలతో భారత్ 20 ఓవర్లలో 172/3 స్కోరు చేసింది. ఆటపట్టు, కాంచన ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన లంక..19.5 ఓవర్లలో 90 పరుగులకు ఆలౌటైంది. కవిశ(21), అనుష్క(20) టాప్ స్కోరర్లుగా నిలిచారు. అరుంధతిరెడ్డి(3/19), ఆశా శోభన(3/19) మూడేసి వికెట్లు తీశారు. ధనాధన్ అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకమైన హర్మన్‌ప్రీత్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.


కౌర్ (52*)

మందన, కౌర్ దూకుడు: కచ్చితంగా భారీ విజయం సాధించాల్సిన పరిస్థితుల్లో మందన, హర్మన్‌ప్రీత్ అద్భుత ఆటతీరు ప్రదర్శించారు. ఓపెనర్లు షెఫాలీవర్మ, మందన దూకుడైన బ్యాటింగ్‌తో జట్టుకు మెరుగైన శుభారంభం అందించారు. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ వికెట్ కోల్పోకుండా 41 పరుగులు చేసింది. మధ్యలో కొంత ఆట నెమ్మదించినా..వీరిద్దరు వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. అయితే వరుస బంతుల్లో వీరు ఔట్ కావడం ఒకింత ఆందోళన కల్గించినా..కౌర్ వచ్చి రావడంతోనే బ్యాటు ఝులిపించింది. లక్ష్యఛేదనలో లంక ఏమాత్రం పోరాటపటిమ కనబర్చలేకపోయింది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన ధాటికి లంక వరుసగా వికెట్లు కోల్పోయింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 172/3(కౌర్ 52 నాటౌట్, మందన 50, కాంచన 1/29, ఆటపట్టు 1/34), **శ్రీలంక:** 19.5 ఓవర్లలో 90 ఆలౌట్(కవిశ 21, అనుష్క 20, అరుంధతి 3/19, శోభన 3/19)



భారత్ కొత్త చరిత్ర

మహిళల జట్టుకు కాంస్యం

అస్తానా: ఏషియన్ టీటీ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టు కొత్త చరిత్ర లిఖించింది. టోర్నీ చరిత్రలో తొలిసారి కాంస్య పతకాన్ని ఖాతాలో వేసుకుంది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో జపాన్ చేతిలో 1-3 తేడాతో ఓటమితో భారత్‌కు కాంస్య దక్కింది. మరోవైపు పురుషుల క్వార్టర్స్‌లో భారత్ 3-1తో కజకిస్థాన్‌పై గెలిచి వరుసగా మూడోసారి కాంస్య ఖాయం చేసుకుంది. గురువారం జరిగే సెమీస్‌లో చైనీస్ తైపీ లేదా జపాన్‌తో భారత్ తలపడుతుంది. మహిళల పోరు విషయానికొస్తే నాలుగో సీడ్ జపాన్ జట్టుకు భారత్ దీటైన పోటీనివ్వలేకపోయింది. దీనికి తోడు విదేశీ కోచ్ మాసిమో కొస్టాటినీ లేకపోవడం, టాప్ ర్యాంకర్ ఆకుల శ్రీజను బెంచ్‌పై ఉంచడం భారత్ గెలుపు అవకాశాలను దెబ్బతీసింది.

రూట్ రికార్డు సెంచరీ



ముల్తాన్: పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ భారీ స్కోరు దిశగా దూసుకెళుతున్నది. పాకిస్థాన్ బౌలింగ్ దాడిని దీటుగా ఎదుర్కొంటూ ఇంగ్లండ్ బ్యాటర్లు ఇరుగదీస్తున్నారు. ఓవర్‌నైట్ స్కోరు 96/1తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఇంగ్లండ్..జోరూట్(277 బంతుల్లో 176 నాటౌట్, 12ఫోర్లు), హ్యారీ బ్రూక్(173 బంతుల్లో 141 నాటౌట్, 12ఫోర్లు, సిక్స్) సెంచరీల విజృంభణతో ఇంగ్లండ్ ఆట ముగిసే సరికి 3 వికెట్లు కోల్పోయి 492 పరుగులు చేసింది. ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ తన కెరీర్‌లో మరో మైలురాయిని చేరుకున్నాడు. టెస్టుల్లో 35వ సెంచరీతో మరింత ముందంజ వేశాడు.టెస్టుల్లో ఇంగ్లండ్ తరపున అత్యధిక పరుగులు చేసిన కుక్‌ను దాటేశాడు. బౌలర్లకు ఏమాత్రం సహకరించని పిచ్‌పై రూట్, బ్రూక్ నాలుగో వికెట్‌కు 243 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.


రింకూసింగ్ (53)


నితీశ్ (74, 2/23)

నితీశ్ సూపర్ షో

ఆల్‌రౌండ్ ప్రదర్శనతో విజృంభణ

బంగ్లాపై భారత్ భారీ విజయం ● సిరీస్‌లో 2-0తో ముందంజ

అవకాశాలను అందిపుచ్చుకుంటూ కుర్రాళ్లు కుమ్మేశారు. బంగ్లాదేశ్‌తో రెండో టీ20లో తెలుగు యువ క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టాడు. టాపార్డర్ విఫలమైన చోట తాను ఉన్నానంటూ బంగ్లా బౌలర్లను ఉతికి ఆరేస్తూ ఫోర్లు, సిక్సర్లతో చెలరేగాడు. 41 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయిన వేళ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దుతూ రింకూతో కలిసి భారత్‌కు భారీ స్కోరు అందించాడు. ఏడు సిక్స్‌లతో స్టేడియాన్ని ఊపేసిన నితీశ్..బౌలింగ్‌లోనూ రెండు వికెట్లు తీసి ఔరా అనిపించుకున్నాడు. లక్ష్యఛేదనలో భారత బౌలర్ల ధాటికి కుప్పకూలిన బంగ్లా మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను అప్పగించేసింది.

న్యూఢిల్లీ: టీమ్‌ఇండియా యువ క్రికెటర్లు దుమ్మురేపుతున్నారు. బుధవారం జరిగిన రెండో టీ20లో టీమ్‌ఇండియా 86 పరుగుల తేడాతో బంగ్లాను చిత్తుగా ఓడించింది. భారత్ నిర్దేశించిన 222 పరుగుల భారీ లక్ష్యఛేదనలో 9 వికెట్లు కోల్పోయి 135 పరుగులకు పరిమితమైంది. మహ్మదుల్లా(41) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. వరుణ్‌చక్రవర్తి(2/19), నితీశ్‌కుమార్(2/23) రెండేసి వికెట్ల తీశారు. అంతకుముందు నితీశ్(34 బంతుల్లో 74, 4ఫోర్లు, 7సిక్స్‌లు), రింకూసింగ్(29 బంతుల్లో 53, 5ఫోర్లు, 3 సిక్స్‌లు) సూపర్ అర్ధసెంచరీలతో టీమ్‌ఇండియా 20 ఓవర్లలో 221/9 స్కోరు చేసింది. రిషాద్‌హుస్సేన్(3/55) మూడు వికెట్లు పడగొట్టాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన నితీశ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య ఈనెల 12న హైదరాబాద్ మూడో టీ20 మ్యాచ్ జరుగుతుంది.

నితీశ్, రింకూ అదుర్స్:

తొలుత టాస్ గెలిచిన బంగ్లా..భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. మెహదీహసన్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్ వరుస బంతుల్లో శాంసన్(10) రెండు ఫోర్లు కొట్టి దూకుడుగా ప్రారంభించాడు. అయితే ఆ మరుసటి ఓవర్ ఆఖరి బంతికి షాట్ ఆడబోయిన శాంసన్..శాంతోకు క్యాచ్ ఇచ్చి తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. తంజిమ్ మూడో ఓవర్‌లో వరుస ఫోర్లతో జోరు మీద కనిపించిన అభిషేక్ శర్మ(15)..చివరి బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా..నితీశ్‌కుమార్ సంయమనం పాటించాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన ముస్తాఫిజుర్..కెప్టెన్ సూర్యకుమార్(8)ను స్లో బాల్‌తో బోల్తా కొట్టించాడు. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ 3 కీలక వికెట్లు కోల్పోయి 45 పరుగులు చేసింది. ఈ సమయంలో నితీశ్, రింకూసింగ్..ఇన్నింగ్స్ బాధ్యతను భుజానెత్తుకున్నారు. కెరీర్‌లో రెండో మ్యాచ్ ఆడుతున్న నితీశ్ మంచి పరిణతి కనబరిచాడు. రిషాద్ వేసిన 10వ ఓవర్‌లో నితీశ్ కండ్లు చెదిరే సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. తానేం తక్కువ కాదన్నట్లు మరో ఎండ్‌లో రింకూ కూడా చెలరేగడంతో 10 ఓవర్లకు భారత్ 101/3 స్కోరుకు చేరుకుంది. బౌలర్ ఎవరన్నది లెక్కచేయకుండా చెలరేగిన నితీశ్ 27 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన మెహదీని నితీశ్ గట్టిగా అరుసుకున్నాడు. మూడు భారీ సిక్స్‌లకు తోడు ఓ ఫోర్‌తో 26 పరుగులు పిండుకున్నాడు. ముస్తాఫిజుర్ వేసిన మరుసటి ఓవర్‌లో 73 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద నితీశ్ వెనుదిరిగాడు. దీంతో నాలుగో వికెట్‌కు 108 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఓవైపు నితీశ్ ఔటైనా..హార్దిక్‌తో కలిసి రింకూ తన జోరు కొనసాగించాడు. ఈ క్రమంలో ఓ భారీ సిక్స్‌తో అర్ధసెంచరీ ఖాతాలో వేసుకున్న రింకూ తస్కిన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత రియాన్ పరాగ్(15), హార్దిక్(32), వరుణ్(0), అర్ష్‌దీప్‌సింగ్(0) వెంటవెంటనే ఔటయ్యారు.

బంగ్లా ధమాల్:

భారీ లక్ష్యఛేదనలో బంగ్లా ఆది నుంచే తడబాటుకు గురైంది. అర్ష్‌దీప్ మూడో ఓవర్‌లో పర్వేజ్ హుసేన్(16) తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత కెప్టెన్ శాంతో(11)..సుందర్‌కు వికెట్ ఇచ్చుకోగా, లిటన్ దాస్(14)ను వరుణ్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. దీంతో పవర్‌ప్లే పూర్తయ్యే సరికి బంగ్లా 43/3 స్కోరు చేసింది. ఇలా వరుస విరామాల్లో బంగ్లా వికెట్లు కోల్పోతూ వచ్చింది. మిడిలార్డర్‌లో మహ్మదుల్లా ఒంటరిపోరాటం చేసినా లాభం లేకపోయింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 221/9(నితీశ్ 74, రింకూ 53, రిషాద్ 3/55, తస్కిన్ 2/16), **బంగ్లాదేశ్:** 20 ఓవర్లలో 135/9(మహ్మదుల్లా 41, పర్వేజ్ 16, వరుణ్ 2/19, నితీశ్ 2/23)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

అనుకున్న సమయానికే..!



రాజమౌళి దర్శకత్వంలో మహేష్‌బాబు కథానాయకుడిగా అడ్వెంచరస్ యాక్షన్ మూవీ తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా తాలూకు పూర్వ నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. జనవరిలో సెట్స్‌మీదకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని గతంలో వార్తలొచ్చాయి. అయితే ఈ విషయంలో చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో అప్‌డేట్ కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చిత్ర రచయిత విజయేంద్రప్రసాద్ ఈ ప్రాజెక్ట్ గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. అందరూ అనుకుంటున్నట్లుగానే జనవరిలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్తుందని చెప్పారు. ఈ కథ రాయడానికే దాదాపు రెండేళ్లు పట్టిందని, అద్భుతమైన కంటెంట్‌తో సినిమా రాబోతున్నదని పేర్కొన్నారు. ఆయన మాటలతో మహేష్ అభిమానులు సంబరపడిపోతున్నారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు హాలీవుడ్ నటులు కనిపించనున్నారు. భారీ వ్యయంతో పాన్ వరల్డ్ సినిమాగా తెరకెక్కించబోతున్నారు. ఈ చిత్రానికి 'గరుడ' అనే టైటిల్ ఖరారు చేసే అవకాశం ఉందని సమాచారం. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

మీరొస్తే కథలు రాస్తాం



అలియాభట్ ప్రధాన పాత్రలో నటించిన 'జిగ్రా' చిత్రం ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు త్రివిక్రమ్, రానా, సమంత అతిథులుగా పాల్గొన్నారు. ఈ వేడుకలో సమంతను ప్రశంసలతో



ముంచెత్తారు త్రివిక్రమ్. దక్షిణాదిలో రజనీకాంత్ తర్వాత అంతటి ఫ్యాన్‌బేస్ సమంతకు మాత్రమే ఉందన్నారు. ఈ సందర్భంగా త్రివిక్రమ్-సమంత మధ్య ఆసక్తికరమైన సంభాషణ చోటుచేసుకుంది. 'మీరు ముంబయికి మాత్రమే పరిమితం కాకుండా అప్పుడప్పుడు హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమాలకు కూడా రావాలి. ఇక్కడ సినిమాలు చేయండి. మీరు సినిమాలు చేయరేమో అనే భయంలో మేము రాయడం లేదు. మీరు నటిస్తానంటే మేం కథలు రాస్తాం. మీరు ఇక్కడకు రావాలంటే మేమంతా కలిసి 'అత్తారింటికి దారేది' తరహాలో 'సమంత హైదరాబాద్ రావడానికి దారేది' అంటూ హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ చేయాలేమో' అని త్రివిక్రమ్ సరదాగా మాట్లాడారు. మీరు రాస్తే తప్పకుండా తాను ఇక్కడకు వస్తానని సమంత నవ్వుతూ సైగల ద్వారా త్రివిక్రమ్ మాటలకు బదులిచ్చింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.


పతాక ఘట్టాల్లో 'వార్-2'



హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కథానాయకులుగా నటిస్తున్న 'వార్-2' చిత్రం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ భారీ యాక్షన్ చిత్రం ద్వారా ఎన్టీఆర్ బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. అయాన్ ముఖర్జీ దర్శకుడు. యష్‌రాజ్ ఫిలింస్ బ్లాక్‌బాస్టర్ 'వార్'కి సీక్వెల్‌గా తెరకెక్కిస్తున్నారు. చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ వెలువడింది. నవంబర్‌లో క్లైమాక్స్ ఘట్టాల చిత్రీకరణకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. దాదాపు 30 రోజుల పాటు జరిగే ఈ షూట్‌లో యాక్షన్ ఎపిసోడ్స్ హైలైట్‌గా నిలుస్తాయని చెబుతున్నారు. ఇప్పటివరకు భారతీయ సినిమాలో చూపించని విధంగా ఇన్నోవేటివ్ యాక్షన్ సీక్వెన్స్ డిజైన్ చేస్తున్నారని, తొలిభాగం కంటే ఇంటెన్స్‌గా పోరాట ఘట్టాలు ఆకట్టుకుంటాయని మేకర్స్ తెలిపారు. ఈ ఎపిక్ క్లైమాక్స్ ఎపిసోడ్ కోసం కథానాయకులు హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నారని, స్టైంత్ ట్రెయినింగ్, స్పీడ్ బేస్డ్ ఎక్సర్‌సైజ్‌లపై దృష్టి పెడుతున్నారని చిత్ర బృందం పేర్కొంది. విదేశాల్లో చిత్రీకరించే ఈ యాక్షన్ ఎపిసోడ్ ఇండియన్ స్క్రీన్‌పై మెమొరబుల్‌గా నిలిచిపోతుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఏడాది ప్రథమార్థంలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

నాన్‌స్టాప్‌గా నవ్వుతూనే ఉంటారు!

హీరో గోపీచంద్ అంటే యాక్షన్, ఫ్యామిలీ డ్రామాలకు పెట్టింది పేరు. వీటితో పాటు ఆయన అద్భుతమైన కామెడీని కూడా పండిస్తారు. ఈ రెండు అంశాలను పర్‌ఫెక్ట్‌గా బ్లెండ్ చేసిన చిత్రమే 'విశ్వం' అని చెప్పారు గోపీచంద్. ఆయన కథానాయకుడిగా శ్రీను వైట్ల దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం హీరో గోపీచంద్ పాత్రికేయులతో పంచుకున్న విశేషాలు..



శ్రీనువైట్ల గతంలో రెండు కథలు చెప్పారు. అవి బాగున్నా..నాకు అంతగా సరిపోవనిపించింది. 'విశ్వం' సబ్జెక్ట్ పర్‌ఫెక్ట్‌గా కుదిరింది. శ్రీను వైట్ల ఏడు నెలల పాటు స్క్రిప్ట్‌పై వర్క్ చేశారు. ఆయన మార్క్ యాక్షన్, కామెడీ, ఫ్యామిలీ డ్రామా..ఇలా అన్ని అంశాలు చక్కగా కుదిరాయి.

- 'లౌక్యం' తర్వాత అదే స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్ ఈ సినిమాలో కుదిరింది. షూటింగ్ సమయంలో కొన్ని సీన్స్ చేస్తున్నప్పుడు నవ్వు ఆపుకోలేకపోయాను. నా సహ నటీనటులు కూడా అలాగే ఫీల్ అయ్యారు. సినిమాలో అంత అద్భుతమైన కామెడీ పండింది
- అందరూ ఈ సినిమాలోని ట్రెయిన్ ఎపిసోడ్ గురించే మాట్లాడుకుంటున్నారు. 'వెంకీ' చిత్రంలోని పాపులర్ ట్రెయిన్ ఎపిసోడ్‌తో పోల్చుతున్నారు. ఈ రెండు చిత్రాల జోనర్స్ వేరు కాబట్టి పోలిక ఏమాత్రం ఉండదు. ట్రెయిన్ సీక్వెన్స్ హైలైట్‌గా నిలుస్తుంది. వెన్నెల కిషోర్, వీటీ గణేష్, నరేష్, ప్రగతి..అందరూ మంచి కామెడీని పండించారు.
- ఈ సినిమాలో మదర్, ఫాదర్ ఎమోషన్ హార్ట్‌టచింగ్‌గా అనిపిస్తుంది. ఈ కథలో పాప పాత్ర ప్రధానంగా ఉంటుంది. తన చుట్టూ అల్లుకున్న సన్నివేశాలు హృదయాన్ని బరువెక్కిస్తాయి. పాప పాత్ర సినిమాకు చాలా ప్లస్ అయింది.
- శ్రీను వైట్ల సినిమా అంటే యాక్షన్, కామెడీలతో పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైనర్‌లా ఉంటుంది. 'విశ్వం'లో కూడా అవన్నీ బాగా కుదిరాయి. సినిమా ఒక్క సెకన్ కూడా బోర్ కొట్టదు. నాన్‌స్టాప్‌గా నవ్వుల్ని పంచుతుంది. ఈ సినిమాలో నా పాత్ర పేరు విశ్వం. రెండు అక్షరాల టైటిల్స్ నాకు సెంటిమెంట్ అనే కోణంలో ఈ టైటిల్ పెట్టలేదు. కథానుగుణంగా టైటిల్ కుదిరింది.
- మనాలి, ఇటలీ, పర్షియా వంటి సుందరమైన లోకేషన్స్‌లో తీసిన సీన్స్ కన్నులపండువగా అనిపిస్తాయి. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ఓ ఇష్యూని ఈ కథలో చర్చించాం. అది ఆసక్తికరంగా ఉంటుంది. ప్రస్తుతం యువీ క్రియేషన్స్ చిత్రం కోసం కథా చర్చలు జరుగుతున్నాయి. ఆ వివరాలన్నీ త్వరలో వెల్లడిస్తాను.



సింగిల్ సిట్టింగ్‌లో ఓకే చేశా!

కథానాయిక సంయుక్త మీనన్ తొలిసారి మహిళా ప్రధాన కథాంశంలో నటిస్తున్నది. ఆమె ప్రధాన పాత్రలో హాస్య మూవీస్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. యోగేష్ కేఎంసీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రాజేష్ దండా నిర్మిస్తున్నారు. సంయుక్తమీనన్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి రానా దగ్గుబాటి క్లాప్‌నివ్వగా అగ్ర నిర్మాత దిల్‌రాజు కెమెరా స్విఛాన్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'సింగిల్ సిట్టింగ్‌లో సంయుక్తమీనన్ ఈ కథ ఓకే చేసింది. అంతలా ఆమెకు ఈ స్టోరీ నచ్చింది' అన్నారు. 'ఇలాంటి స్క్రిప్ట్ దొరకడం నా అదృష్టం. ఈ సినిమాకు ఫీమేల్ సెంట్రిక్ మూవీ అనే ముద్ర వేయలేం. బలమైన మహిళా ప్రధాన పాత్రతో ఆకట్టుకునే కథ. సామాజిక, రాజకీయ అంశాల ప్రస్తావన కూడా ఉంటుంది. కండబలం అవసరం లేకుండానే స్త్రీ తనదైన రీతిలో దుష్టశిక్షణ చేసే మార్గం ఉంది. ఈ కథ అదే విషయాన్ని చర్చిస్తుంది' అని సంయుక్తమీనన్ చెప్పింది. తమ సంస్థ నిర్మిస్తున్న ఆరో చిత్రమిదని, యాక్షన్ థ్రిల్లర్‌గా ఆకట్టుకుంటుందని నిర్మాత రాజేష్ దండా తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాణం: హాస్య మూవీస్, మాగంటి పిక్చర్స్, ఎడిటర్: ఛోటా కె ప్రసాద్, ఆర్ట్: బ్రహ్మ కడలి, సమర్పణ: సంయుక్త మీనన్, రచన-దర్శకత్వం: యోగేష్ కేఎంసీ.

అందుకే టైటిల్ మార్చలేదు



అగ్ర కథానాయకుడు రజనీకాంత్ నటించిన 'వేట్టయాన్ ది హంటర్' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమాను సురేష్ ప్రొడక్షన్స్‌తో కలిసిన ఏషియన్ సునీల్, దిల్‌రాజు తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఇటీవలకాలంలో తమిళ డబ్బింగ్ చిత్రాలను అదే టైటిల్‌తో తెలుగులో విడుదల చేస్తున్నారని, తెలుగు టైటిల్స్‌ను విస్మరిస్తున్నారని, ఈ ధోరణి మంచిదికాదంటూ సోషల్‌మీడియాలో విమర్శలొచ్చాయి. వాటిపై వివరణ ఇస్తూ బుధవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ 'తెలుగులో ఈ సినిమాకు 'వేటగాడు' అనే టైటిల్ పెట్టాలనుకున్నాం. కానీ ఆ టైటిల్‌ను వేరేవాళ్లు ఆల్రెడీ రిజిస్టర్ చేసుకున్నారు. తెలుగు డబ్బింగ్ సినిమాల విషయంలో తమిళంలోనూ ఒకప్పుడు తమిళ టైటిల్సే పెట్టాలనేవారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. సినిమా గ్లోబల్‌గా ఎదుగుతున్నది. వేరే భాషల్లో ప్రాంతీయ టైటిల్స్ దొరికితే పెడుతున్నారు..లేదంటే అదే టైటిల్‌తో రిలీజ్ చేస్తున్నారు. ఏ టైటిల్ పెట్టినా సినిమా బాగుంటేనే ప్రేక్షకులు చూస్తారు' అన్నారు. డబ్బింగ్ చిత్రాలంటే ఒకప్పుడు చిన్నచూపు ఉండేదని, కానీ ఇప్పుడు సినిమాలు అన్ని భాషల్లో విడుదలవుతున్నాయని, డబ్బింగ్ చిత్రాల వల్ల ఎవరికీ ఏ ఇబ్బంది ఉండదని సురేష్‌బాబు పేర్కొన్నారు. సినిమాకు భాషా భేదాలు, హద్దులు లేవని, కథ ప్రకారం ఏ భాషలోనైనా రిలీజ్ చేయొచ్చని, ఈ సినిమాలో నటించడం అదృష్టంగా భావిస్తున్నానని రానా తెలిపారు.

దయ్యం వెంటాడుతుంది



దాదాపు 17 ఏళ్ల విరామం తర్వాత 'భూల్ భూలయ్యా 3' ఫ్రాంఛైజీలో భాగమైంది కథానాయిక విద్యాబాలన్. కార్తిక్ ఆర్యన్, త్రిప్తి డిమ్రి జంటగా నటించిన ఈ హారర్ కామెడీ చిత్రం నవంబర్ 1న ప్రేక్షకుల ముందుకురానుంది. విద్యాబాలన్, మాధురీ దీక్షిత్ ప్రధాన పాత్రల్ని పోషించారు. బుధవార ట్రైలర్‌ను విడుదల చేశారు. జైపూర్‌లో నిర్వహించిన ఈ వేడుకలో మాట్లాడిన విద్యాబాలన్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. సుదీర్ఘ విరామం తర్వాత తాను ఈ ప్రాజెక్ట్‌లోకి రావడం ఆనందంగా ఉందని చెప్పింది. ఆమె మాట్లాడుతూ 'తొలి రెండు భాగాలకు సంబంధించిన షూటింగ్ ఎక్కువగా జైపూర్‌లోనే షూట్ చేశారు. అలా ఈ నగరంతో ఎంతో అనుబంధం ఏర్పడింది. అందుకే ఈ ట్రైలర్ ఇక్కడ విడుదల చేశాం. తప్పకుండా మీరందరూ ఈ సినిమా చూడండి. లేకపోతే సినిమాలోని దయ్యం పాత్ర మంజులిక మిమ్మల్ని రాత్రిళ్లూ వెంటాడుతుంది. మీకు నిద్ర కరువవుతుంది' అంటూ సరదా మాటలతో నవ్వుల్ని పంచింది. ఈ సినిమాలో కీలకమైన మంజులిక అనే దెయ్యం పాత్రలో విద్యాబాలన్ నటించింది. ఆద్యంతం కామెడీ, హారర్ అంశాలతో ట్రైలర్ ఆకట్టుకుంది. 2022లో విడుదలైన 'భూల్ భూలయ్యా-2' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టింది.

ప్రాణం కన్నా ప్రేమించినా..



అంజన్ రామచంద్ర, శ్రావణి రెడ్డి జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్ రెడ్డి'. స్మరన్ రెడ్డి దర్శకుడు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ నెల 18న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సినిమా నుంచి 'ప్రాణం కన్నా ప్రేమించినా..' అంటూ సాగే గీతాన్ని ఇటీవల విడుదల చేశారు. కైలాష్‌ఖేర్ ఆలపించిన ఈ పాటను కృష్ణకాంత్ రచించారు. హార్ట్‌బ్రేకింగ్ ఎమోషనల్ సాంగ్ ఇదని, ప్రేమికుల మదిలోని బాధను వ్యక్తం చేస్తూ సాగుతుందని దర్శకుడు తెలిపారు. యథార్థ సంఘటనల ఆధారంగా స్వచ్ఛమైన ప్రేమకథగా ఈ చిత్రాన్ని రూపొందించామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ప్రిన్స్ హెన్ని సంగీతాన్నందించారు.

నాగచైతన్య ఎక్స్ ఖాతా హ్యాక్

హీరో నాగచైతన్య ఎక్స్ (ట్విట్టర్) అకౌంట్ హ్యాక్ అయింది. ఈ విషయాన్ని ఆయన టీమ్ తెలిపింది. నాగచైతన్య ఖాతాను హ్యాక్ చేసిన గుర్తుతెలియని వ్యక్తులు బిట్ కాయిన్‌కు సంబంధించిన పోల్ పెట్టారు. 'కొన్నేళ్ల క్రితం 100 బిట్ కాయిన్స్ కొన్నాను. ఇప్పుడు వాటి విలువ 6 మిలియన్ డాలర్లు. వాటిని ఇతరులకు పంచుదామనుకుంటున్నా. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి? అంటూ పోల్ పెట్టారు. అయితే ఈ పోస్ట్ చూసిన చాలా మంది చైతూ అభిమానులు ఆయన ఖాతా హ్యాక్ అయినట్లు గుర్తించారు. మరికొందరేమో పోల్‌లో పాల్గొన్నారు. చివరకు సమస్యను పరిష్కరించిన నాగచైతన్య టీమ్ ఆ పోస్ట్‌ను తొలగించింది. ప్రస్తుతం నాగచైతన్య 'తండేల్' చిత్రంలో నటిస్తున్నారు. మత్స్యకారుల నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.





నేటి అలంకారం

విద్యుద్దామ సమప్రభాం మృగపతి స్కందస్థితాం భీషణాం
కన్యాభిః కరవాలఖేట విలద్ధస్తాభిరాసేవితాం|
హస్తైశ్చక్రగదాసిఖేట విశిఖాంశ్చాపం గుణం తర్జనీం
బిభ్రాణాం అనలాత్మికాం శశిధరాం దుర్గాం త్రినేత్రాం భజే||

దుర్గాదేవి

దుర్గముడు అనే రాక్షసుడిని సంహారం చేసిన శక్తి స్వరూపం దుర్గాదేవి. కోటిసూర్య ప్రభలతో వెలిగే ఈ దేవి భక్తులను సర్వ దుర్గతుల నుంచి కాపాడుతుంది. ఈమె మహాప్రకృతి స్వరూపిణి. సమస్త దేవీదేవతా శక్తులు, తేజస్సులు మూర్తీభవించిన తేజోరూపం ఈమె. సకల శత్రు సంహారిణి. సర్వ దుఃఖాలను నశింపజేస్తుంది. ఉగ్రరూపంతో దుష్టులను ఏవిధంగా సంహరిస్తుందో, అదే సమయంలో పరమశాంతమూర్తిగా తనను కొలిచిన భక్తులను కాపాడుతుంది. ఈ తల్లిని ధ్యానిస్తే సర్వరోగాలు నశిస్తాయి. ఈ రోజు చేమంతి, పొగడ, సంపెంగ, మల్లెపూలతో అమ్మను అర్చించాలి. దానిమ్మ పండు సమర్పించాలి. పొంగలి, పులిహోర, పులగం నివేదించాలి.

సద్దుల బతుకమ్మ

బతుకమ్మ ఉత్సవానికి ఘనమైన ముగింపు పలుకుతుంది సద్దుల పండుగ. దుర్మార్గుడైన దుర్గముడు అనే రాక్షసుణ్ని సంహరించి, సకల లోకాలను కాపాడిన ఆదిశక్తి.. దుర్గామాతగా కొలువుదీరిన మహోన్నతమైన రోజు ఇది. అందుకే ఈ రోజును దుర్గాష్టమిగా జరుపుకొంటారు. అలసిన అమ్మవారికి భక్తులు ఘనమైన పాకాలు నివేదన చేస్తారు. గ్రామీణులు సద్దుల పేరుతో పులగం, పులిహోర, చిత్రాన్నం, నువ్వులసద్ది, కొబ్బరిసద్ది, పెరుగన్నం ఇలా వివిధ రకాలైన సద్దులు చేస్తారు. అందుకే చివరిరోజు వేడుకకు సద్దుల బతుకమ్మ అనే పేరు వచ్చింది. దీనినే పెద్ద బతుకమ్మ అని కూడా అంటారు. మిగతా రోజులకన్నా భిన్నంగా, పెద్ద పెద్ద బతుకమ్మలు చేస్తారు. సాయంత్రం కాగానే పిల్లాజెల్లా అందరూ బతుకమ్మ ఆడటానికి అందంగా ముస్తాబై కదలివస్తారు. మగవాళ్లు సైతం ఈ ముచ్చటను చూసేందుకు ఉత్సాహం కనబరుస్తారు. ఊరంతా చెరువు కట్టకు ఊరేగింపుగా తరలివెళ్తారు.

‘తంగేడు పూవుల్ల చందమామ..
బతుకమ్మ పోతుంది చందమామ
పోతె పోతివిగాని చందమామ..
మళ్లెప్పుడొస్తావు చందమామ
ఏడాదికోసారి చందామామ..
నువ్వొచ్చి పోవమ్మ చందమామ’ అంటూ

తమకు బతుకునిచ్చిన పరమేశ్వరికి ఘనంగా వీడ్కోలు పలుకుతారు.

● డా॥ ఆర్.కమల



నమస్తే తెలంగాణ
జిందగీ II
హైదరాబాద్ | గురువారం 10 అక్టోబర్ 2024 www.ntnews.com





ఒక జాతి అస్తిత్వం దాని సంస్కృతిలో సమ్మిళితమై ఉంటుంది. ప్రజల వేషభాషలు, జీవనవిధానం, వేడుకలు, పండుగలు దానికి ప్రతీకలు. ఆ విధంగా తెలంగాణ అస్తిత్వ పతాక బతుకమ్మ. తరాల నుంచీ ఆ సంప్రదాయాన్ని భుజాన మోస్తున్న వారంతా ఈ మట్టికి వారసులే. అలాంటి అసలు సిసలైన వారసురాలే ద్యావనపల్లి లింగమ్మ. తొంభయ్యేండ్ల పై బడిన వయసున్న ఆమెకు వందేండ్లకు పూర్వపు బతుకమ్మ పాటలు వందలు వచ్చు. అచ్చంగా ఆమె చెప్పిన పాటలతోనే తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ పుస్తకమూ అచ్చేసింది. ‘అఆలు రానిదాన్ని వందల పాటలు పాడితిని.. వందల పుస్తకాలు చదివేటోళ్లు ఒక్క పాటన్న నేర్వరా తల్లి..’ అంటున్న ఆమెతో జిందగీ కలబోసుకున్న సంగతులు..

35 రోజులు బతుకమ్మ ఆడుతుండే!

నా పేరు ద్యావనపల్లి లింగమ్మ. నాకు తొంబై ఏండ్ల పైన వయసుంటది. ఇగ, పాటలంటే నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ పాడుతున్న. ఒడ్లు దంచాలంటే పాట, ఇసుర్రాయి పాట, పెండ్లి పాట, గడపల్ల పాట, బిడ్డ పుడితే పాట, నాట్లేసే చోట పాట, కలుపు తీసే చోట పాట... ఇట్ల ఎన్ని పాటలు పాడుతుంటిమో లెక్కే లేదు. ఒక్కొక్కప్పుడు ఒక్కో రకం పాటలు పాడుతుంటిమి. బతుకమ్మ పండుగొచ్చిందంటే పాటల పండుగే అచ్చినట్టుండేది. మా తల్లిగారి ఊళ్ల, మా అత్తగారి ఊళ్ల అన్ని చోట్ల పండుగంటే పాటంటే నేనే ముందుండేది. ఎక్కడ పాట పాడిన ఏ తల్లి కన్నదమ్మ నిన్ను అంటుంటిరి. అంత ఇష్టంతోని పాడుతుంటిని, అందరు నాతోటి పాడుతుండె. ఇంతకీ నేను పుట్టిన ఊరు అప్పటి కరీంనగర్ జిల్లా రామగుండం దగ్గరి ఎగులాసపురం, మా అత్తగారి ఊరు వెల్గటూర్ దగ్గరి చెగ్గాం.

ఒక్కపాట నెల రోజులు...

మా చిన్నప్పుడు చవితి పండుగ (వినాయక చవితి) అయిన తెల్లారి నుంచి బతుకమ్మ ఆట మొదలు పెట్టేది. ఇన్ని పూలు తెంపి సిబ్బి (వెదురు పుల్లలతో అల్లిన బుట్ట)ల పోసి మధ్యలో పెట్టుకొని చుట్టు తిరుగుకుంట పాటలు పాడేది. చీకటి పడక ముందే ఆడపిల్లలంత ఒక్క చోటికి చేరేది. ఇగ ఆ రోజు మొదలు పెట్టి మళ్లీ సద్దుల బతుకమ్మ దాక... అంటే 35 రోజులు మేం అప్పట్ల బతుకమ్మ ఆడేటోళ్లం. అప్పుడు బతుకమ్మ అంటే ఎన్నో రోజుల సంబురం. మా అమ్మమ్మ వాళ్లది మంథని. అక్కడోళ్లకు బాగ పాటలస్తయ్. మా అమ్మ కూడ మంచిగనే పాడేది. ఆమె దగ్గర కొన్ని నేర్చుకున్న. మా ఊళ్ల జంగాలోళ్లు, వీధి బాగోతులు, ఒగ్గు కథలు, హరి కథలు, బుర్ర కథలు చెప్పేటోళ్లు వచ్చి కథలు చెబుతుండె. అవ్వన్నీ వింటుంటిమి. ఇగ, విన్న కథలన్ని పాటలు కట్టి పాడుతుంటిని. మా చిన్నప్పుడు ఒక ముసలోడు మంచిగ పాడుతుండే. రోజుకు అరసోలుడు జొన్నలిత్తె పాటలు జెప్పేది. ఆయన ఎన్క మేం పాడుతుంటిమి. ఇంకో ముసలవ్వ కూడా వచ్చేది... గట్కకు జొన్నలిత్తే పాటలు జెప్పేది. అప్పుడు తిననీకి సరిపడ బువ్వెక్కడిది. ఇట్ల పాటలు జెప్పి ఇంత గట్క జేస్కొని తాగుతుండేటోళ్లు. అట్ల అందరి దగ్గర పాటలు నేర్చుకున్న. ఎక్కడికి పోయిన పాటలు పాడిన. రామాయణం పాట, భారతం పాట, సతీ సావిత్రి పాట, అనసూయ పాట... ఇట్ల ఎన్నో పురాణాలు, కథలన్నింటిని పాటలు కట్టి పాడేది. బతుకమ్మ నెలకు పైన సాగేది కదా... పాటలు కూడా అట్లనే. రామాయణం పాట ఇయాల మొదలు పెడితే నెలంత సాగేది. కథ కదా... ఇయాల కొంత జెప్పుడు మళ్లీ రేపు పాడుడు... అట్ల రోజుల కొద్దీ పాటలు పాడుతుంటిమి. ఎల్లమ్మ పాట, మల్లన్న దేవుడి పాట, మల్లన్న దేవుడి పెండ్లి పాట, ఎములాడ రాజన్న పాట, ధర్మపురి నరసన్న పాట.. ఇట్ల మేం కొలిచే దేవుళ్లందరి కథలు పాటలు పాడుతుంటిని. అందుకే ఎన్ని పాటలస్తయ్యంటే లెక్కజెప్పలేను. వందలు వందలు పాడొచ్చు. మా అబ్బాయి సత్యనారాయణ కొన్ని పాటలు జెప్పిచ్చుకొని అందరికీ పనికస్తయ్యని పుస్తకమేయించిండు. నా ఇద్దరు బిడ్డలు కూడా ఈ పాటలు పాడుతరు. నీకేం పాట ఇష్టమని అడుగుతుంటరు... అన్ని పాటలు నాకిష్టమే. పాటంటేనే ఇష్టం.

బాధలోనూ పాడిన...

బతుకమ్మ పండుగంటే నెల రోజుల ముందు మొదలు పెడుతుంటిమని జెప్పిన కదా. బతుకమ్మ పేర్చుడు మాత్రం ఇప్పటి లెక్కనే అమావాస్య రోజే మొదలు. బతుకమ్మలు పెట్టనీకి బాయి కూడా అవ్వాళనే తవ్వేటోళ్లం. ఇగ మా మామ కులపు పెద్ద. దాంతోని మా ఇంటి ముందే బాయి తవ్వి బతుకమ్మలు పెడుతుండె. అంటే గుండ్రంగా బాయి లెక్క తవ్వి, అందుల మధ్యల వెంపలి చెట్టు నాటి, చుట్టూ గద్దెలెక్క అలుకుదుము. ఆ గద్దెల మీద బతుకమ్మలు పెట్టుకుంటరు. అయితే ఒక ఏడాది నా బిడ్డ కొడుకు ఏడాది పిలగాడు సచ్చిపోయిండు. అదే ఏడాది అమ్మ కూడా దూరమైంది. ఇగ, నా మనసు ఎట్లుంటది. ఆడబుద్ధి కాలె. బతుకమ్మ పేర్చబుద్ధి కాలే. సప్పుడు చేయక ఉన్నా. ఊళ్ల వాళ్లు ఆడుతరు గదా... సద్దుల బతుకమ్మ రోజు కూడా ఆట సప్పుడైతలేదు. ఇదేంది అని చూద్దును గదా... అందరు అక్కడ బతుకమ్మలు పెట్టుకొని ఉత్తగనే నిలవడ్డరు. ఏమైందంటే పాట చెప్పేటోళ్లు లేరన్నరు. ఇగ, కష్టమో నష్టమో ఏం చేస్త అనుకొని దేవుడికి మొక్కి పాట నేనే చెప్పిన. అట్ల మనసెట్లున్న బతుకమ్మ పాట మాత్రం విడువలే.

పాడుకుంటూ ఆడాలె

అప్పట్లో చప్పట్లు కొట్టుకుంట ఆటాడేది. ఇప్పుడేందో కొత్తగ కోలలచ్చినయి. మునుపు మన దగ్గర లేదు ఇది. సద్దుల బతుకమ్మ రోజు చిన్న బతుకమ్మను చేతిల పట్టుకొని పెద్ద బతుకమ్మకు పూలు, అక్షింతలు, పసుపు, కుంకుమ వేసుకుంట తిరిగేటోళ్లం. అప్పుడో పాట ఉంటది. గౌరమ్మ పాటలని ఉంటయి. బతుకమ్మలు చెరువులో కలిపేటప్పుడు పాట పాడుకునేటోళ్లం. అదో ఆనందం. ఇప్పుడు ఆడోళ్లు చెరువు దగ్గరికే పోతలేరు. ఇగ పాటలేడ. నాకు అఆలు కూడా రావు. ఒక్క పుస్తకం గూడ చదవలే. కానీ బతుకమ్మ అంటే ఇష్టం. మంచిగ ఆడుకోవాల్నని ఎన్నో పాటలు నేర్చుకున్న. మరి ఇప్పుడు అందరు చదువుకున్నోళ్లే. వందల పుస్తకాలు చదివినోళ్లే. పాడాల్నకుంటే రావానమ్మ! ఒక్క పాటన్న నేర్వకపోతే ఎట్ల తల్లి! పండుగంటే బతుకమ్మ జేస్తున్నరు. కొత్త చీరలు కడుతున్నరు. సొమ్ములేసుకుంటున్నరు. పాట మాత్రం పాడతలేరు. మైకుల పాటకు మనం ఆడుడేంది. ఆ దేవుడు నోరిచ్చిండు.. చేతులు కాళ్లిచ్చిండు. సక్కక పాడుకుంట ఆటాడాలె. లేకపోతే అదేం బతుకమ్మ సంబురం!! అయిన అట్ల ఏవో పాటలకు ఆడితే మనకు తరాల నుంచి వచ్చే పాటలు, ఆచారాలు ముందటోళ్లకు ఎట్ల తెలుస్తయ్ చెప్పుర్రి.

...లక్ష్మీహరిత ఇంద్రగంటి

ఫొటో: జి.భాస్కర్






ఆకు మీద తేలియాడుదాం..









బతుకమ్మ పేర్పులో కలువపూలు ప్రత్యేకం. చెరువుతో కొద్ది పాటి సంబంధం ఉన్న వాళ్లకి కూడా నీటి మీద తేలియాడే తామరాకులు, కలువ తీగలూ సుపరిచితాలే. అయితే ఇక్కడి చిత్రాల్లో ఉన్నది కూడా కలువ తీగే. ప్రపంచంలోనే నీటిలో పెరిగే వాటిలో అతి పెద్ద ఆకులు కలిగి ఉండటం దీని ప్రత్యేకత. విక్టోరియా అమెజానికా, విక్టోరియా వాటర్ లిల్లీగా పిలిచే దీని ఆకులు సుమారు పది అడుగుల వెడల్పుదాకా పెరుగుతాయి. అంతేకాదు, ఇవి చాలా బలమైనవి కూడా. వీటి మీద చిన్న పిల్లలు, నాజూగ్గా ఉన్న పెద్దవాళ్లు కూడా చక్కగా కూర్చోవచ్చు. దీనిలో మరో చిత్రమూ ఉంది. దీనికి పూసే కలువలు తొలి రోజు తెల్లగా, మర్నాడు గులాబీ రంగులో, తర్వాతి రోజు ఊదా రంగులో ఉంటాయట. తెలుపు రంగు పూలు విరజిమ్మే సువాసనకు వచ్చిన ప్రత్యేక రకానికి చెందిన తుమ్మెదలు, పూలు మూత పడే సమయానికి అందులోనే ఉంటాయట. మర్నాడు రాత్రి మళ్లీ విచ్చుకునే వేళకు అవి బయటికి ఎగిరిపోతాయి. మరోనాడు మరో పువ్వులో నిద్రపోతూ పరపరాగ సంపర్కానికి ఈ తుమ్మెదలు సాయపడతాయట. ఇంత చిత్రమైన ఈ మొక్క అమెజాన్ నదీ పాయల దగ్గరి మడుగుల్లో తొలుత కనిపించిందట. ప్రస్తుతం మన దేశంలోనూ వీటిని పెంచుతున్నారు. ఇంత పెద్దగా ఉండే ఈ మొక్క ఆకుల్ని చూసి ముచ్చటపడుతున్న కొందరు, ఇదిగో ఇలా వాటి మీద కూర్చుని ఫొటోలు తీసుకుంటున్నారు. ఆకు పడవలో ఊయలలూగుతున్నారు!

చిత్తు చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ
బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన
చిత్తు చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ
బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన
రాగి బిందె తీసుక రమణి నీళ్లకు పోతే
రాములోరు ఎదురాయెనమ్మో ఈ వాడలోన
చిత్తు చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ
బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన
వెండి బిందె తీసుక వెలది నీళ్లకు పోతే
వెంకటేషుడు ఎదురాయెనమ్మో ఈ వాడలోన
చిత్తు చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ
బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన
బంగారు బిందె తీసుక భామా నీళ్లకు పోతే
భగవంతుడు ఎదురాయెనమ్మో ఈ వాడలోన
చిత్తు చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ
బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన
పగిడి బిందె తీసుకు పడితి నీళ్లకు పోతే
పరమేశుడు ఎదురాయెనమ్మో ఈ వాడలోన
చిత్తు చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ
బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన
ముత్యాల బిందె తీసుక ముదిత నీళ్లకు పోతే
ముద్దు కృష్ణుడెదురాయెనమ్మో ఈ వాడలోన
చిత్తు చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ
బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన
చిత్తు చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ
బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన

పొట్టుతో పుట్టెడు మేలు

ఉల్లి చేసే మేలు.. తల్లి కూడా చేయదని అంటారు. అయితే, ఉల్లి పొట్టుతోనూ ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. చెత్త బుట్టలో పడేసే ఆ పొట్టుతో.. పుట్టెడు లాభాలు పొందవచ్చు.

- ఉల్లిపాయ పొట్టులో ఉండే యాంటి ఆక్సిడెంట్ లక్షణాలు.. కండరాల నొప్పులను తగ్గించడంలో సమర్థంగా పనిచేస్తాయి.
- ఒక గ్లాసు నీటిలో కొంత ఉల్లిపాయ పొట్టు వేసి, పదిహేను నిమిషాలపాటు బాగా మరిగించాలి. ఆ నీటిని వడగట్టి తాగితే.. కండరాల నొప్పులు తగ్గుముఖం పడుతాయి.
- జుట్టు సంరక్షణకు ఉల్లిపాయలతో ఎంత ప్రయోజనం ఉంటుందో.. ఉల్లి పొట్టు కూడా అంతే సాయపడుతుంది. దీనిలో సల్ఫర్ ఎక్కువ. ఇది జుట్టు పెరుగుదలకు ఉపయోగపడే కొలాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. జుట్టు తెల్లబడకుండా కాపాడుతుంది.



- ఒక గ్లాసు నీటిలో నాలుగోవంతు ఉల్లి పొట్టును తీసుకొని.. గంటసేపు బాగా మరిగించాలి. ఈ మిశ్రమాన్ని రాత్రంతా అలాగే వదిలేసి, మరుసటి రోజు ఉదయాన్నే వడబోసి.. జుట్టుకు బాగా పట్టించాలి. 30 నిమిషాలపాటు ఆరనిచ్చి.. తలస్నానం చేస్తే జుట్టు తెల్లబడటం తగ్గుతుంది. చుండ్రు కూడా తొలగిపోతుంది.
- యాంటి ఫంగల్ గుణాలు కలిగిన ఉల్లిపాయ పొట్టు.. చర్మ సమస్యలకు చెక్ పెడుతాయి.
- ఉల్లి పొట్టును నీటిలో మరగబెట్టి దురద, దద్దుర్లు ఉన్న చోట పూస్తే.. మంచి గుణం కనిపిస్తుంది.
- ఉల్లి పొట్టుతో టీ చేసుకొని తాగితే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ‘ఉల్లి టీ’.. నిద్రలేమిని దూరం చేయడంతోపాటు కంటి ఆరోగ్యాన్నీ మెరుగుపరుస్తుంది.
- రెండు కప్పుల నీటిలో ఉల్లి పొట్టు వేసి.. నీటి రంగు మారే వరకూ మరిగించాలి. ఆ తర్వాత వడపోసి, ఒక టీస్పూన్ తేనె కలుపుకొంటే.. ‘ఉల్లి టీ’ సిద్ధం!

యూట్యూబ్ షాట్స్@3 నిమిషాలు

బ్యూటీ చిట్కాలు.. ఊరించే వంటలు.. ట్రెండీ ఫ్యాషన్ వీడియోలతో యూట్యూబ్ కంటెంట్ మీరూ చేస్తున్నారా? అయితే, షార్ట్‌టైమ్‌లో ఆడియన్స్ కనెక్ట్ అయ్యేందుకు ‘షాట్స్’ని మరింత భిన్నంగా ప్లాన్ చేయొచ్చు. ఇకపై యూట్యూబ్ షాట్స్ నిడివిని.. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ మాదిరిగా పెంచొచ్చు. అందుకు తగిన ఫీచర్‌ని ప్రత్యేక టెంప్లెట్‌లా అందించేందుకు సిద్ధమైంది యూట్యూబ్. ఈ టెంప్లెట్‌తో నయా స్టైల్స్‌తో షాట్స్‌ని రూపొందించొచ్చు. ఈ నెల 15 తర్వాత మూడు నిమిషాల షాట్స్‌ను యూజర్లు అప్‌లోడ్ చేసే ఫెసిలిటీ అమల్లోకి రానుంది. ఇతరులు ట్రెండింగ్ చేస్తున్న క్లిప్స్ నుంచి ఎడిటింగ్ స్టైల్స్, సౌండ్స్‌ని ఎక్స్‌ట్రాక్ట్ చేసేందుకు ఈ షాట్స్ ‘టెంప్లెట్’ టూల్ ఉపయోగపడుతుంది. షాట్స్‌ని ఎడిట్ చేసేందుకు ఇదో సింపుల్ ప్రాసెస్ అన్నమాట. షాట్స్‌లో లాంగ్ వీడియోలను పెట్టుకునే వెసులుబాటు కల్పించాలని యూజర్ల నుంచి అభ్యర్థనలు రావడంతో యూట్యూబ్ ఈ ఫీచర్‌ని అందుబాటులోకి తీసుకొస్తున్నది. అంతేకాదు.. ఇన్‌స్టాకు దీటుగా యూజర్లు కంటెంట్ క్రియేట్ చేసుకునేలా నయా ఫీచర్లను అందుబాటులోకి తెస్తున్నది.

